అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సోమవారం 30-12-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 361 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50


14లో..

చెస్ క్వీన్ కోనేరు హంపి

ప్రపంచ ర్యాపిడ్ చాంపియన్‌గా తెలుగమ్మాయి

కెరీర్‌లో రెండోసారి వరల్డ్ టైటిల్ వశం

చదరంగంలో కోనేరు హంపి (37) చరిత్ర సృష్టించింది. చైనా అమ్మాయి జు వెంజున్ తర్వాత అత్యధిక సార్లు ప్రపంచ ర్యాపిడ్ టైటిల్ సాధించిన ఘనత దక్కించుకుంది. ఆఖరు రౌండ్లో ఇండోనేసియా గ్రాండ్‌మాస్టర్ ఐరిన్ సుకందర్‌ను ఓడించిన కోనేరు హంపి రెండోసారి వరల్డ్ ర్యాపిడ్ విజేతగా నిలిచింది.

కన్హా శాంతివనంలో సీఎం రేవంత్‌రెడ్డి

విద్యార్థులకు అందించే సాఫ్ట్ స్కిల్స్ గురించి ఆరా



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కన్హా గ్రామంలోని కన్హా శాంతి వనంను ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి ఆదివారం సందర్శించారు. ఇక్కడ చిన్నారులు, విద్యార్థులకు అందించే సాఫ్ట్ స్కిల్స్‌కు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. కళ్లకు గంతలు కట్టుకుని రంగులను గుర్తించడం, పదాలను చదవడం వంటి స్కిల్స్‌ను అక్కడి విద్యార్థులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారిని సీఎం అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూల్స్‌లోనూ ఇలాంటి ఆహ్లాదకరమైన నైపుణ్యాలు ఉండాలనీ, దానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం ...13లో



ఆ హుందాతనం నేడేది?

నెహ్రూ నుంచి పీవీ వరకూ ప్రతిపక్షానికి సముచిత గౌరవం

సంకీర్ణ శకంలో మారిన సీను

మోడీ హయాంలో దిగజారిన సంబంధాలు

లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై ఈ నెల 19వ తేదీన ఎఫ్ఐఆర్ నమోదైంది. సభలో బీజేపీ ఎంపీలను నెట్టారని, ఫలితంగా ఇద్దరు సభ్యులు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చేరారని వచ్చిన ఆరోపణలను పురస్కరించుకొని ఆయనపై కేసు పెట్టారు. దీనికితోడు రాహుల్ తన పట్ల దురుసుగా ప్రవర్తించా రంటూ నాగాలాండ్‌కు చెందిన బీజేపీ మహిళా ఎంపీ కూడా ఫిర్యాదు చేశారు. ఈ రెండు ఆరోపణలను గమనిస్తే బీజేపీ తన పార్లమెంటరీ ప్రతిపక్షం విషయంలో ఎంత శతృత్వ భావంతో ఉన్నదో అర్థమవుతోంది. తనపై వచ్చిన ఆరోపణలను రాహుల్ తోసిపుచ్చినప్పటికీ బీజేపీ మాత్రం నానా యాగీ చేసింది.

న్యూఢిల్లీ : లోక్‌సభలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య సంబంధాలు ఎంత దిగజారిపోయాయో ఇటీవలి ఘటనలు రుజువు చేస్తున్నాయి. 17వ లోక్‌సభలో రాహుల్ గాంధీని స్పీకర్ ఓం బిర్లా సభ నుంచి సస్పెండ్ చేసిన విషయం విదితమే. స్పీకర్ నిర్ణయాన్ని తప్పుపడుతూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత కానీ రాహుల్ సభలో అడుగు పెట్టలేదు. 2014లో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ ప్రతిపక్షాలపై అధికార పక్షం దుందుడుగా వ్యవహరిస్తూనే ఉంది. పార్లమెంటులో మోడీ ప్రసంగించిన ప్రతి సందర్భంలోనూ ముందుగా ఆయన భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూపై విమర్శల దాడి చేస్తుంటారు. ఉద్దేశపూర్వకంగా, పదేపదే మోడీ చేస్తున్న ఈ విమర్శల్లో వాస్తవాలు కన్పించవు. 2014 లోక్‌సభ ఎన్నికల ప్రచార సమయంలోనూ రాహుల్‌ను బీజేపీ మీడియా విభాగం 'పప్పు' అంటూ కించపరిచింది.

నెహ్రూ పాలనలో...

స్వాతంత్ర్యానంతరం 1951-52లో దేశంలో తొలిసారి సాధారణ ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ అఖండ విజయం సాధించి, నెహ్రూ ప్రధాని అయినప్పటికీ ప్రతిపక్షాలను ఏనాడూ అవమానించింది లేదు. నిజానికి అప్పుడు కాంగ్రెస్‌లోని ...6లో

మోడీ ఏలుబడిలో...

2014 తర్వాత పరిస్థితిలో బాగా మార్పు వచ్చింది. అది పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎంత మాత్రం ఆరోగ్యకరమైన పరిణామం కాదు. ప్రధానమంత్రి ఎగువసభకు వచ్చినా, దిగువసభకు వచ్చినా ప్రజా సమస్యలన్నీ పక్కన పెట్టి ముందుగా నెహ్రూను, ఆ తర్వాత కాంగ్రెస్‌ను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారు. ఆయన అనుచర గణం కూడా నెహ్రూ తప్పిదాలను ఏకరువు పెట్టింది. జాతీయోద్యమ నేతలైన సర్దార్ వల్లభాయ్ పటేల్, అంబేద్కర్ వంటి వారిని నెహ్రూ చిన్నచూపు చూసేవారంటూ బీజేపీ శ్రేణులు దాడులకు దిగారు. విధానాలు, పద్ధతుల విషయంలో వారితో నెహ్రూ విభేదించి ఉండవచ్చు. కానీ మోడీ ఏలుబడిలో ఆ విభేదాలకు పచ్చి అబద్ధాల రంగు పులిమి ప్రచారం చేస్తున్నారు. ఆధునిక భారత రాజకీయ చరిత్రలో నెహ్రూను అతి పెద్ద విలన్‌గా చిత్రీకరించజూస్తున్నారు.

ఇందిరా హయాంలో

ఇందిరాగాంధీ హయాంలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య సంబంధాలు అంత సజావుగా లేనప్పటికీ ఆమె తరచూ వాజ్‌పేయి వంటి సీనియర్ నేతలను సంప్రదించే వారు. రాజీవ్ గాంధీ ప్రధాని అయిన తర్వాత ఐక్యరాజ్యసమితికి పంపిన అధికారిక ప్రతినిధి బృందంలో వాజ్‌పేయిని సభ్యుడిగా చేర్చారు. దీంతో ఆయన తన కిడ్నీ వ్యాధికి అక్కడే చికిత్స పొందగలిగారు. పీవీ నరసింహారావు ప్రధానిగా పని చేసినప్పుడు జెనీవాలో జరిగిన ఐరాస మానవ హక్కుల కమిషన్ ప్రత్యేక సమావేశానికి మన దేశం నుండి పంపిన ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించింది ప్రతిపక్ష నాయకుడు వాజ్‌పేయే. జమ్మూకాశ్మీర్‌లో మానవ హక్కుల పరిస్థితిపై భారత్‌ను అభిశంసించాలంటూ పాకిస్తాన్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని వాజ్‌పేయి విజయవంతంగా తిప్పికొట్టారు.

దక్షిణ కొరియాలో ఘోర విమాన ప్రమాదం

179 మంది మృతి..ఇద్దరు సేఫ్



సాంకేతిక వైఫల్యంతో అదుపు తప్పిన పాసింజర్ ఫ్లైట్

రక్షణ గోడను ఢీకొట్టి మంటల్లో చిక్కుకొని దగ్ధం

థాయ్‌ల్యాండ్ నుంచి 181 మందితో బయలుదేరిన విమానం

మువాన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో ఘటన

ల్యాండింగ్ గేర్ వైఫల్యమే కారణం?

న్యూఢిల్లీ : ఇటీవలి కజకిస్థాన్‌లో విమాన ప్రమాదం ఘటన మరవకముందే దక్షిణ కొరియాలో మరొక దారుణం చోటు చేసుకున్నది. థాయ్‌ల్యాండ్ రాజధాని బ్యాంకాక్ నుంచి 181 మందితో బయలు దేరిన విమానం..ఆదివారం ఉదయం దక్షిణ కొరియాలోని మువాన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండ్ అవుతూ అదుపు తప్పింది. రన్‌వేపై నుంచి కంచెలోకి దూసుకెళ్లింది. రన్‌వేను తాకుకుంటూ వెళ్లిన విమానం ...6లో

'ఢిల్లీలో ఆపరేషన్ లోటస్'

బీజేపీపై కేజ్రీవాల్ విమర్శలు



న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ బీజేపీపై విరుచుకుపడ్డారు. ఓటర్ల జాబితాలో ఆ పార్టీ అవకతవకలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఢీల్లీ అసెంబ్లీ ఎన్నికలను ప్రభావితం చేసేందుకు (ఆపరేషన్ లోటస్) కుట్ర చేస్తోందని మండిపడ్డారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన పై విధంగా వ్యాఖ్యలు చేశారు."ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో తమకు ఓటమి తప్పదనే విషయం బీజేపీకి ...13లో



సంక్రాంతి తర్వాత రైతు భరోసా

కసరత్తు ప్రారంభించిన మంత్రివర్గ ఉప సంఘం

ఎన్నికల హామీకి సర్కారు కట్టుబడి ఉంది : మల్లు భట్టి విక్రమార్క

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

సంక్రాంతి పండుగ తర్వాత రైతు భరోసాను రైతుల ఖాతాల్లో వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ఆదివారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో అందుకు సంబంధించిన విధి, విధానాలపై మంత్రివర్గ ఉపసంఘం భట్టి అధ్యక్షతన సమావేశమైంది. రైతు భరోసా విధి, విధానాల కోసం రెండు గంటల పాటు ఉపసంఘం చర్చించింది. సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. పథకం ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకు రైతు భరోసా అందించిన తీరు, క్యాబినెట్ సబ్ కమిటీ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించిన క్రమంలో రైతులు వ్యక్తం చేసిన అభిప్రాయాలను, అధికారులు సేకరించిన ...6లో



పాఠకుల మదిని దోచిన పుస్తకాల పండుగ

11 రోజుల పాటు సాగిన వేడుక | 13 లక్షల మందికి పైగా పుస్తక ప్రియుల సందర్శన

- 70కి పైగా కొత్త పుస్తకాల ఆవిష్కరణ
- బుక్‌ఫెయిర్లో ఆకర్షణగా నిలిచిన రాజ్యాంగం
- సీఎంతో పాటు గవర్నర్ తదితర ప్రముఖుల రాక

ఘనంగా ముగిసిన 37వ హైదరాబాద్ పుస్తక ప్రదర్శన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో కొలువుదీరిన హైదరాబాద్ బుక్‌ఫెయిర్ 37 జాతీయ పుస్తక ప్రదర్శన జయప్రదంగా ముగిసింది. డిసెంబర్ 19నుంచి 29 వరకు సాగిన పుస్తకాల పండుగ పాఠకులను ఆద్యంతం కట్టిపడేసింది. 11 రోజుల పాటు సాగిన ఈ బుక్‌ఫెయిర్‌కు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్నాటక మొదలగు రాష్ట్రాల నుంచి పుస్తక ప్రియులు బారులు తీరారు. ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకారం అందించడంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చివరి వరకూ పుస్తక ప్రదర్శన విజయవంతంగా సాగింది. ప్రజల్లో పఠనాసక్తిని పెంపొందించేందుకు బుక్‌ఫెయిర్ నిర్వాహకులు ప్రతి రోజు సాహితి గోష్ఠులు, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. 37 ఏండ్ల బుక్‌ఫెయిర్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రారంభించారు. అలాగే రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్సీలు కోదండరామ్, గోరటి వెంకన్న, బండ ప్రకాష్‌ముదిరాజ్, జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, జస్టిస్ రాధారాణి, సినీ ప్రముఖులు కీరవాణి, త్రివిక్రమ్ శ్రీనివాస్, ప్రముఖ పాత్రికేయులు కె.శ్రీనివాస్, రామచంద్రమూర్తి, తెలకపల్లిరవి తదితరులు హాజరయ్యారు.



పోతన భాగవతం నుంచి ...మాక్సింగోర్కి అమ్మ వరకు

పోతన భాగవతం నుంచి మొదలుకుని విశ్వనాథ వారి వేయిపడుగల వరకు, దాశరథి అగ్నిధార నుంచి మొదలుకుని అలిశెట్టి ప్రభాకర్ రక్తరేఖ వరకు, మాక్సింగోర్కి అమ్మ నుంచి మొదలుకుని చందమామ వరకు పుస్తకాలన్ని ఒకే చోట చేరి పాఠకుల మదిని దోచాయి. ఈనెల 19 నుంచి 29 వరకు సాగిన పుస్తక ప్రదర్శనలో రికార్డు స్థాయిలో దాదాపు 13 లక్షల మంది హాజరయ్యారని భావిస్తున్నారు. గతేడాది ...5లో

ప్రపంచాన్ని మార్చే ఆయుధం పుస్తకం

భావ విప్లవానికి పునాది 3లో..

మనిషి ఆలోచన, మార్పునకు పుస్తకమే శ్రీకారం

డిజిటల్ విప్లవం కమ్మేసినా పఠనం తగ్గలేదు :

37 వ హైదరాబాద్ బుక్ ఫెయిర్ ముగింపు సభలో వక్తలు



నేడు ప్రత్యేక అసెంబ్లీ

శాసనసభలో మన్మోహన్‌సింగ్‌కు సంతాపం

కేసీఆర్ హాజరు?

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి పట్ల సంతాపం తెలిపేందుకు శాసనసభ ప్రత్యేకంగా సమావేశమవుతున్నది. సోమవారం ఉదయం పది గంటలకు ప్రారంభమవుతున్న సభలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సంతాప తీర్మానాన్ని ప్రవేశ పెట్టనున్నారు.శాసనసభకు మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కేసీఆర్ హాజరౌతారనే చర్చ జరుగుతున్నది. మన్మోహన్ సింగ్ హయాంలోనే ఆయన కేంద్ర మంత్రిగా పని చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కూడా మన్మోహన్‌సింగ్ ప్రధాన మంత్రిగా ఉండగా జరిగింది. ఆయనతో కేసీఆర్‌కు ఎంతో అనుబంధం ఉన్నది. ఈ కారణంతో ఆయన శాసనసభ వేదికగా మన్మోహన్‌సింగ్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసే అవకాశం ...13లో

నేరాలు పెరిగాయి కానీ..

చెదురుమొదురు ఘటనలు మినహా శాంతిభద్రతలు సవ్యం


మావోయిస్టులకు రాష్ట్రంలో చోటు లేదు

మాదక పదార్థాల రవాణాపై ఉక్కుపాదం మోపాం

ట్రాఫిక్ ఉల్లంఘనలపై చలాన్లు సబబే

నేరస్థులకు శిక్షల శాతం పెరిగింది :

2024 వార్షిక నేర నివేదికను సమర్పించిన డీజీపీ



నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో చెదురుమొదురు ఘటనలు మినహా 2024లో శాంతి భద్రతలు సవ్యంగా ఉంచామనీ, నేరాలు కొద్దిగా పెరిగినా అవి అంతగా ప్రభావం చూపేవి కావని రాష్ట్ర డీజీపీ జితేందర్ అభిప్రాయపడ్డారు. మాదక పదార్థాల నిరోధానికి చక్కటి ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని అన్నారు. రాష్ట్రంలో మావోయిస్టుల కార్యకలాపాలకు చోటు లేదనీ, ఒకవేళ అడుగుపెడితే చేదు అనుభవం చవిచూడక తప్పదని ఆయన హెచ్చరించారు. ఆదివారం డీజీపీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో 2024లో నేరాలపై వార్షిక నివేదికను ఆయన విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణ పట్ల ప్రభుత్వం సీరియస్‌గా ...13లో

కానిస్టేబుళ్ల ఆత్మహత్యల కలకలం

ప్రయివేట్ కంపెనీలో పెట్టుబడి పెట్టి ఒకరు..వివాహేతర సంబంధంతో మరొకరు

ఒకే రోజు ఇద్దరు కానిస్టేబుళ్లు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఆదివారం రెండు ఘటనలతో కలకలంరేపుతోంది. సిరిసిల్ల 17వ బెటాలియన్ కానిస్టేబుల్ బండారు బాలకృష్ణ భార్య పిల్లలతో కలిసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా..అతను చనిపోగా..భార్య, పిల్లలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మరోవైపు మెదక్ జిల్లా కొల్చారం పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సాయి కుమార్ శనివారం రాత్రి స్టేషన్ ముందున్న ఎస్ఐ క్వార్టర్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు.

సిరిసిల్ల 17వ బెటాలియన్ కానిస్టేబుల్ బండారు బాలకృష్ణ

భార్య పిల్లలతో కలిసి ఆత్మహత్యాయత్నం

కానిస్టేబుల్ మృతి, చికిత్స పొందుతున్న భార్య, పిల్లలు



నవతెలంగాణ సిద్దిపేట అర్బన్

గుర్తుతెలియని ప్రయివేటు కంపెనీలో రూ.25 లక్షల పెట్టుబడి పెట్టి అందులో నష్టం రావడంతో పెట్టుబడి కోసం చేసిన అప్పును తీర్చేమార్గం లేక కుటుంబ సభ్యులతో సహా క్రిమిసంహారక మందు ...5లో

జనవరి 1న కాదు..3 న నుమాయిష్

మాజీ ప్రధాని మన్మోహన్ మృతికి సంతాప దినాలతో రెండు రోజులు ఆలస్యం

84వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనకు సర్వసిద్ధం :

ఎగ్జిబిషన్ సొసైటీ కార్యదర్శి బి.సురేందర్ రెడ్డి


6లో..

గంటకు 450 కిలోమీటర్లు..

అత్యాధునిక రైలును ఆవిష్కరించిన చైనా

బీజింగ్: చైనా వరుసగా ఆవిష్కరణలను ప్రపంచానికి చూపిస్తోంది. తాజాగా గంటకు అత్యధికంగా 450 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగల బుల్లెట్ రైలును పరిచయం చేసింది. దీని సీఆర్450గా వ్యవహరిస్తోంది. ఆదివారం బీజింగ్‌లో పరీక్షించారు. గంటకు ...13లో



పౌరసత్వాన్ని వదులుకుంటున్నారు


13 ఏండ్లలో 18 లక్షల మంది

ఇండియన్స్‌ది ఇదే దారి

135 దేశాల జాతీయతను పొందిన వైనం

జాబితాలో పాక్, బంగ్లా, శ్రీలంక, నేపాల్, నమీబియాలు కూడా : కేంద్రం వెల్లడి

వివరాలు 13లో



విద్యుత్ రంగాన్ని కాపాడుకోవాలి

- కార్మికులు, ఇంజనీర్ల ఐక్య పోరాటానికి అండగా నిలబడదాం
- ఈ నెల31న సంగీభావదినాన్ని పాటిద్దాం : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వ విద్యుత్‌రంగ ప్రయివేటీకరణ చర్యలకు నిరసనగా ఉత్తరప్రదేశ్, చండీఘడ్ తదితర రాష్ట్రాల్లో పోరాటాలు చేస్తున్న విద్యుత్ కార్మికులకు సీఐటీయూ రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు తెలిపింది. ఈ నెల 31న రాష్ట్రవ్యాప్తంగా సంగీభావ కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చింది. శనివారం హైదరాబాద్‌లో జరిగిన సీఐటీయు వర్కింగ్ కమిటీ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు వీఎస్ రావు' విద్యుత్ రంగాన్ని కాపాడుకుందాం' అనే తీర్మానాన్ని ప్రవేశపెట్టగా ఉపాధ్యక్షులు కె.ఈశ్వర్‌రావు బలపర్చారు. వర్కింగ్ కమిటీ ఏకగ్రీవంగా ఆమోదించింది. మూడవసారి ఏర్పడిన మోడీ ప్రభుత్వం గతంలో కన్నా మరింత దూకుడుగా ప్రజా వ్యతిరేక, వినాశకర విధానాలను అవలంబిస్తున్నదని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కా రాములు, పాలడుగు భాస్కర్ తెలిపారు. విద్యుత్ రంగంపై బీజేపీ ప్రభుత్వం చేస్తున్న దాడి ఇందుకు ప్రబల తార్కాణమని పేర్కొన్నారు. చండీగఢ్, ఉత్తరప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో డిస్కంలను ప్రయివేటీకరించే ప్రయత్నాలు మొదలయ్యాయని తెలిపారు. ఆయా రాష్ట్రాల్లో స్మార్ట్ మీటర్లు నెలకొల్పడం ద్వారా దొడ్డి దారిన ప్రయివేటీకరించే ప్రయత్నాలు ఊపందు కున్నాయని తెలిపారు. పవర్ గ్రిడ్ సబ్‌స్టేషన్లను గంపగుత్తగా ఔట్‌సోర్సింగ్ చెయ్యాలంటూ ఆదేశాలు జారీ అయినట్టు పేర్కొన్నారు. పునరుత్పత్తి ఇంధన సరఫరా కాంట్రాక్టులు చేజిక్కించుకునీ, అధిక ధరలకు విద్యుత్ అమ్మజూపుతున్న అదానీపై లంచాలు ఇచ్చి మరీ ఈ కాంట్రాక్టులు దక్కించుకున్నాడన్న ఆరోపణలు వెలుగులోకి వచ్చాయని గుర్తు చేశారు.

స్మార్ట్‌మీటర్ల అమలు సహా అన్ని కాంట్రాక్టులూ అదానీకే కట్టబెట్టారనీ, విద్యుత్ రంగాన్ని ప్రయివేటీకరించడానికి మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా విద్యుత్ రంగ కార్మికులు వీరోచితమైన పోరాటం చేస్తున్నారని తెలిపారు. చండీగఢ్ విద్యుత్ కార్మికులు, ఉత్తరప్రదేశ్ విద్యుత్ రంగ కార్మికులు ఈ పోరాటంలో అగ్రభాగాన ఉన్నారని పేర్కొన్నారు. 2003 విద్యుత్ చట్టానికి బలవంతంగా మార్పులు చెయ్యడానికి ప్రయత్నించి నపుడు కూడా చండీగఢ్ విద్యుత్ రంగ కార్మికులు సమరశీలంగా పోరాడారని గుర్తు చేశారు. ఆ వారసత్వాన్నే నేటికీ కొనసాగిస్తున్నారని తెలిపారు. గతంలో హిమాచల్‌ప్రదేశ్‌లో కూడా కార్మికులు విజయం సాధించారని గుర్తు చేశారు. చండీగఢ్ విద్యుత్ రంగం 2019-20, 2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరాల్లో వరుసగా 365, 225, 261 కోట్ల రూపాయల లాభాలు సంపాదించిన ప్రభుత్వ రంగ సంస్థగా గుర్తింపు పొందిందని తెలిపారు. విద్యుత్ లైన్ సరఫరా, నష్టాలు జాతీయ స్థాయిలో 15 శాతంపై మాటే కానీ చండీగఢ్ విద్యుత్ రంగం ఈ నష్టాన్ని 10 శాతం లోపుగా ఉండేలా సాధించిందని పేర్కొన్నారు. అన్ని విధాలా అత్యుత్తమ సామర్థ్యం కలిగిన చండీగఢ్ విద్యుత్ సంస్థను కారు చౌకగా రూ.174.63 కోట్లకు వేలం పెట్టారని తెలిపారు. సంస్థ భూములను, ఆస్తులను నెలకు ఒక్క రూపాయి అద్దెగా చెల్లించి వాడుకోవడానికి అనుమతి ఇస్తున్నారని గుర్తు చేశారు.



హుజూర్‌నగర్ మున్సిపాల్టీలో 1,024 ఇండ్ల నిర్మాణం పూర్తి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హుజూర్‌నగర్ మున్సిపాల్టీలోని సీతారామస్వామి గుట్ట వద్ద 1,024 ఇండ్లు (1 బీహెచ్‌కె) నిర్మాణం పూర్తయ్యాయి. 2013లో అప్పటి ప్రభుత్వం 2,160 ఇండ్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించగా, అదే ఏడాది సెప్టెంబర్‌లో నిర్మాణ పనులను ప్రారంభించింది. ప్రస్తుత ప్రభుత్వం ఆ నిర్మాణాలను పూర్తి చేయాలని తిరిగి మంజూరునిచ్చింది. రూ.74.80 కోట్లతో పనులు పూర్తి చేసేందుకు గౌరీ శంకర్ ఇన్ ఫ్రా బిల్డ్ (ఇండియా) ప్రయివేట్ లిమిటెడ్‌కు అప్పగించింది. నిర్మాణ పనులు మొదలు పెట్టి 1,024 ఇండ్లను పూర్తి చేయగా, మరో 832 ఇండ్లు పూర్తయ్యే దశలో ఉన్నాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. తాగునీరు, విద్యుత్, సివరేజ్ పనులు కూడా కొనసాగుతున్నాయి. మొత్తం 2,160 ఇండ్ల నిర్మాణం 2025 ఫిబ్రవరి చివరినాటికి పూర్తి చేసే లక్ష్యంతో పనులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం తెలంగాణ హౌజింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ కాలనీని తనిఖీ చేశారు. ఇండ్ల నిర్మాణ ప్రగతిపై జిల్లా కలెక్టర్, మున్సిపాల్టీ కమిషనర్, ప్రాజెక్ట్ డైరెక్టర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లతో సమీక్షించారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో ఎంపికైన లబ్దిదారులకు ఆ ఇళ్లు కేటాయించేలా పనులు వేగవంతంగా చేయాలని మేనేజింగ్ డైరెక్టర్ సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు.

ఉత్తర కొరియా కొత్త ప్రధానిగా పాక్ థే-సాంగ్



ప్యాంగ్‌యాంగ్: ఉత్తర కొరియా (డీపీఆర్‌కె) కొత్త ప్రధానిగాపాక్ థే-సాంగ్‌ను పాలక పార్టీ నియమించినట్లు కొరియన్ అధికారిక వారా సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ (కేసీఎన్ఏ) ఆదివారం తెలిపింది. 23 నుంచి 27 వరకు ప్యోంగ్యాంగ్‌లో జరిగిన ఎనిమిదవ సెంట్రల్ కమిటీ పదకొండవ ప్లీనరీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు సమావేశం అనంతరం విడుదలజేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. పాక్ థే పార్టీ పొలిట్ బ్యూరో సభ్యునిగా కూడా ఉన్నారు. ఆయనతోబాటు విదేశాంగ మంత్రి చోయ్ సోన్ హుయిని కూడా పొలిట్‌బ్యూరో లోకి తీసుకున్నారు.

పదవిని వీడేది లేదన్న సలోమీ..

- జార్జియా కొత్త అధ్యక్షుడిగా కవెలాష్విలి ప్రమాణం



టిబిలిసి : నాటకీయ పరిణామాల మధ్య జార్జియా నూతన అధ్యక్షుడిగా మాజీ ఫుట్‌బాల్ ఆటగాడు మిఖైల్ కవెలాష్విలి ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనకు వ్యతిరేకంగా కొంతకాలంగా విమర్శలు కొనసాగుతున్న తరుణంలో ఈ పరిమాణం చోటుచేసుకుంది. దీంతో, ఇప్పటికే అధ్యక్షురాలిగా ఉన్న సలోమీ జౌరాబిచ్విలి తన పదవి వీడేందుకు తొలుత నిరాకరించినా.. ఆ తర్వాత దిగొచ్చారు. కానీ, నూతన అధ్యక్షుడు మిఖైల్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆయన ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని ఓ పేరడీగా అభివర్ణించారు.ఈ ఏడాది అక్టోబర్‌లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో జార్జియన్ డ్రీమ్ పార్టీ విజయం సాధించింది. దీంతో తదుపరి అధ్యక్షుడిగా మిఖైల్ కవెలాష్విలిని నామినేట్ చేసింది. మిఖైల్ నియమితులు కావడాన్ని నాలుగు ప్రధాన ప్రతిపక్షాలు వ్యతిరేకించాయి. అతడి ఎన్నిక రష్యాకు మేలు చేస్తుందని అభిప్రాయపడ్డాయి. ఐరోపా సమాజంలో భాగం కావాలన్న తమ దేశ ఆకాంక్షలకు ఈ పరిణామం విఘాతం కలిగిస్తుందన్నాయి. ముఖ్యంగా ఈ ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని ఆరోపణలు రావడం కూడా తీవ్ర నిరసనలకు దారితీసింది. ఎన్నికల్లో కవెలాష్విలిని విజయం సాధించినప్పటికీ తన పదవి నుంచి వైదొలిగేందుకు అధ్యక్షురాలు సలోమీ జౌరాబిచ్విలి తొలుత ససేమిరా అన్నారు. తానే చట్టబద్ధ అధ్యక్షురాలని పేర్కొన్న ఆమె.. పార్లమెంటు బయట ఉన్న మద్దతుదారులను ఉద్దేశిస్తూ తాజాగా మాట్లాడారు. అధికారిక నివాసాన్ని విడిచిపెట్టేందుకు సిద్ధమేనని అంటూనే కొత్త అధ్యక్షుడిపై తీవ్ర విమర్శలు చేశారు. ఆమె ప్రసంగించిన కొద్దిసేపటికే.. నూతన అధ్యక్షుడిగా మిఖైల్ కవెలాష్విలి ప్రమాణస్వీకారం చేశారు. పార్లమెంటులో అంతర్గతంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులతో పాటు ప్రధానమంత్రి ఇరాక్లీ కోబఖిడ్జే హాజరయ్యారు.





పాట్నాలో ఖాకీ వీరంగం

అభ్యర్థులపై విరిగిన లాఠీ, జలఫిరంగుల ప్రయోగంతో ఉద్రిక్తత

పాట్నా: బీహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(బీపీఎస్సీ) ఇటీవల నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షల్లో అవకతవకల వ్యవహారం మరోసారి తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. ఆదివారం వేలాది మంది అభ్యర్థులు పాట్నాలోని గాంధీ మైదాన్ వద్ద ఆందోళనలకు దిగారు. ఈ క్రమంలో సీఎం నివాసం వైపు ర్యాలీగా బయల్దేరేందుకు ప్రయత్నించగా.. పోలీసులు వారిని అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. ఈ క్రమంలో ఆందోళనకారుల్ని చెదరగొట్టేందుకు పోలీసులు జలఫిరంగులు ప్రయోగించి.. లాఠీచార్జి చేశారు.డిసెంబర్ 13న నిర్వహించిన బీపీఎస్సీ కంబైన్డ్ కాంపిటేటివ్ పరీక్ష ప్రశ్నపత్రం లీకైనట్టు ఆరోపణలు వెల్లువెత్తడంతో గత 10 రోజులకు పైగా నిరుద్యోగులు ఆందోళన కొనసాగిస్తున్నారు. పరీక్షను రద్దు చేసి.. కొత్తగా మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. పరీక్షను రద్దు చేసే ప్రసక్తే లేదని అధికారులు తేల్చి చెప్పారు. ఏప్రిల్‌లో జరగనున్న పరీక్షలపై అభ్యర్థులు దృష్టిపెట్టాలని సూచించారు. ఈ పరీక్షలను పారదర్శకంగానే నిర్వహించామని.. విద్యార్థుల వాదనలకు ఎలాంటి ఆధారాల్లేవన్నారు. ఈ క్రమంలో విద్యార్థులు తమ ఆందోళనల్ని ఉధృతం చేయాలని నిర్ణయించారు.విద్యార్థుల నిరసనకు జన్ సురాజ్ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్ పూర్తి మద్దతును ప్రకటించారు. ఐదుగురు సభ్యులతో కూడిన విద్యార్థి ప్రతినిధి బృందం తమ డిమాండ్లను చెప్పేందుకు సీఎస్‌ను కలుస్తుందని తెలిపారు. ప్రభుత్వం కచ్చితమైన నిర్ణయానికి రాకపోతే.. అభ్యర్థులు మళ్లీ తమ నిరసనలు కొనసాగిస్తారన్నారు. తమకు రాజకీయాలతో పనిలేదని.. పరీక్ష నిర్వహిస్తే చాలని పేర్కొంటున్నారు. అధికారులు తమ పట్ల ఇలా వ్యవహరిస్తారని ఎప్పుడూ అనుకోలేదని పలువురు అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నిరసనలపై ఎస్పీ సహ్రావత్ మాట్లాడుతూ.. 'నిరసన తెలుపుతున్న విద్యార్థుల్ని ఈ ప్రదేశాన్ని ఖాళీ చేయాలని కోరాం. కానీ, వాళ్లు వినడంలేదు. వారి డిమాండ్లు వినేందుకు సిద్ధంగానే ఉన్నాం. కానీ, వాళ్లు మమ్మల్ని నెట్టారు. ఆ తర్వాతే మేం జలఫిరంగులు ప్రయోగించాల్సి వచ్చింది" అని తెలిపారు.విద్యార్థులను ఉసిగొల్పారంటూ ప్రశాంత్ కిషోర్ సహా 21 మంది అభ్యర్థుల పై కేసు నమోదు చేశారు.

ఏపీ నూతన సీఎస్ కె.విజయానంద్



ఉత్తర్వులు జారీ

అమరావతి : ఏపీ ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా విజయానంద్ నియమితులయ్యారు.ఈ మేరకు ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

ప్రస్తుతం సీఎస్‌గా ఉన్న నీరబ్ కుమార్ ప్రసాద్ పదవీకాలం ఈనెలాఖరుతో ముగియనున్నది.దీంతో నూతన సీఎస్‌గా విజయానంద్‌ను ప్రభుత్వం ఎంపిక చేసిఎంది.

మంగళవారం మధ్యాహ్నం ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. కె.విజయానంద్ ప్రస్తుతం ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. వచ్చే ఏడాది నవంబరు నెలాఖరున ఆయన పదవీ విరమణ చేయనున్నారు.

రుణ పరిమితిని పెంచకపోతే

స్తంభించనున్న అమెరికా పాలన

- అమెరికా ఆర్థిక కార్యదర్శి

వాషింగ్టన్: కాంగ్రెస్ చర్య తీసుకోకపోతే లేదా ట్రెజరీ డిఫాల్ట్‌ను నివారించడానికి "అసాధారణ చర్యలను" అమలు చేయకపోతే జనవరి 14 నాటికి ఫెడరల్ ప్రభుత్వం తన రుణ పరిమితిని చేరుకుంటుందని అమెరికా ఆర్థిక కార్యదర్శి జానెట్ యెల్లెన్ అన్నారు. 2023 బడ్జెట్ ఒప్పందం ప్రకారం, కాంగ్రెస్ రుణ పరిమితిని - అమెరికా ప్రభుత్వం ఎంత డబ్బు తీసుకోవచ్చనే దానిపై నిర్ణయించబడిన పరిమితిని - జనవరి 1, 2025 వరకు సస్పెండ్ చేసింది. తదుపరి చర్య లేకుండా ఆర్థిక శాఖ తన బాధ్యతలను నిర్వహించలేదు.

శాసనసభ్యులకు శుక్రవారం రాసిన లేఖలో, జనవరి 14, నుంచి 23 మధ్య కొత్త పరిమితిని చేరుకోవాలని ఆర్థిక శాఖ ప్రస్తుతం భావిస్తున్నట్టు యెల్లెన్ రాశారు. ఆ సమయంలో ప్రత్యేక అకౌంటింగ్ యుక్తులు అవసరమవుతాయి. ప్రస్తుతం దాదాపు 36 ట్రిలియన్ల (36లక్షల కోట్ల డాలర్లు) వద్ద ఉన్న అమెరికా అప్పు జనవరి 2 నాటికి "మెడికేర్ చెల్లింపులతో సంబంధం ఉన్న ఫెడరల్ ట్రస్ట్ ఫండ్ కలిగి ఉన్న మార్కెట్ చేయలేని సెక్యూరిటీల షెడ్యూల్డ్ రిడెంప్షన్ కారణంగా" దాదాపు 54 బిలియన్లు తగ్గుతుందని అంచనా వేస్తున్నట్టు ఆమె అన్నారు



'అసాధారణ చర్యల' కింద ఫెడరల్ ప్రభుత్వం నెలల తరబడి పనిచేయగలదు. కానీ చర్యలు ముగిసిన తర్వాత, చట్టసభ సభ్యులు, అధ్యక్షుడు అమెరికా ప్రభుత్వం రుణం తీసుకునే సామర్థ్యంపై పరిమితిని ఎత్తివేయడానికి అంగీకరించకపోతే డిఫాల్ట్ అయ్యే ప్రమాదం ఉంది.


ప్రపంచ గమనం

కాంగ్రెస్‌లోని చట్టసభ సభ్యులను "యునైటెడ్ స్టేట్స్ యొక్క పూర్తి విశ్వాసం, క్రెడిట్‌ను రక్షించడానికి" చర్య తీసుకోవాలని లేఖలో యెల్లెన్ కోరారు.

పదవీ విరమణ చేయనున్న అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ గత వారం ప్రభుత్వ షట్‌డౌన్‌ను నివారించే నిధుల బిల్లుపై చట్టంగా సంతకం చేసిన నేపథ్యంలో ఆర్థిక కార్యదర్శి ఈ హెచ్చరిక చేశారు. ఆమోదించబడిన ప్యాకేజీ మార్చి 14 వరకు ప్రభుత్వ నిధులను ప్రస్తుత స్థాయిలో ఉంచుతుంది. ఇందులో 100 బిలియన్ల విపత్తు సహాయం ఉంటుంది. కానీ అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ డిమాండ్ చేసిన రుణ-పరిమితి పొడిగింపు ఉండదు.ఈ ఒప్పందం ఒక రాజీని సూచిస్తుంది. ఎందుకంటే "ఇరు పక్షాలలో ఏ పక్షమూ కోరుకున్నవన్నీ పొందలేదు" అని బిల్లుపై సంతకం చేసిన తర్వాత బైడెన్ అన్నారు. ట్రంప్ ఇప్పటికే రుణ పరిమితిని పూర్తిగా రద్దు చేయడానికి తన మద్దతును సూచించారు. ఇది "అమెరికన్ కాంగ్రెస్ చేయగలిగే అత్యంత తెలివైన పని" అని పేర్కొన్నారు. జూన్ 2023లో, నెలల తరబడి తీవ్ర చర్చల తర్వాత, కాంగ్రెస్ రుణ పరిమితి సస్పెన్షన్‌ను ఆమోదించింది. అది అమెరికా మొట్టమొదటిసారి డిఫాల్ట్‌గా మారే అవకాశాన్ని నివారించింది.

అక్కినేని వల్లే తెలుగు సినిమా మరో స్థాయికి..

మన్‌కీబాత్‌లో ప్రధాని మోడీ



న్యూఢిల్లీ: 'మన్‌కీ బాత్' కార్యక్రమం 117వ ఎపిసోడ్‌లో ప్రధాని మోడీ... నటుడు అక్కినేని నాగేశ్వరరావు తెలుగు సినిమాకు చేసిన కృషిని కొనియాడారు. తెలుగు సినిమాను ఆయన మరోస్థాయికి తీసుకువెళ్లారని ప్రశంసించారు. నాగేశ్వరరావు సినిమాల్లో భారతీయ సంప్రదాయాలు, విలువలను చాలా చక్కగా చూపించేవారని గుర్తు చేసుకున్నారు. బాలీవుడ్ దర్శకుడు తపన్ సిన్హా సినిమాలు సమాజానికి కొత్త బాటలు వేశాయని పేర్కొన్నారు. రాజ్ కపూర్ తన సినిమాల ద్వారా భారతదేశంలోని సున్నితమైన అంశాలను ప్రపంచానికి పరిచయం చేశారన్నారు.

భారతీయ చలనచిత్ర రంగం వైపు ప్రపంచ దేశాలు చూస్తున్నాయని ప్రధాని అన్నారు. తొలిసారిగా వరల్డ్ ఆడియో విజువల్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్‌ను వచ్చే ఏడాది మన దేశంలో నిర్వహించబోతున్నామని ప్రధాని చెప్పారు. ఈ సమ్మిట్‌లో మీడియా, వినోద పరిశ్రమకు చెందిన ప్రపంచ దేశాల దిగ్గజాలు పాల్గొంటారని తెలిపారు.

రాజ్యాంగం భారతీయులందరికీ ఓ మార్గనిర్దేశకం అని ప్రధాని రాజ్యాంగం ఆమోదం పొంది 75 ఏండ్లు పూర్తయిన సందర్భంగా ఓ ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందించినట్లు పేర్కొన్నారు. ఈ పవిత్ర గ్రంథంపై ప్రజలు తమ అభిప్రాయాలను వీడియోలుగా రూపొందించి.. ఈ వెబ్‌సైట్‌లో పంచుకోవాలని పిలుపునిచ్చారు. అన్ని భాషల వారు రాజ్యాంగ పీఠికను.. అనేక విషయాలను చదివి.. అర్థం కాని వాటిపై ప్రశ్నలు సైతం అడగవచ్చని ప్రధాని తెలిపారు. అక్కినేని నాగేశ్వరరావు గురించి ప్రధాని ప్రస్తావనపై తనయుడు, నటుడు అక్కినేని నాగార్జున థ్యాంక్స్ చెప్పారు.

ఆధిపత్య శక్తుల యుద్ధ భూమి కానివ్వం

- పశ్చిమాసియాలో శాంతి సాధనే లక్ష్యం : పునరుద్ఘాటించిన ఇరాన్, చైనా

బీజింగ్: ఆధిపత్యవాద శక్తులు పశ్చిమాసియాను యుద్ధ భూమిగా మార్చే ప్రయత్నం చేస్తున్నాయని, ఈ యత్నాలను ఎట్టి పరిస్థితుల్లోను అనుమతించబోమని ఇరాన్, చైనా పునరుద్ఘాటించాయి. ఈ ప్రాంతంలో పెరుగుతున్న అస్థిరత , అనిశ్చితిని తొలగించి శాంతి సుస్థిరత నెలకొల్పాల్సిన అవసరముందని ఈ ఇరు దేశాల విదేశాంగ మంత్రులు చెప్పారు. పశ్చిమాసియాలో శాంతి ఈ ప్రాంతానికే కాదు, ప్రపంచ శాంతి, సుస్థిరత, అభివృద్ధికి కూడా దోహద పడుతుందని వారు ఉద్ఘాటించారు. రెండు దేశాల ప్రజల ప్రయోజనాల కోసం ఆచరణాత్మక సహకారం, మెరుగైన బహుపాక్షిక సమన్వయానికి తాము శక్తివంచన లేకుండా కృషి చేస్తామని చెప్పాయి.

చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘి శనివారం నాడిక్కడ సమావేశమై పశ్చిమాసియాలో తాజా పరిస్థితిపై చర్చించారు. అదే సమయంలో ఇరాన్, చైనా మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం గావించాలని సంకల్పించారు. ఇరాన్ విదేశాంగ మంత్రిగా ఆగస్టులో బాధ్యతలు చేపట్టిన తర్వాత అరాఘీ చైనా పర్యటించడం ఇదే తొలిసారి. జులైలో ఏర్పాటైన కొత్త ఇరాన్ ప్రభుత్వం నుంచి చైనాకు వచ్చిన మొదటి అధికారి కూడా ఈయనే. ప్రధాన ఆధిపత్య శక్తుల యుద్ధభూమిగా పశ్చిమాసియా మారరాదని అన్నారు. అంతర్జాతీయ సమాజం పశ్చిమాసియా దేశాల సార్వభౌమాధికారాన్ని ప్రాదేశిక సమగ్రత, చట్టబద్ధమైన ఆందోళనలను గౌరవించాలని వాంగ్ యీ పేర్కొన్నారు.వేలెత్తి చూపడం , ఏకపక్షంగా ఆంక్షలు విధించడం, ఒత్తిడి చేయడం, ఘర్షణను ప్రేరేపించడం వంటి చర్యలకు స్వస్తి చెప్పి పశ్చిమాసియాలో శాంతి సుస్థిరత నెలకొనేందుకు నిర్మాణాత్మక సహకారాన్ని అందించాలని అమెరికా, ఇతర పశ్చిమ దేశాలనుద్దేశించి వారు అన్యాపదేశంగా పేర్కొన్నారు. పాలస్తీనా ప్రజల చట్టబద్ధమైన హక్కులను గౌరవించడం, ఆక్రమణను అంతం చేయడం ద్వారా పాలస్తీనా సమస్యను పరిష్కరించాల్సిన అవసరముందని ఇరు దేశాల విదేశాంగ మంత్రులు ఉద్ఘాటించారు. ఈ ప్రాంతాన్ని గందరగోళం నుండి క్రమంగా మార్చడానికి తక్షణం కాల్పుల విరమణ ప్రకటించడం, దళాలను పూర్తిగా ఉపసంహరించుకోవడం, అత్యవసర మానవతా సాయం నిరాఘాటంగా అందేలా చూడాల్సిన ఆవశ్యకతను వారు నొక్కి చెప్పారు. సిరియాకు సంబంధించి, రెండు దేశాలు సిరియా సార్వభౌమాధికారం, స్వాతంత్ర్యం మరియు ప్రాదేశిక సమగ్రతను గౌరవించాలని పునరుద్ఘాటించాయి, గాజా వివాదం , సిరియాలో తీవ్రమైన మార్పుల వెనుక ఆధిపత్యవాదుల హస్తం ఉందని సింగ్‌సియా విశ్వవిద్యాలయంలోని చైనా-అరబ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ లి షావోక్సియన్ పేర్కొన్నారు.

కృత్రిమ మేధస్సుతో మానవాళి వినాశనమే

గాడ్ ఫాదర్ ఆఫ్ ఏఐ'

కృత్రిమ మేధస్సు మూడు దశాబ్దాలలోపు మానవాళి వినాశనానికి దారితీయవచ్చు. దీని సంభావ్యత 20శాతం వరకు ఉంటుందని ఏఐలో మార్గదర్శక వ్యక్తి, 2024 భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి గ్రహీత జాఫ్రీ హింటన్ అన్నారు. ఇది కేవలం ఒక సంవత్సరం క్రితం ఆయన అంచనా వేసిన 10శాతం ప్రమాదం నుంచి పెరుగుదలను సూచిస్తుంది. గురువారం బీబీసీ రేడియో 4లో జరిగిన ఇంటర్వ్యూలో హింటన్‌ను ఏఐ అపోకలిప్స్ పదిలో ఒక అవకాశం గురించి గతంలో అంచనా వేసినప్పటి నుంచి ఏదైనా మారిందా అని అడిగారు. ట్యూరింగ్ అవార్డు గెలుచుకున్న శాస్త్రవేత్త, "నిజంగా కాదు, 10 నుంచి 20శాతం" అని ప్రతిస్పందించారు.

దీని వలన షో అతిథి ఎడిటర్, మాజీ ఛాన్సలర్ సాజిద్ జావిద్, "మీరు పైకి వెళ న్నారు" అని హాస్యంగా అన్నారు. గత సంవత్సరం గూగుల్ నుంచి నిష్క్రమించిన కంప్యూటర్ శాస్త్రవేత్త ఇలా స్పందించారు "ఏదైనా ఉంటే మీరు చూడండి. మనం ఇంతకు ముందు ఎప్పుడూ మనకంటే తెలివైన విషయాలతో వ్యవహరించాల్సిన అవసరం లేదు." ఈ సంవత్సరం ఏఐకి చేసిన కృషికి భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతిని అందుకున్న బ్రిటిష్-కెనడియన్ శాస్త్రవేత్త, అధునాతన ఏఐ వ్యవస్థలను



నియంత్రించడంలో ఉన్న సవాళ్లను హైలైట్ చేశారు. "తక్కువ తెలివిగల విషయం ద్వారా నియంత్రించబడుతున్న మరింత తెలివైన విషయం గురించి మీకు ఎన్ని ఉదాహరణలు తెలుసు?... శిశువు తల్లిని నియంత్రించడానికి పరిణామం చాలా కృషి చేసింది. కానీ అది నాకు తెలిసిన ఏకైక ఉదాహరణ" అని 'ఏఐ గాడ్‌ఫాదర్' హింటన్ అన్నారు. "మిమ్మల్ని, మూడు సంవత్సరాల పిల్లవాడిలా ఊహించుకోండి. మనం మూడు సంవత్సరాల పిల్లవాడిగా అవుతాము" అని ఆయన సూచించారు. అది "ప్రజల కంటే తెలివిగా ఉంటుంది".పురోగతి "నేను ఊహించిన దానికంటే చాలా వేగంగా" ఉందని హింటన్ గుర్తించారు. భద్రతను నిర్ధారించడానికి నియంత్రణ కోసం పిలుపునిచ్చారు. కార్పొరేట్ లాభాపేక్ష ఉద్దేశాలపై మాత్రమే ఆధారపడకూడదని ఆయన హెచ్చరించారు. "ఆ పెద్ద కంపెనీలు భద్రతపై మరిన్ని పరిశోధనలు చేయమని బలవంతం చేయగల ఏకైక విషయం ప్రభుత్వ నియంత్రణ" అని పేర్కొన్నారు.

మే 2023లో, సెంటర్ ఫర్ ఏఐ సేఫ్టీ హింటన్ సహా ఈ రంగంలోని ప్రముఖ శాస్త్రవేత్తలు సంతకం చేసిన ఒక ప్రకటనను విడుదల చేసింది. "మహమ్మారి, అణు యుద్ధం వంటి ఇతర సామాజిక-స్థాయి ప్రమాదాలతో పాటు ఏఐ నుంచి సంభవించే అవకాశమున్న వినాశకర ప్రమాదాన్ని తగ్గించడం ప్రపంచ ప్రాధాన్యతగా ఉండాలి" అని హెచ్చరించింది. సంతకం చేసిన వారిలో టెస్లా సీఈఓ ఎలోన్ మస్క్, ఆపిల్ సహ వ్యవస్థాపకుడు స్టీవ్ వోజ్నియాక్, నాడీ నెట్‌వర్క్‌లపై తన పనికి ఏఐ మార్గదర్శకుడిగా పరిగణించబడే యోషువా బెంగియో ఉన్నారు.ఏఐ వ్యవస్థలు చివరికి మానవ మేధస్సును అధిగమించగలవని, మానవ నియంత్రణ నుంచి తప్పించుకోగలవని, మానవాళికి వినాశకరమైన హాని కలిగించగలవని హింటన్ విశ్వసిస్తున్నారు. ఏఐ భద్రత, నైతిక వినియోగాన్ని నిర్ధారించడానికి గణనీయమైన వనరులను కేటాయించాలని, చాలా ఆలస్యం కాకముందే చురుకైన చర్యల తక్షణ అవసరాన్ని కూడా ఆయన సూచించారు.

మెటాలోని చీఫ్ ఏఐ సైంటిస్ట్ యాన్ లెకున్ హింటన్ అభిప్రాయాలకు విరుద్ధంగా అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సాంకేతికత "వాస్తవానికి మానవాళిని అంతరించిపోకుండా కాపాడగలదు" అని పేర్కొన్నారు.

ఉద్యోగులను భయభ్రాంతులకుగురిచేయడం సరికాదు

- ఎస్టీయూటీఎస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేజీబీవీ పాఠశాలల్లో పనిచేస్తున్న స్పెషల్ ఆఫీసర్లను సమ్మె నుంచి తప్పుకుని విధుల్లో చేరాలని అధికారులు భయభ్రాంతులకు గురి చేయడం సరికాదని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యం.పర్వత్ రెడ్డి, జి. సదానందం గౌడ్‌లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గత 20 రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మె చేస్తున్న నేపథ్యంలో కొన్ని జిల్లాల్లో ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని తెలిపారు. సమ్మె వల్ల క్షేత్రస్థాయిలో విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని దానికి స్పెషల్ ఆఫీసర్లను బాధ్యులను చేయడం ఎంత వరకు సమంజసమని వారు ప్రశ్నించారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకోవాలనీ, ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు వారి సమస్యలపై చర్చించి, సానుకూలంగా పరిష్కరించాలని వారు కోరారు. రెండు దశాబ్దాల కాలంగా ఉద్యోగ భద్రత లేకుండా వారు పనిచేస్తున్నారనీ, వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.

ఆ ప్రక్రియ అలస్యమైన పక్షంలో, మినిమం బేసిక్ పే విధానం అమలు చేయాలని సూచించారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్లు నెరవేరే వరకు వారి సమ్మెకు ఎస్టీయూటిఎస్ అండగా ఉంటుందని ప్రకటించారు.

భవిష్యత్తు సోషలిజానిదే..

మోడీ విధానాలను తరిమికొట్టిన చరిత్ర రైతాంగ పోరాటానిదే..

- ప్రపంచంలో ఎవరికీ తలొగ్గని 'సాంసంగ్' కంపెనీ మెడలొంచిన ఎర్రజెండా
- మోడీ పాలనలో ఆర్థిక అసమానతలు
- మనువాద దృక్పథంతో దేశాన్ని పాలించాలని బీజేపీ కుట్రలు
- కేసీఆర్ విడిచిన చెప్పుల్లోనే రేవంత్ నడక
- ఎన్నికల వాగ్దానాల అమలులో కాంగ్రెస్ విఫలం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్





రెండవ రోజు రంగారెడ్డి జిల్లా పార్టీ మహాసభలు

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

దోపిడీకి గురవుతున్న కార్మిక, కర్షకులకు, వలసవాదంతో అసమానతలకు గురవుతున్న అణగారిన వర్గాలకు అండగా ఎర్రజెండా నిలుస్తోందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు పోతినేని సుదర్శన్ అన్నారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు ఒక భాగమైతే, ప్రజా సమస్యల పరిష్కారానికి పని చేస్తున్నది కమ్యూనిస్టులేనని స్పష్టంచేశారు. రంగారెడ్డి జిల్లా సీపీఐ(ఎం) 10వ జిల్లా మహాసభ ఇబ్రహీంపట్నంలోని సీతారాం ఏచూరి ప్రాంగణంలో ఆదివారం రెండోవ రోజు కొనసాగింది. మహాసభల ప్రారంభం సందర్భంగా సీనియర్ నాయకులు మధుసూదన్‌రెడ్డి అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అమరవీరుల స్తూపానికి జోహార్లు అర్పిస్తూ పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలతో నివాళులర్పించారు. అనంతరం ప్రారంభమైన ప్రతినిధుల సభలో పోతినేని మాట్లాడారు.

ప్రపంచ పెట్టుబడి దేశాల్లో ప్రస్తుతం ఆర్థిక అసమానతలు నెలకొన్నాయన్నారు. సామ్రాజ్యవాద దేశాల్లో అణిచివేతకు గురవుతున్న ప్రజలు కమ్యూనిస్టుల వైపు చూస్తున్నారని తెలిపారు. శ్రీలంకలో జరిగిన అధ్యక్ష, పార్లమెంట్ ఎన్నికల్లోనూ కమ్యూనిస్టులకే అధికారం అప్పగించారని గుర్తు చేశారు. దేశంలో రెండంకెల అభివృద్ధి జరుగుతుందని మోడీ చేస్తున్న వ్యాఖ్యలు అనాలోచితమన్నారు. దేశ ఆర్థిక వృద్ధి 5.4 శాతానికి పడిపోయిందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగం 9 శాతం, పట్టణ ప్రాంతాల్లో 8.3శాతం పెరిగిందన్నారు. వీటి నుంచి ప్రజలను పక్కదారి పట్టించేందుకు మోడీ వికృత విధానాలను అమలు చేస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను ఉద్దేశించి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు దేశ ప్రజానీకాన్ని అవమానించినట్టేనన్నారు. దీన్ని తప్పు పట్టాల్సిన ప్రధాని బలపర్చడం సిగ్గు చేటన్నారు. మనువాద దృక్పథంతో దేశాన్ని పాలించే దిశగా బీజేపీ కుట్రలు చేస్తోందని తెలిపారు. తమిళనాడులో సాంసంగ్ కంపెనీలో కార్మిక సంఘం పెట్టుకునేందుకు వ్యతిరేకించిన ఆ సంస్థ.. యాజమాన్య మెడలు వంచి ఆ యజమానులతో కార్మికుల జెండా ఎగరేయించిన ఘనత ఎర్రజెండాదేనని అన్నారు. రైతాంగ వ్యతిరేక విధానాలను తేవాలని చూసిన మోడీ ప్రభుత్వాన్ని వెనక్కి కొట్టిన ఘనత కూడా కమ్యూనిస్టులదేనన్నారు.

రాష్ట్రంలో ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కేసీఆర్ ఇడ్చిన చెప్పులోనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నడుస్తున్నదని విమర్శించారు. రూ.2లక్షల రైతు రుణమాఫీని పూర్తి స్థాయిలో చేసినట్టు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాఫీ కాలేదన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పేరుతో చేపడుతున్న ప్రక్రియను కాంగ్రెస్ కార్యకర్తలతో చేయించడం సరైన పద్ధతి కాదని తెలిపారు. ఇందిరమ్మ కమిటీల్లో అన్ని సామాజిక తరగతులకు స్థానం కల్పించి, పారదర్శకతను పాటించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన వాగ్దానాలు అమలు చేయించే విధంగా ఎర్రజెండా నాయకత్వంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామన్నారు. ఈ మహాసభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ, డీజీ నర్సింహారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సామెల్, పి.యాదయ్య, జగదీష్, మధుసూదన్‌రెడ్డి, కవిత, చంద్రమోహన్, శోభన్, జిల్లా కమిటీ సభ్యులు రాంచందర్, జగన్ పాల్గొన్నారు.



కార్పొరేట్ల కొమ్ముగాస్తున్న కేంద్ర ప్రభుత్వం

విద్యావ్యవస్థ రెండుగా విభజన

దేశంలో పెరుగుతున్న అసమానతలకు మోడీ ప్రభుత్వమే కారణం:

టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర 6వ విద్యా వైజ్ఞానిక మహాసభలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య

నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం బడా పారిశ్రామిక వేత్తల కొమ్ముగాస్తున్నదని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని లక్ష్మీ గార్డెన్స్‌లో (మహబూబ్ అలీ ప్రాంగణం, ఎం బలరాం వేదిక) జరుగుతున్న టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర 6వ విద్యా వైజ్ఞానిక సభల్లో రెండవ రోజు ఆదివారం రాష్ట్ర అధ్యక్షులు కె.జంగయ్య అధ్యక్షతన జరిగిన ప్రతినిధుల సభలో వీరయ్య మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ పాఠశాలల నిర్వహణకు వనరుల్లేవని తప్పుకుంటున్నాయని విమర్శించారు. ప్రభుత్వ విద్య కేవలం ఉపాధ్యాయులది మాత్రమేనని, తమ బాధ్యత కాదని.. ఉపాధ్యాయులను దోషులుగా నిలబెడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే సమయంలో ఉద్యోగులకు రావాల్సిన బకాయిలనూ సకాలంలో చెల్లించకుండా ప్రభుత్వాలు తప్పించుకుంటున్నాయని అన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు విద్యగా దేశంలో విద్యావ్యవస్థ విభజించబడిందని తెలిపారు. కానీ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాల కల్పన లేదని, ఉపాధ్యాయులను సైతం నియమించకపోవడం వల్ల దారుణంగా మారిందని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తమ రాజకీయ ప్రయోజనాల కోసం మతాన్ని, కులాన్ని సాకుగా చూపి ఓట్లను దండుకునే ప్రయత్నం చేస్తోందని చెప్పారు. ఓటింగ్ ప్రాసెస్‌లో జరిగే అవకతవకలను ఓటింగ్ సీసీ పుటేజీలను ప్రజాసంఘాలు, పార్టీలు చూడటానికి వీల్లేదని ఎలక్షన్ కమిషన్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రస్తుతం భారతదేశంలో ఆర్థిక అసమానతలు పెరిగిపోయాయన్నారు. మోడీ ప్రధాని అయిన తర్వాత అదానీ, అంబానీల లాంటి కార్పొరేట్ల ఆస్తులు అమాంతంగా పెరిగిపోయాయని, పేదవారు మరింత పేదవారుగా మారారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం రూ.4 లక్షల కోట్ల పెట్టుబడిదారుల అప్పులను మాఫీ చేసిందని, కానీ సామాన్య ప్రజలను మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. దేశంలో ఒక సామాన్య మానవుడు తన జీవిత కాలంలో ఇంటి కోసం జాగా కొనలేని స్థితిలో ఉన్నారని తెలిపారు. భారతదేశంలో సంపన్నులపై సంపద పన్ను, వారి వారసులకు వారసత్వ పన్ను వేసినప్పుడే ఈ వైరుద్యాలు సమానమవుతాయని ప్రపంచ బ్యాంకు మాజీ అధ్యక్షులు పికెట్టి చెప్పారని గుర్తుచేశారు. ప్రపంచ మార్కెట్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు తక్కువగా ఉన్నా దేశంలో మాత్రం వాటి ధరలు ఆకాశానంటుతున్నాయని అన్నారు. గతంలో రైలు ప్రయాణంలో పెద్దలకు ఇచ్చే రాయితీలను తొలగించారని, ఇవన్నీ మోడీ పెంచిన అసమానతలేనని తెలిపారు.

అనంతరం టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి సంఘం కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టారు. రాష్ట్రంలో గత మహాసభ నుంచి ఇప్పటివరకు విద్యారంగ పరిస్థితులను, సంఘం కార్యకలాపాలతో పాటు వివిధ పోరాట కార్యక్రమాలను, జాతీయ అంతర్జాతీయ పరిస్థితులను, రాష్ట్రంలోని అన్ని రకాల ప్రభుత్వ విద్యా సంస్థల పరిస్థితిని వివరించారు. ఈ మహాసభలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగువెల్లి నర్సిరెడ్డి, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సీహెచ్.రాములు, రాష్ట్ర కోశాధికారి టి.లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు ఎం..రాజశేఖర్‌రెడ్డి, కె.సోమశేఖర్, ఎ.వెంకట్, డి.సత్యానంద్, జి.నాగమణి, వై.జ్ఞానమంజరి, బి.రాజు, ఎస్.రవి ప్రసాద్‌గౌడ్, కె.రవికుమార్, వి.శాంతకుమారి, జి.సమ్మారావు, ఈ.గాలయ్య, కె.రంజిత్‌కుమార్, ఎస్.మల్లారెడ్డి, జి.శ్రీధర్, ఎ.సింహాచలం, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ కె.యాకయ్య, వాయిస్ ఆఫ్ తెలంగాణ టీచర్ పత్రిక ప్రధాన సంపాదకులు పి. మాణిక్‌రెడ్డి, నల్లగొండ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బక్క శ్రీనివాసచారి, పెరుమాళ్ళ వెంకటేశం, జిల్లా ఉపాధ్యక్షులు బడుగు అరుణ నర్రా శేఖర్‌రెడ్డి, మహాసభల ఆహ్వాన సంఘం ఉపాధ్యక్షులు ఎడ్ల సైదులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు త్వరితగతిన తిరిగి పంట రుణాలివ్వాలి

టీజీసీఏబీ 2025 క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

నవతెలంగాణ-సుల్తాన్ బజార్

రైతులకు త్వరితగతిన తిరిగి పంట రుణాలు ఇవ్వాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని టీజీసీఏబీ ప్రధాన కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా టీజీసీఏబీ అధ్యక్షులు మార్నేని రవీందర్‌రావు మంత్రిని పుష్పగుచ్ఛంతో స్వాగతించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా రైతు రుణమాఫీతో పాటు బ్యాంక్ పనితీరు, ఆర్థిక అంశాలపై మంత్రి సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రుణమాఫీ 2024 కింద లబ్ది పొందిన



రైతులకు త్వరితగతిన తిరిగి కొత్త పంట రుణాలు ఇవ్వాలని సూచించారు. అనంతరం టీజీసీఏబీ నూతన సంవత్సర క్యాలెండర్-2025, డైరీని ఆవిష్కరించారు. ఈ సమావేశంలో టీజీసీఏబీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బి.గోపి ఐఏఎస్, సహకార డైరెక్టర్ ఫర్ కో-ఆపరేషన్ రిజిస్ట్రార్ ఆఫ్ కో-ఆపరేటివ్స్ అడిషనల్ (ఎఫ్ఏసీ) పి.ఉదయ్‌కుమార్ ఐఏఎస్, ఆర్‌సీ ఎస్ జి. శ్రీనివాస రావు, టీజీసీఏబీ పాలక వర్గ సభ్యులు హైదరాబాద్, ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్, మెదక్, నల్లగొండ, నిజామాబాద్ డీసీసీబీ అధ్యక్షులు కొత్తకుర్మ సత్తయ్య, అద్ది భోజా రెడ్డి, దొండపాటి వెంకటేశ్వరరావు, విష్ణువర్ధన్ రెడ్డి, చిట్టి దేవేందర్‌రెడ్డి, కుంభం శ్రీనివాస్ రెడ్డి, కుంట రమేశ్ రెడ్డి, ప్రొఫెషనల్ డైరెక్టర్ పి. మోహనయ్య, సీజీఎం టి.జ్యోతి, అధికారులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.



చెరుకు టన్నుకు రూ.4 వేలు ఇవ్వాలి

చెరుకు రైతుల సమస్యలను పరిష్కరించాలి :

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్

నవతెలంగాణ -ఆత్మకూరు

చెరుకు టన్నుకు రూ. 4 వేలు ఇవ్వాలని, చెరుకు రైతుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్ డిమాండ్ చేశారు. తెలంగాణ చెరుకు రైతు సంఘం ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలోని వర్తక సంఘం హాల్‌లో చెరుకు రైతులకు నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న 11 చెరకు ఫ్యాక్టరీల్లో 9మాత్రమే నడుస్తున్నాయన్నారు. చెరుకు రైతులకు టన్నుకు రూ.4000 ధరతో పాటు రూ.1000 బోనస్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని కోరారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ కింద 5600 ఎకరాల్లో రైతులు చెరుకు వేసుకుంటున్నారని తెలిపారు. కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ టన్నుకు రూ.3366.80 ఇస్తున్నట్టు చెప్పారు. ఈ సంవత్సరం రైతులకు టన్నుకు రేటు పెంచకపోగా చెరుకు రైతుల దగ్గర ఒకరికి ఒకరు షూరిటీ తీసుకుంటున్నారని, దీనివల్ల ఒక రైతు పంట మధ్యలో నీరు లేక ఎండిపోయి నష్టం వస్తే, మరో రైతు వద్ద యజమాన్యం డబ్బులు రికవరీ చేస్తుందని తెలిపారు. ఇది సరైన పద్ధతి కాదని, రైతుల మధ్య గొడవలు పెట్టడానికే ఇలాంటివి ఉపయోగపడతాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2014లో రాష్ట్ర వ్యాప్తంగా 1.50కోట్ల ఎకరాల్లో చెరకు సాగు విస్తీర్ణం ఉండగా, ఈ సీజన్‌కి 30వేల సాగు విస్తీర్ణం తగ్గిందన్నారు. 2023-24లో 17,24,190 టన్నుల చెరకు 9 ఫ్యాక్టరీల్లో క్రెష్సింగ్ అయిందని తెలిపారు. దీనికి 14 రోజుల్లో రైతులకు డబ్బులు ఇవ్వాల్సింది పోయి రెండు నెలలు కావస్తున్నా ఇప్పటివరకు ఇవ్వలేదని అన్నారు. ఇప్పటికైనా ఇవ్వకపోతే చెరుకు రైతు సంఘం ఆధ్వర్యంలో పోరాడి సాధించుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ చెరకు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు జీఎస్ గోపి, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండీ జబ్బార్, జిల్లా అధ్యక్షులు డి.బాల్ రెడ్డి, జిల్లా కోశాధికారి బి. వెంకటేష్, నాయకులు ఎస్ రాజు, వెంకట్రాములు, ప్రసాద్ పాల్గొన్నారు.

బోరుబావిలో పడిన బాలుడు మృతి



భోపాల్ : మధ్యప్రదేశ్‌లోని గుణ జిల్లాలో బోరుబావిలో పడిన బాలుడి కథ విషాదాంతంగా ముగిసింది. జిల్లాలోని పిప్లియా అనే గ్రామంలో శనివారం సాయంత్రం 5 గంటల సమయంలో 10 ఏండ్ల సుమిత్ మీనా ప్రమాదవశాత్తూ దాదాపు 140 అడుగుల లోతైన బోరుబావిలో పడిపోయాడు. సహాయక బృందాలు, స్థానికులు ఎంతో శ్రమించి ఆదివారం ఉదయం 9:30 గంటలకు మీనాను బయటకు తీసుకొనిరాగలిగారు. వెంటనే లైఫ్ సపోర్ట్ సిస్టమ్‌పై వెంటనే బాలుడ్ని రఘోఘర్ ఆస్పత్రికి తరలించారు. కానీ బాలుడ్ని రక్షించుకోలేకపోయామని జిల్లా ఎస్పీ సంజీవ్ సిన్హా తెలిపారు. అలాగే, 'క్షమించండి, బాలుడు ఇక లేడు' అని జిల్లా ప్రధాన వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ రాజ్‌కుమార్ రిషీశ్వర్ ఆస్పత్రి వద్ద విలేకరులకు తెలిపారు. కాగా, బాలుడ్ని రక్షించడం కోసం సహాయక బృందాలు రాత్రంతా కృషి చేశాయి. బోరుబావిలో బాలుడు 39 అడుగుల వద్ద చిక్కుకున్నట్టు గుర్తించి, అతన్ని చేరుకోవడానికి సమాంతరంగా గొయ్యిని తవ్వారు.

ఆశాల బస్సుజాతాకు అడుగడుగునా ఘన స్వాగతం

ఫిబ్రవరిలో జరిగే రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో.. రూ.18వేల ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలి

- పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలి: ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పి జయలక్ష్మి
- హనుమకొండ జిల్లాకు చేరుకున్న బస్సుజాత





నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో ఆశాలకు రాష్ట్ర ప్రభుత్వం 18 వేల రూపాయల ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, తదితర సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు పి జయలక్ష్మి డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 15న ప్రారంభమైన రాష్ట్ర బస్సు జాత ఆదివారం హనుమకొండ జిల్లాకు చేరుకుంది. ఈ సందర్భంగా హనుమకొండలోని వేయిస్తంభాల గుడి నుంచి హనుమకొండ చౌరస్తా అశోక జంక్షన్ మీదుగా పబ్లిక్ గార్డెన్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ ఆడిటోరియంలో యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాసు మాధవి అధ్యక్షతన జరిగిన సభలో ఆమె మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని, ఆశాలకు వేతనాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన కాంగ్రెస్ అధికారంలోకి రాగానే విస్మరించిందని విమర్శించారు. పారితోషికం లేని అనేక పనులను ఆశలతో చేపిస్తున్నారని తెలిపారు. సబ్ సెంటర్స్ క్లీన్ చేయడం దగ్గర నుంచి డ్యూటీలు, బీపీ, షుగర్ టెస్టులు చేయడం, ఎన్సీడీ బుక్స్ రాయడం లాంటివి చేపిస్తున్నారని, ఇది సరైనది కాదన్నారు. సమస్యల పరిష్కారం కోసం బస్సు జాతా ముగింపు 31వ తేదీన హైదరాబాద్‌లో జరిగే మహాధర్నాలో ఆశాలు పాల్గొని తమ గొంతు వినిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి జి.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆశాల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ఆరోపించారు. కరోనాకాలంలో వారి శ్రమను గుర్తించి డబ్ల్యూహెచ్ఓ గ్లోబల్ లీడర్స్ అని ఆశాలకు అవార్డును ప్రకటించిందని గుర్తు చేశారు. ఎన్‌హెచ్ఆర్ఎం స్కీములకు బడ్జెట్ తగ్గిస్తూ కేంద్రం వాటా ఆశాలకు రూ.3వేలు మాత్రమే పారితోషకాలు చెల్లిస్తుందని తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఆశాలకు కనీస వేతనం నిర్ణయించడం లేదన్నారు. 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందని, సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కు లేకుండా చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బస్సు జాతా బృంద సభ్యులతో పాటు సీఐటీయూ నాయకులు రాగుల రమేష్, టి ఉప్పలయ్య, ముక్కెర రామస్వామి, బొట్ల చక్రపాణి, బి సంపత్, ఆశాల యూనియన్ నాయకులు కె.పద్మ, జె శ్వేత, చైతన్య, ఈ శోభ, శ్రీవాణి, పద్మ, పుత్తిలి రాజేశ్వరి రమ, నీరజ తదితరులు పాల్గొన్నారు.

నవయుగ్ టన్నల్‌కు మన్మోహన్ సింగ్ పేరు

ఒమర్ అబ్దుల్లా ప్రతిపాదన

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లోని శ్రీనగర్-జమ్మూ జాతీయ రహదారిపై ఉంటే నవయుగ్ టన్నల్‌కు మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ పేరు పెట్టాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ప్రతిపాదించారు. ప్రధానమంత్రిగా మన్మోహన్ హయాంలోనే శ్రీనగర్-జమ్మూ జాతీయ రహదారిని నాలుగు వరుసలుగా మార్చడం ప్రారంభమైందని అబ్దుల్లా గుర్తు చేశారు. నాలుగు వరుసలుగా మార్చడం తరువాత ఈ రోజున ఈ రెండు నగరాల మధ్య ప్రయాణానికి కేవలం ఐదు గంటల సమయం మాత్రమే పడుతుందని చెప్పారు. ఆదివారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ఈ వివరాలను తెలిపారు. జమ్మూకాశ్మీర్‌కు మన్మోహన్ సింగ్ చేసిన గణనీయమైన కృషిని అబ్దుల్లా ప్రస్తావించారు. అయితే ఇటీవల నవయుగ్ టన్నల్ ఘనతను ఇతరులు తీసుకుంటున్నారని విమర్శించారు. జాతీయ రహదారిని అధునీకరించడానికి పునాది వేసింది మన్మోహన్ అని, కాబట్టి ఖాజీగుండ్, బనిహాల్‌ను కలిపే నవయుగ్ టన్నల్‌కు ఆయన పేరు పెట్టాలని అబ్దుల్లా ప్రతిపాదించారు. అలాగే మన్మోహన్ ప్రధానిగా ఉన్న సమయంలోనే కాశ్మీర్‌పై రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌ను ప్రారంభించారని, రాష్ట్రంలో విద్యార్థుల కోసం ప్రత్యేక స్కాలర్‌షిప్ పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. మన్మోహన్ సింగ్‌కు జమ్మూకాశ్మీర్ స్టూడెంట్స్ అసోసియేషన్ ప్రతినిధి నాసిర్ ఖుహమీ కూడా నివాళర్పించారు. 2011లో మన్మోహన్ సింగ్ ప్రభుత్వం ప్రారంభించిన ప్రధానమంత్రి ప్రత్యేక స్కాలర్‌షిప్ పథకం (పీఎంఎస్ఎస్ఎస్) ఆర్థిక సహాయానికి మించి విస్తరించిందని ఖుహమీ తెలిపారు.

ప్రపంచాన్ని మార్చే ఆయుధం పుస్తకం

డిజిటల్ విప్లవం కమ్మేసినా పఠనం తగ్గలేదు : 37 వ హైదరాబాద్ బుక్ ఫెయిర్ ముగింపు సభలో వక్తలు

భావ విప్లవానికి పునాది మనిషి ఆలోచన, మార్పునకు పుస్తకమే శ్రీకారం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"కారల్ మార్క్స్ రాసిన కమ్యూనిష్టు మ్యానిఫెస్టో ప్రపంచ గతిని మార్చింది. పుస్తకం కొత్త ఆలోచనలకు, కొత్త దారులకు, మార్పుకు శ్రీకారం చుడుతుందని చరిత్ర నిరూపించింది. పుస్తకాలు చదివిన ఎంఎన్ రాయ్, అంబేద్కర్, గాంధీ, నెహ్రూ లాంటి వారు ప్రపంచంపై తమదైన ముద్ర వేశారు. తుపాకీ కన్నా పుస్తకం పదునైంది. పుస్తకాలు చదివితే సమాజాన్ని చదివినట్టే. ఫేస్ బుక్‌లు, వాట్సప్‌లు వదిలి పుస్తకాలను చదివేలా మనతో పాటు మన పిల్లల్ని తయారు చేయాలి. అప్పుడే మంచి సమాజం నిర్మితమవుతుంది" అని పలువురు వక్తలు అభిప్రాయ పడ్డారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో ఈనెల19న కొలువుదీరిన హైదరాబాద్ బుక్‌ఫెయిర్ 37వ జాతీయ పుస్తక ప్రదర్శన ఆదివారం అట్టహాసంగా ముగిసింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి మాట్లాడుతూ "ఒకప్పుడు ప్రతి ఊర్లో గ్రంథాలయం ఉండేది. అందులో చదుకున్న వారు చాలా మంది పెద్ద పెద్ద స్థానాల్లో ఉన్నారు. పుస్తకం మనల్ని కొత్త ప్రపంచంలోకి తీసుకెళుతుంది. ప్రపంచంలో అనేక మార్పులకు పుస్తకాలే శ్రీకారం చుట్టాయి. చిన్నప్పుడు నేను చదివిన రైలు బండి నన్ను ప్రభావితం చేసిన పుస్తకం. ఓల్గా సే గంగా, ఫౌంటెన్ హెడ్, ఇన్ ఫిడిల్ తదితర పుస్తకాలు సమాజాన్ని తీవ్ర ప్రభావితం చేశాయి. లండన్ లైబ్రరీలో ఎక్కువ పుస్తకాలు చదివిన వారిలో ఒకరు కార్ల్ మార్క్స్ అయితే ఇంకొకరు అంబేద్కర్. అందుకే వారు ప్రపంచం మెచ్చే గొప్పవాళ్లయ్యారు. పుస్తకాలు చదవడంతో పాటు, పిల్లల్ని చదివించాలి" అని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కోదండరామ్ మాట్లాడుతూ "కంప్యూటర్లు, డిజిటల్ మాధ్యమాలు ఎన్ని వచ్చినా పుస్తకాల విలువ తగ్గలేదు. సాఫ్ట్ వేర్ ఉద్యోగులు పుస్తకాలు చదువుతుండటమే మార్పునకు సంకేతం. ప్రజలకు పుస్తకాలు అందుబాటు లోకి తేవాలని వట్టి కోట ఆళ్వారుస్వామి నెత్తి మీద మూటలా పెట్టుకొని ఊరూరా తిరిగి పాఠకులకు అందించారు. హైదరాబాద్‌ను ప్రభావితం చేసే ప్రదర్శనగా హైదరాబాద్ బుక్‌ఫెయిర్ నిలిచింది. ఇదే సాంప్ర దాయాన్ని భవిష్యత్‌లో కొనసాగిస్తూ మంచి పుస్తకాలను పాఠకులకు అందించాలి. హైదరాబాద్ బుక్‌ఫెయిర్‌కు సొంత కార్యాలయం గురించి సీఎం కూడా సానుకూలంగా ఉన్నారు. త్వరలో అది కార్యరూపం దాలుస్తుందని భావిస్తున్నాను" అని కోదండరామ్ వ్యాఖ్యానించారు. ప్రముఖ పాత్రికేయులు రామ చంద్రమూర్తి మాట్లాడుతూ హైదరాబాద్ బుక్ ఫెయిర్ పాఠకులకు మరింత మంచి పుస్తకాలు అందిస్తూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన బుక్‌ఫెయిర్ అధ్యక్షులు కవి యాకుబ్ మాట్లాడుతూ గతానికి భిన్నంగా పుస్తకాల పండుగలో బాలోత్సవం, సాహితీ కార్యక్రమాలు, పుస్తక ఆవిష్కరణలు జరిగాయని పేర్కొన్నారు. బుక్‌ఫెయిర్ కార్యదర్శి ఆర్.శ్రీనివాస్(వాసు) మాట్లాడుతూ అంచనాలకు భిన్నంగా ఈ ఏడాది దాదాపు 13 లక్షల మందికి హాజరయ్యారని అన్నారు. పుస్తకాలకు పెరుగుతున్న ఆదరణకు సందర్శకులు పెరగడమే నిదర్శనమని పేర్కొన్నారు. బుక్ ఫెయిర్‌కు సహకరించిన ప్రభుత్వం, కవులు, కళాకారులు, సాహితీవేత్తలు, పాత్రికేయులకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బుక్ ఫెయిర్ ఉపాధ్యక్షులు బాల్‌రెడ్డి, శోభన్ బాబు, సంయుక్త కార్యదర్శి సురేష్, సూరి బాబు, కోశాధికారి నారాయణ రెడ్డి, కార్యవర్గ సభ్యులు కుమార్, ఎన్.కోటేశ్వర్‌రావు, శ్రీకాంత్, శ్రీనివాస్, స్వరాజ్ కుమార్, పాల్గొన్నారు.

ప్రకృతి

ప్రకృతి అంటూ మనం వేటిని చూస్తున్నామో...
ఆ కొండా, ఈ అపరాహ్ణమూ, కిచకిచల ఉడుతా,
పట్టువిడుపుల ఆసక్తికర గ్రహణమూ,
ఝుమ్ ఝుమ్మనే తుమ్మెదా
కేవల మివే కాదు ప్రకృతిబీ
ప్రకృతి అంటే స్వర్గం!

ప్రకృతి అంటూ మనం వేటిని వింటున్నామో...
ఆ పాడేపక్షిపాటా,ఈ హెూరుమనే సముద్రమూ,
గజ్జుమని అదిరించే ఉరుమూ,
కీచుకీచుమని శబ్దాలుచేసే చిమ్మెటపురుగూ,
కేవల మివే కాదు ప్రకృతిబీ
ప్రకృతి అంటే ధ్వనుల ఏకీకృతస్వరశ్రావ్యత!

మనకేది తెలుసో
అదే ప్రకృతి అని అనుకుంటున్నాం

అయినా ప్రకృతి ఇదీ అనీ
ఒక్కసారిగా పూర్తిగా తెలిసిచెప్పడానికి
ఏ కళా లేదు-
అందువల్ల ఆమె నిరాడంబరసహజసౌందర్యం
ముందర

మన విజ్ఞానగరిమ శక్తిహీనం సుమా!!!

ఆంగ్ల మూల కవిత :
"Nature is what we see..." పోయమ్ బై
ఎమిలీ ఎలిజబెత్ డికిన్సన్ (1830-1886)
స్వేచ్ఛానువాదం : రఘువర్మ, 9290093933

సాహితీ వార్తలు

31న దివాకర్ల వేంకటావధాని జీవితం-సాహిత్యంపై సదస్సు

సాహిత్య అకాడమీ, తెలుగు శాఖ ఉస్మానియా విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 31న మంగళవారం ఆర్ట్స్ కాలేజీ, రూమ్ నెంబర్ 121లో ప్రముఖ సాహితీవేత్త దివాకర్ల వేంకటావధాని జీవితం - సాహిత్యంపై సదస్సు నిర్వహించనున్నారు. ఆచార్య సాగి కమలాకర శర్మ అధ్యక్షతన ఆచార్య శలాక రఘునాథ శర్మ కీలకోపన్యాసం, అనుమాండ్ల భూమయ్య, సంగనభట్ల నరసయ్య, కసిరెడ్డి వెంకటరెడ్డి, పిల్లలమర్రి రాములు, జి అరుణకుమారి, గంద్ర లక్ష్మణరావు పత్ర సమర్పణ చేస్తారు. కార్యక్రమంలో సి.మృణాళిని, .సి.కాశీం, దివాకర్ల రాజేశ్వరి, .ఏలే విజయలక్ష్మి, ఎస్.రఘు పాల్గొంటారు.

సాహితీ పురస్కారాలు - 2025

రెండు తెలుగు రాష్ట్రాల పరిధిలోని పలు విభాగాల్లో సాహిత్య పురస్కారాలకు రచయితలు వెలువరించిన పుస్తకాలు ఆహ్వానిస్తున్నారు. శ్రీ మక్కెన రామ సుబ్బయ్య కథా పురస్కారం, ఆచార్య నెల్లుట్ల కవితా పురస్కారం, డా॥ కె వి రావు కవితా ప్రక్రియ పురస్కారం (మినీ కవితలు, గజల్స్, నానీలు, హైకూలు, దీర్ఘకవితలు తదితరములు), సాహితీ పురస్కారం (వ్యాసాలు / సమీక్ష / విమర్శ), బాల సాహిత్య పురస్కారం (కథ, కవిత, గేయ సంపుటులు), విజ్ఞాన / మనోవైజ్ఞానిక పుస్తక పురస్కారాలకు 2024 జనవరి నుంచి డిసెంబర్ మధ్యకాలంలో ప్రచురితమైన పుస్తకాలను మూడు కాపీల చొప్పున పంపించవచ్చు. గెలుపొందిన వారికి రూ.7000 చొప్పున నగదు పురస్కారం ఉంటుంది. ఆసక్తి కలిగిన వారు జనవరి 30 లోగా డా. మక్కెన శ్రీను, కేరాఫ్ : కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్, గరివిడి, విజయనగరం జిల్లా- 535 101, ఏ.పి. చిరునామాకు పంపవచ్చు. వివరాలకు 98852 19712 నంబరు నందు సంప్రదించవచ్చు.

సాహితీ కిరణం 'ఉగాది కవితా పురస్కారం'

సాహితీ కిరణం సౌజన్యంతో శ్రీ విశ్వావసు నామ ఉగాది కవితల పోటీ నిర్వహిస్తోంది. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.2500/-, రూ.2000/-, రూ.1500/-లతో పాటు రూ.1000/- చొప్పున రెండు ప్రత్యేక బహుమతులు అందివ్వనున్నారు. కవిత 20 నుంచి 30 లైన్‌లు మధ్య ఉండాలి. ఆసక్తి కలిగిన వారు జనవరి 31లోగా పోస్ట్/ కొరియర్ ద్వారా మాత్రమే ఎడిటర్, సాహితీ కిరణం, ఇం.నెం.11-13-154, అలకాపురి, రోడ్‌నెం.3, హైదరాబాద్-500102 చిరునామాకు పంపించాలి. వివరాలకు 94907 51681 నంబరు నందు సంప్రదించవచ్చు.

కథా సంపుటాలకు ఆహ్వానం

నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో కందికొండ రామస్వామి స్మారక జాతీయ పురస్కారం-2024 అందివ్వనున్నారు. ఆసక్తి కలిగిన వారు 2023లో ముద్రితమైన కథా సంపుటాలను జనవరి 31లోగా మూడు ప్రతుల చొప్పున రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పంపించవచ్చు. బహుమతి పొందిన కథా సంపుటికి రూ.పదివేల నగదు బహుమతిని ఏప్రిల్‌లో నిర్వహించే కార్యక్రమంలో అందిస్తారు. ప్రతులను పి.అబ్దుల్ వహీద్ ఖాన్, ఇంటి నెం. 15- 120/4/1, రహత్ నాగర్ కాలనీ, నాగర్ కర్నూల్ - 509209, తెలంగాణ రాష్ట్రం చిరునామాకు పంపవచ్చు. వివరాలకు 9441946909 నంబరు నందు సంప్రదించవచ్చు.

గంటా కమలమ్మ సాహితీ పురస్కార విజేతలు

గంటా కమలమ్మ సాహితీ పురస్కారానికి సాంబమూర్తి లండ 'నాలుగు రెక్కల పిట్ట' తుల శ్రీనివాసులు 'చింతల తొవ్వ' కవితా సంపుటాలు సంయుక్తంగా ఎంపికయినట్టు పురస్కార వ్యవస్థాపకులు గంటా మోహన్ తెలిపారు. 2025 జనవరిలో నిర్వహించనున్న సాహితీ కార్యక్రమంలో పురస్కార గ్రహీతలకు సంయుక్తంగా 10000 రూ. నగదు, పురస్కార ప్రదానం జరుగుతుందని తెలిపారు.

'తెలుగు సాహితీవనం' కథలు, కవితలకు ఆహ్వానం


తెలుగు సాహితీవనం ఆధ్వర్యంలో కథ, కవితా విభాగాల్లో పురస్కారాన్ని అందించనున్నారు. కథల విభాగంలో నలుగురికి ఒక్కొక్కరికి రూ. 2,116, కవితల విభాగంలో నలుగురికి రూ.1116 చొప్పున నగదు బహుమతులు అందించనున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించే తెలుగు సాహితీవనం వార్షికోత్సవ సభలో అందజేస్తారు. రెండు విభాగాల్లో వర్తమాన పరిస్థితులు, మానవ సంబంధాలు వంటి ఏ సాంఘిక ఇతివృత్తాన్నైనా తీసుకుని పంపవచ్చు. కథ 1200 పదాలు, కవిత 25 వాక్యాలకంటే మించకుండా పంపించాలి. యూనికోడ్‌లో టైప్ చేసి టెక్స్ట్ రూపంలో మేమిచ్చిన గూగుల్ ఫామ్ ద్వారా పంపించాలి. ఆసక్తి కలిగిన వారు జనవరి 20 లోగా https://tinyurl.com/sahitivanam-poti పంపవచ్చు. వివరాలకు 9502236670, 83096 86404 నంబర్ల నందు సంప్రదించవచ్చు.

సాహిత్య గమనావలోకనం

దేనికైనా విచారణ అవసరం. సాహితీ సృజనకు మరింత అవసరం. మన గమనం ఎలా ఉంది. ఎలా ఉండాలి అని పరామర్శించుకోవడం, కొత్తగా ఉత్సాహంగా ముందడుగేయడం కోసమే. కాలానికి మనం పెట్టుకున్న కొన్ని గుర్తులు, హద్దుల వద్ద సమీక్ష జరగాల్సిందే. ఒక కాలపు పరిధిలో సాహిత్య గమనం ఎలా సాగిందో పరిశీలించుకొని తోవను సుగమం చేసుకోవాలి. సమాజ గమనంలో సాహిత్యం తన పాత్రను సమర్థవంతంగా పోషిస్తున్నదా! ముందున్నదా! సమాజ వాస్తవిక విషయాలను ప్రతిబింబిస్తున్నదా! దారెలా ఉందన్న విషయాలు చర్చించడం ఇపుడున్న పరిస్థితుల్లో అవసరమని భావిస్తున్నాను. సాహితీ విమర్శకులు సమగ్రంగా ఈ విచారణ జరపాలి. ప్రభావశీలమైన సృజనాత్మక రంగానికి ఇది అవసరం. ముఖ్యంగా సాహిత్య రంగంలో ఏ రకమైన ఉద్యమ ఉధృతిలేని సందర్భంలో సాహితీకారుని గొంతుక పలుకుతున్నదేమిటి? అడుగులెలా ఎటువైపు పడుతున్నవనేది మనకు మనమే పరీక్షించుకోవడం ఉపయోగకరం.

ఆర్థిక, రాజకీయ ప్రభావాలతో సామాజిక జీవనం కొనసాగటం సర్వసాధారణ విషయం. అయితే ఆ ప్రభావాల కారణంగా సమాజంలో చోటుచేసుకుంటున్న సంఘర్షణలను కళా, సాహిత్యం ప్రతిఫలిస్తున్నదా అన్నదే సాహిత్యపు చైతన్యపూరిత చలనశీలతను తెలుపుతుంది. తెలుగు సాహిత్యాన్ని ఆ దృష్టితో పరిశీలించినపుడు మందగమనమే కనిపిస్తుంది. ఆర్థిక రాజకీయాల ఆధిపత్య భావజాలాలు గణనీయంగా కళా సాహిత్య రంగాలపై ప్రభావాన్ని చూపుతూనే ఉన్నాయి. వైయక్తిక ధోరణులు పెరిగిపోయాయి. సభలు సమావేశాలు, ఉత్సవాలు ఆ దిశగానే సాగాయి. సామాజిక స్పృహ, చైతన్య పూరితమైన సృజన, సభలూ లేవని కాదు, ఆశాజనకంగా ఆశయ జనకంగా లేవన్నదే విమర్శ. దేశంలోనూ, రాష్ట్రంలోనూ తిరోగమన శక్తుల, విద్వేష ఆలోచనల ప్రభావం రోజురోజుకూ పెరుగుతున్నది. రెండు తెలుగు రాష్ట్రాల స్థానిక రాజకీయాలు వాటిని ఎదుర్కొనే దిశలో ఆలోచన కానీ ఆచరణ కానీ లేకపోగా అనుకూలంగా సాగటం, లేదా సందిగ్ధంగా కొనసాగటం ప్రగతిశీలతకు పెద్ద ఆటంకం. కళా సాహిత్య సృజనకు శత్రువు అయిన మతోన్మాదము, విద్వేషముపై మరింత ఐక్యంగా కలాలను గళాలను ఎక్కు పెట్టవలసే ఉన్నది. ఎందుకంటే ఈ తిరోగమన శక్తులు, మన వైవిధ్యపూరితమైన, భిన్నసాంస్కృతిక జీవనంపై దాడి చేస్తున్న సందర్భంలో ఉన్నాము. అంతేకాక మన పర్యావరణాన్ని, జీవ వైవిధ్యాన్ని, విధ్వంస మొనరిస్తూ సహజ వనరులను దోపిడీ చేస్తున్న శక్తులు కూడా వీరితో కలిసి సాధారణ ప్రజల జీవనాన్ని దెబ్బ తీస్తున్నారు. నష్టపోతున్న, వెతలు పడుతున్న, వేదనకు గురవుతున్న వారి గొంతుకగా ఉండాల్సిన సాహిత్య రంగం కృషి మరింత పెరగవలసే ఉంది. చైతన్యధార సంఘటితమైతేనే వీటిని ఎదుర్కోగలము.

తెలంగాణలో ఆనాటి సాహిత్య కారులకు ఒక ప్రత్యేకత ఉన్నది. సాహిత్య సృజనతో పాటుగా, నాటి రాజకీయ, సామాజిక ఉద్యమాలలో భాగస్వాములుగా కొనసాగటం మనం చూస్తాము. దాశరథి కృష్ణమాచార్యులు, ఇక్కడి నిజాం నిరంకుశపాలనపై కవితాగ్ని ధారను కురిపించటమే కాక, ప్రత్యక్షపోరాటంలో నిర్బంధ జీవితాన్ని గడిపాడు. అట్లాంటి దాశరథి శత జయంతి సంవత్సరంలోకి వచ్చిన సందర్భంగా ఇక్కడి సాహితీకారులు తమ గమనాన్ని ఒక మారు పరిశీలించుకోవలసి ఉంది. ఇదే సంవత్సరం తెలంగాణ సాయుధ పోరు కాలపు ప్రజా జీవన చిత్రాన్ని కావ్యంగా మలచిన 'త్వమేవాహం' కవి ఆరుద్ర శతజయంతి కూడా కావడం, మన పునఃచైతన్య స్ఫూర్తికి దోహదం చేస్తుందని భావిస్తాను. వారి స్ఫూర్తితో ప్రజా సాహిత్య కృషి జరగాలి. వారి వారసత్వంగా చైతన్యంతో సాహిత్య సృజన చేస్తున్న వారూ ఉన్నారు. కానీ ఇలాంటి సందర్భం లోనూ స్థానిక, స్థానికేతర అనే వైషమ్యాలకు తావి వ్వడం సరికాదని అనుకుంటున్నాను. ఇక గత పదేళ్లగా సాఫీగా లేదా సాధారణంగా సాగిన సామాజిక సాహిత్య రంగం మళ్లీ ఇపుడు ప్రాంతీయ అస్థిత్వ విషయాలను ఎందుకు ముందుకు తెస్తున్నదో అర్థం కాదు. రాజకీయ ప్రేరణలుగానే అనుకోవాలా! లక్ష్యం ఏమిటి? వర్తమానపు విరోధి ఎవరనే స్పృహ సాహిత్యకారులకు చాలా అవసరం. కలాన్ని ఎవరి మీద ఎక్కుపెట్టాలో స్పష్టత ఉండాలి. ఇది లేకుంటే ప్రజాహితమైన విషయం వెనక్కు పోతుంది. సమూహంగా కదలాల్సిన వేళ వేరు పడడాన్ని నిరోధించుకోవాలి.



ఈ దేశంలో రైతుల బాధలను, ఆందోళనలను తెలుగు కవిత్వం సమర్థవంతంగానే ప్రతిబింబించింది. అనేక కవితా సంపుటులు రైతు ఘోషను వినిపించాయి. మణిపూర్‌లో జరుగుతున్న అమానవీయ దాడులను, విధ్వంసాలనూ ఇక్కడి కవులు చిత్రిక పట్టారు. బాధితులకు మద్దతుగా నిలిచారు. దేశం మొత్తంలో దళిత, ఆదివాసీలపై పెరిగిన దాడులు, నిర్బంధాలపై సాహితీ గళం ఎత్తింది. మత విద్వేషాలపైనా ప్రతిస్పందన వచ్చింది. అంతర్జాతీయంగా సామ్రాజ్యవాదుల కుట్ర కారణంగా తలెత్తిన యుద్ధాల్లో బలౌతున్న ప్రజలకు సంఘీభావంగానూ తెలుగు కవులు స్పందించారు. పాలస్తీనాకు తమ నైతిక మద్దతును తెలిపారు. ఆహ్వానించాల్సిన పరిణామమేమంటే ఈ సంవత్సరం సాహిత్య సృజనలో యువత పెరిగారు. మరీ ముఖ్యంగా యువ రచయిత్రులు, కవయిత్రులు ఆధునిక సమాజపు సవాళ్లపై, సమస్యలపై రచనలు చేయడం ఒక శుభ పరిణామం. 'యూత్ లిటరరీ ఫెస్ట్'లో పాల్గొన్న యువత ప్రసిద్ధుల సాహిత్య చర్చలకు సమఉజ్జీగా చర్చ చేయటం ఆశావహమైన విషయం. కొత్త తరం ఒక 'వేవ్'లా వస్తోంది. వారికి సరైన మార్గదర్శనం చేయాల్సిన అవసరం ఉంది.



- కె.ఆనందాచారి
9948787660

కొత్త తరం వస్తోంది పాతతరం పోతోంది. ఈ సంవత్సరం సాహిత్య రంగం నుండి శాశ్వతంగా నిష్క్రమిం చినవాళ్లు అందించిన స్ఫూర్తిని మననం చేసుకోవాలి. సాహిత్యాన్ని అధ్యయనం చేయాలి. ప్రసిద్ధ రచయిత్రి బోయి విజయభారతి మన నుండి దూరమయ్యారు. ప్రముఖ మళయాళీ రచయిత ఎం.టి.వాసుదేవ నాయర్ ఇటీవలె మరణించారు. హైద్రాబాదీ కళాస్రష్ట శ్యాం బెనగల్, భారతీయ తబలా కళను విశ్వవ్యాప్తం చేసిన జాకీర్ హుస్సేన్, వైవిధ్య రచయిత కాశీభట్ల వేణుగోపాల్, ప్రసిద్ధ రచయిత ఉప్పల నర్సింహ, గుస్సాడి జానపద కళాకారుడు కనకరాజు, కవి అడిగోపుల వెంకట రత్నం, పరిశోధక రచయిత డా॥ ముత్యం, వడ్డేపల్లి కృష్ణ, నల్లెల రాజయ్య, దార్ల రామచంద్ర, మండల స్వామి, సాధిక్ అలీ మొదలైన సాహిత్యకారులు మనకెంతో ప్రేరణనిచ్చి వెళ్లిపోయారు.

ఈ సంవత్సరమే తెలుగు సాహిత్యానికి జాతీయ స్థాయిలో గుర్తింపును తెచ్చినవాళ్లు ఉన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీవారు అనువాద సాహిత్యంలో మన ఎలనాగ అవార్డును పొందారు. అదే విధంగా బాల సాహిత్య విభాగంలో చంద్రశేఖర్ ఆజాద్ అవార్డు దక్కించుకున్నారు. ఇక సాహిత్య అకాడమీ యువ పురస్కారాన్ని రమేశ్ కార్తీక్ నాయక్ అందుకోవడం ఒక సంతోషకర విషయం. ఇటీవలే కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డును అభ్యుదయ రచయిత పెనుగొండ లక్ష్మీ నారాయణకు ప్రకటించారు. ఇక మన రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కాళోజీ పురస్కారాన్ని ప్రసిద్ధ కవి, భాషావేత్త నలిమెల భాస్కర్‌కు ప్రకటించినప్పటికీ ఇంకా అందజేయలేదు. జూకంటి జగన్నాథం దాశరథి పురస్కారాన్ని పొందారు.

ప్రభుత్వాలు కానీ, అకాడెమీలు, సంస్థలు ప్రకటించే అవార్డులు పురస్కారాలు రచయితలకు ఉత్సాహాన్ని నింపుతాయి, కానీ అంతకంటే సాహిత్యకారుల రచనలు వెలుగులోకి తీసుకురావటం ముఖ్యమైనది. సాహిత్య సభలు, కార్యశాలలు నిర్వహించడం అవసరమైనది. తెలంగాణ సాహిత్య అకాడెమీకి ఇంకా ఇంతవరకు చైర్మెన్‌ను నియమించలేదు. సాహిత్య సాంస్కృతిక విధానాన్ని ప్రకటించలేదు. చరిత్రకు, సంస్కృతికి సంబంధించినది ఎంతో వెలికితీయవలసి ఉంది. ప్రభుత్వాలు ఆ వైపుగా కదలాలి.

ప్రభుత్వాలు కానీ, అకాడెమీలు, సంస్థలు ప్రకటించే అవార్డులు పురస్కారాలు రచయితలకు ఉత్సాహాన్ని నింపుతాయి, కానీ అంతకంటే సాహిత్యకారుల రచనలు వెలుగులోకి తీసుకురావటం ముఖ్యమైనది. సాహిత్య సభలు, కార్యశాలలు నిర్వహించడం అవసరమైనది. తెలంగాణ సాహిత్య అకాడెమీకి ఇంకా ఇంతవరకు చైర్మెన్‌ను నియమించలేదు. సాహిత్య సాంస్కృతిక విధానాన్ని ప్రకటించలేదు. చరిత్రకు, సంస్కృతికి సంబంధించినది ఎంతో వెలికితీయవలసి ఉంది. ప్రభుత్వాలు ఆ వైపుగా కదలాలి.

కొంత స్తబ్దంగా కళా సాహిత్యాలు ఉన్నప్పటికీ చైతన్యయుత వారసత్వపు మెరుపులూ సజీవం గానే ఉన్నాయి. వాటికి మరింత పదును పెట్టాలి. సాహిత్య రంగంలోకి వస్తున్న యువతను సమీకరించాలి. సాహిత్య విమర్శను పెంచాలి. నూతన సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంలో రచయతలు నవనవోన్మేషంగా ముందుకు కదలాలి. సమాజాన్ని ముందడుగు వేయించడంతో సాహితీకారులు విజయవంతం కావాలి.

అంబేద్కర్ అంబేద్కర్ అంబేద్కర్

కూల దోస్తే కూలిపోయే.
విగ్రహం కాదు ఆ పేరు
పగలగొడితే విరిగిపోయే
బొమ్మ కాదు ఆ పేరు

భయంభయంగా
తుడిచేసినా తడిపేసినా
నోరు నెత్తిన పెట్టుకొని
మాయం చేసినా సరే!

మీ గుండెల్లో కళ్ళు తెరిచి చూస్తున్న
'టోర్నాడో' ఆ పేరు !!

కులం ఉచ్చ కంపు మెడను వంచి
మతం మలం కంపు ముడ్డి మీద తన్ని
అంటరానితనం గుండెల్లో

ఆత్మగౌరవోదయం నాటిన పేరది

నిచ్చెనమెట్లకు వేలాడుతున్న ఉరితాడుకు
చండాలుని తప్పించి
మనవును వేలాడదీసిన పేరది

కరిగించి పెట్టుకున్న సీసం డబ్బాలు
నూరి పెట్టుకున్న నాలుకలు
కోసే కత్తులు
కట్టి పెట్టుకున్న ముడ్డిక్కట్టే చీపిర్లు
చేసి పెట్టుకున్న మూతి కట్టే ముంతలు
మీ మాటల్లో మీ చేతల్లో
మీ అడుగుల్లో మీ ఆలోచనల్లో
తలుక్కున మెరవడం
మాక్కనిపిస్తూనే ఉంది
అక్షరానికి బలి ఇచ్చిన

ఇంద్ర కుమార్ మేగ్వాల్
ఏడుపు వినిపిస్తూనే ఉంది

నువ్వు గాయం చేసినప్పుడల్లా
మా మందుపట్టి ఆ పేరే!

దళిత గోవిందం మిత్రులారా!
మీ దేవుళ్ళ స్వర్గాలను మీ కొదిలి
సబ్బండ వర్ణాల నేల మీది స్వర్గాలకు
నడవాల్సిన దారి
చూపిన చూపుడువేలు ఆ పేరు

మీకు చూపానది గాని
నాలుగు బాటల మీద నిలబడ్డది
ఆరడుగుల విగ్రహం కాదు
మా గుండెల్లో నిద్రిస్తున్న సునామీ!

- వడ్డెబోయిన శ్రీనివాస్,
9885756071

దీపం కోసం రాత్రి లోకమంతా గాలిస్తుంది

గాయాన్ని దాచుకోవడం
ఒక కళ !
కన్నీళ్ళు ఆపుకోవడం
ఒక మెళకువ !
ఇది రద్దీగా వుండే
నగరంలోని సెంటర్,
జనం కళ్ళబడితే,
రక రకాల కథలల్లి బద్నాం చేస్తారు !

మాటల్లో చేతల్లో
వొణుకు రాకుండా వుండడం నిబ్బరం!
శిథిలాల దగ్గర నిలుచున్నా
చందమామను చూడడం జీవితం !

మారే వయసులో, సాగే కాలంలో
మార్పు చిత్రంగా వుంటుంది
కలలు, కోరికలు, కోపాలు
మునిగిన పడవలా వుండి పోతాయి

గడిచిన క్షణాలు
అలసి పోయి వుంటాయి
తడిసిన కళ్ళు బరువుగా వుంటాయి
ఆలోచనలు రెక్కలు తెగి వుంటాయి
చిమ్మ చీకట్లో వొంటరిగా
దీపం కోసం రాత్రి,
లోకమంతా గాలిస్తుంది

- ఆశారాజు,
9392302245

సాధికార విమర్శ పెనుగొండ 'దీపిక'

తెలుగు సాహిత్యానికి దీప దారిగా నిలుస్తున్న ప్రామాణిక విమర్శ గ్రంథం దీపిక.అందుకే ఈ సంవత్సరం అభ్యుదయ రచయిత పెనుగొండ లక్ష్మీనారాయణ రాసిన ఈ దీపిక వ్యాస సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావడం అందరికీ సంతోషకరమైన విషయం.

ఆధునికతను, అభ్యుదయ సాహిత్యాన్ని వక్రీకరించినపుడు ఎంతటి పెద్దవారైనా నిర్మొహమాటంగా వాటిని సాధికారంగా విమర్శిస్తూ ఆధారాలతో వాస్తవాన్ని ప్రకటించే లోతైన అధ్యనం అవగాహన ఇందులో ఉంది.

అభ్యుదయ దృక్పధంతో వ్రాసిన ఈ వ్యాససంపుటి తెలుగు సాహిత్య పరిణామాలను ఎక్స్‌రే తీసింది. గత వర్తమాన కాలాలలో వెలువడిన సాహిత్యాన్ని, సాహితీ సంపుటాలను కూలంకషంగా మూల్యాంకనం చేస్తూ అనేక కొత్త విషయాలను ఈ వ్యాస సంపుటిలో పెనుగొండ లక్ష్మీనారాయణ ప్రామాణికంగా విపులీకరించారు.పెనుగొండ లక్ష్మీనారాయణ ముఖ్యంగా కథా సాహిత్యంపై అపారమైన అనుభవంతో అనేక సంకలనాలను తన సంపాదకత్వంలో తీసుకువచ్చారు. కథ తీరుతెన్నులను,అవి సమాజం పట్ల బాధ్యతాయుతంగా రాయబడినవా,లేదా అనేది ఈ పుస్తకం చదివితే అర్థమౌతుంది.ఈ పుస్తకంలో అభ్యుదయ సాహిత్య ఉద్యమ రథసారథులు రాంభట్ల కృష్ణమూర్తి, సెట్టి ఈశ్వర రావు, ఆవంత్స సోమసుందర్, రెంటాల గోపాల కృష్ణ, డా॥ఎఎస్.వి. సత్యనారాయణ, ముత్యాల ప్రసాద్ లను పరిచయం చేయడమే కాకుండా వారి సాహితి సంపదను భావితరాలకు అందించే విధంగా సుసంపన్నం చేశారు. ఈ సంపుటిలో మొత్తం 36 వ్యాసాలు ఉన్నాయి.

1943లో ప్రారంభించిన అభ్యుదయ రచయితల సంఘానికన్న ముందే అభ్యుదయ సాహిత్యం ప్రారంభమైన అభ్యుదయ సాహిత్యాన్ని విశ్లేషిస్తూ ఇదొక సజీవ సాహితీ స్రవంతి అని సోదాహరణంగా వివరించారు.

ప్రముఖ కవి డా.సి.నారయణ రెడ్డి గురజాడతో పాటు రాయప్రోలు సుబ్బారావును యుగకర్తలుగా పేర్కొనడాన్ని ప్రశ్నిస్తూ ఇది అకాడమిక్ కుట్ర అని,గురజాడ ఒక్కడే యుగకర్త అని,అందుకు ఎస్వీ సత్యనారాయణతో పాటు పలువురి సూత్రీకరణలు ఆధారాలుగా చూపించారు.వ్యక్తి కేంద్రమైన ప్రణయ ధర్మానికి పట్టం కట్టిన రాయప్రోలును యుగకర్త అంటూ కొందరు, ఇరువురు యువకర్తలేనంటూ ఇంకొందరు, సమాజ కేంద్రమైన ప్రజాస్వామ్య ధర్మాన్ని ప్రవచించిన గురజాడ సరసన రాయప్రోలును నిలుపూనడం ఆయా సాహితీ వేత్తల హ్రస్వదృష్టికి నిదర్శనమని ఈ సంపుటిలో పేర్కొన్నారు.ప్రముఖ కవి



కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో సాయుధ పోరాటం 1948 సెప్టెంబర్ వరకు నైజాంపాలనకు, ఆ తర్వాత 1951లో విరమించే వరకు భారత ప్రభుత్వంపైనా కొనసాగింది. ఐతే కొన్ని గ్రామాల్లో కాంగ్రేసు పార్టీ నామమాత్రపు దళాలను కలిగి ఉండి ఒకటి రెండు దళాలు రైఫిల్ వంటి ఆయుధాలను మాత్రమే కలిగి ఉన్నాయి. ఐతే ఆ దళంలోని ఒక కాంగ్రేసు కార్యకర్త సాహసకృత్యానికి రూపకల్పనే ఈ గొల్లరామవ్వ కథ అని, ఈ కథ వెల్వడకుంటే కాంగ్రేసు ఆ మేరకైనా నిజాం వ్యతిరేక సాయుధ పోరాటంలో పాల్గొన్నట్లు లోకానికి తెలిసేది కాదనే చారిత్రక వాస్తవాన్ని నిర్మొహమాటంగా చాటిచెప్పారు.

జాషువా మనకెప్పటికీ అవసరమే అనే వ్యాసంలో ప్రణయ వ్యాధిగ్రస్తులై ఉన్న భావకవులకు ధీటుగా జాషువా ప్రగతిశీల సాహిత్యాన్ని సృష్టించారని పేర్కొన్నారు.

అక్కిరాజు రమాపతిరావు సంపాదకత్వంలో వచ్చిన తొలి మలి తరం కథా సంకలనంపై ప్రామాణికత లోపించిందని సూత్రబద్ధమైన విమర్శ చేశారు. ఈ సంకలనంలో వచ్చింది. దీనిలో 42 మంది కథా రచయితల కథలుండగా ఇద్దరు తప్ప 40 మంది బ్రాహ్మణ రచయితలేనని, అంటే ఆ కాలంలో బ్రాహ్మణ రచయితల పాత్ర తెలుసుకోవడానికి మాత్రమే దీన్ని తీసుకువచ్చినట్లు కుండబద్దలు కొట్టి మరీ ప్రకటించారు. అంతే కాకుండా 1903 లో వచ్చిన ఆచంట సాంఖ్యాయన శర్మ రాసిన అపూర్వోపన్యాసం మొదటి కథ ఎందుకు కాకూడదన్న అక్కిరాజు గారి సంశయాన్ని పటాపంచలు చేస్తూ 1902లో వచ్చిన భండారు అచ్చమాంబ ధనత్రయోదశి,స్త్రీ విద్య,తొలి తెలుగు కథ అని తేల్చి చెప్పారు.

అదే విధంగా భారత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు రాసిన గొల్ల రామవ్వ కథలో కాంగ్రేసు పార్టీ నిజాంకు వ్యతిరేకంగా సాయుధ పోరాట వీరోచిత కృత్యాన్ని వివరించారని, కాని కాంగ్రేసు నిజాం పాలనకు వ్యతిరేకంగా సాయుధ పోరాటాన్ని నిర్వహించిందా అనే ప్రశ్న లేవనెత్తారు.



కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో సాయుధ పోరాటం 1948 సెప్టెంబర్ వరకు నైజాంపాలనకు, ఆ తర్వాత 1951లో విరమించే వరకు భారత ప్రభుత్వంపైనా కొనసాగింది. ఐతే కొన్ని గ్రామాల్లో కాంగ్రేసు పార్టీ నామమాత్రపు దళాలను కలిగి ఉండి ఒకటి రెండు దళాలు రైఫిల్ వంటి ఆయుధాలను మాత్రమే కలిగి ఉన్నాయి. ఐతే ఆ దళంలోని ఒక కాంగ్రేసు కార్యకర్త సాహసకృత్యానికి రూపకల్పనే ఈ గొల్లరామవ్వ కథ అని, ఈ కథ వెల్వడకుంటే కాంగ్రేసు ఆ మేరకైనా నిజాం వ్యతిరేక సాయుధ పోరాటంలో పాల్గొన్నట్లు లోకానికి తెలిసేది కాదనే చారిత్రక వాస్తవాన్ని నిర్మొహమాటంగా చాటిచెప్పారు.

కడియాల రాంమోహన్ రాయ్ తెలుగు సాహిత్యంపై శ్రీశ్రీ ప్రభావం అనే శీర్షికతో రాసిన పరిశోధనలోని వక్రీకరణలను ఇదేం పరిశోధన రాయ్ గారు అని పెనుగొండ తన వ్యాసంలో ఎత్తి చూపుతూ ఆధారాలతో వాస్తవాలను ప్రకటించాడు.పెదపూడిలో అరసం నడిపిన పాఠశాలలో శ్రీశ్రీ పాల్గొనలేదనేది వాస్తవం కాదని,ఆ పాఠశాలలో పాఠాలు చెప్పిన 14 మందిలో శ్రీశ్రీ కావ్య విమర్శపై పాఠం చెప్పారని ఆధారాలతో చూపించారు. శ్రీశ్రీ ప్రభావం తెలుగు వచన రచనలపై ఉందన్న రాయ్ వాదన కరెక్టు కాదని, ఆయన కవులను ఎంతగానో ప్రభావితం చేశారు, కాని కథకులను ప్రభావం చేసినట్లు ఏ కథకుడు చెప్పుకోలేదని తేల్చి చెప్పారు.1955 తర్వాత అరసం ఉనికిని కోల్పోయిందని,అరసాన్ని గురించి రాంమోహన రాయ్ చేసిన వాదన సరైనది కాదని, అరసం స్థబ్దతకు గురైనా అభ్యుదయ సాహిత్య సృజన ఆగలేదని, అభ్యుదయ రచయితల కార్యకలాపాలు కొనసాగాయని ఆ కాలంలో వెల్వడిన అభ్యుదయ సాహిత్యాన్ని ఇందులో విశ్లేషించారు.

తెలంగాణ విమోచనపోరాట సాహిత్యం ఆంధ్రా అభ్యుదయ రచయితల సంఘీభావం అనే వ్యాసంలో అనేక ఆంధ్రాప్రాంత రచయితల సాహిత్యాన్ని ఇందులో పొందుపరిచారు. నిజాంకు వ్యతిరేకంగా,ఆ తరువాత యూనియన్ సైన్యాలకు వ్యతిరేకంగా 1947 సెప్టెంబర్ 11 నుండి 1951 అక్టోబర్ 21 వరకు సాగిన సాయుధ పోరాట అనేక మంది ఆంధ్రా కవుల గుండెలను మండించిందని,అందులో భాగంగానే స్పందిస్తూ అనేక కవితలు,కథలు,నవలలు,నాటకాలు రాశారని సోదాహరణంగా తెలిపారు.నవలా సాహిత్యంలో బొల్లిముంత శివరామకృష్ణ మృత్యుంజయులు,లక్ష్మీకాంత మోహన్ సింహగర్జన,మహీధర రామమోహన రావు ఓనమాలు,తిరునగరి రామాంజనేయులు సంఘం నవలలు తెలంగాణ సాయుధపోరాట ఉద్యమ ప్రేరణతో రాసినవేనని పేర్కొన్నారు.

కథా సాహిత్యం కూడా విరివిగా వెలువడిందని గంగినేని వెంకటేశ్వర రావు ఎర్రజెండాలు, తుమ్మల వెంకట రామయ్య కథలు, శారద కథలు విరివిగా రాశారని పేర్కొన్నారు. అడ్లూరి పిచ్చేశ్వర్ రావు, కోదండ రామ శాస్త్రీ, ఉప్పల లక్ష్మణ రావు, లక్ష్మీకాంత మోహన్, శివశంకర శాస్త్రీ, కోసరాజు శేషయ్య, తెన్నేటి సూరి,గిడుతూరి సూర్యం లాంటి అనేకమంది రచయితలు సృష్టించిన తెలంగాణ సాయుధపోరాట కథాసాహిత్యాన్ని విస్తృతంగా ఇందులో చూపించారు. అలాగే గేయ,వచన కవిత్వం కూడా చాలా వచ్చిందని తిరునగరి రామాంజనేయులు, పులుపుల వెంకట శివయ్య, తుమ్మల వెంకట రామయ్య, ఆవంత్స సోమసుందర్, ఆరుద్ర, గంగినేని వెంకటేశ్వర్ రావు, కారుమంచి వెంకటేశ్వర్ రావు,కుందుర్తి అంజనేయులు, టి.కృష్ణ, రెంటాల గోపాల కృష్ణయ్య,అనిసెట్టి సుబ్బారావు, నార్ల చిరంజీవి, లాంటి అనేకమంది కవులు కవితలు రాయడమే కాకుండా కవితా సంపుటాలను, సంకలనాలను కూడా తీసుకువచ్చారని సోదాహరణంగా వివరించారు. అదే క్రమంలో నాటక సాహిత్యం కూడా వచ్చిందని, ముఖ్యంగా సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కర్ రావులు మా భూమి, ముందడుగు నాటకాలు రాశారని అవి ఎంతగానో ప్రజలను ఉద్యమోన్ముఖుల్ని చేశాయని ఇందులో వివరించారు.అంతే కాకుండా మా గోఖలే అనేక రేఖాచిత్రాలు గీసారని ఇందులో పేర్కొన్నారు.వామపక్ష పాత్రికేయులు మద్దుకూరి చంద్రశేఖర్ రావు తెలంగాణ పోరాటంపై వచ్చిన సాహిత్యాన్ని విశ్లేశించారని ఇందులో తెలిపారు.

ఉత్తమ మర్క్సిస్టు విమర్శకుడిగా రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి కృషిని ఉన్నతంగా చూపించారు. ఇందులో వైతాళికులు కవితా సంకలనం అదొక ప్రేమగోలని విమర్శించారు. ఇంకా ఈ వ్యాస సంపుటిలో అభ్యుదయ సాహిత్యం దళిత జీవన చిత్రన అనే వ్యాసంలో దళిత సాహిత్యానికి అభ్యుదయ సాహిత్యం ఏ విధంగా తోడ్పడిందో వివరించారు.నవ్య కవిత ఝరి నయాగార,ఎస్వీ జీవితం ఒక ఉద్యమం,1932 నాటి కథావళి సంకలన పరిచయం చేశాయి. ఈ వ్యాసాలు కొత్త ఆలోచనలను రెకెత్తిస్తాయి. చర్చలకు తావిస్తాయి. సాహిత్యానికి మార్గనిర్దేశం చేస్తాయి.

- వేల్పుల నారాయణ, 9440433475

అర్పీలకు కనీస వేతనం రు.18,500 అమలు చేయాలి

- మెప్మా రిసోర్స్ పర్సన్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎస్వీ రమ



నవతెలంగాణ - నారాయణపేట

పట్టణ పేదరిక నిర్మూలన పథకంలో పని చేస్తున్న మెప్మా రిసోర్స్ పర్సన్స్‌కు (ఆర్పీ) కనీస వేతనం జీఓ నెంబర్ 60 ప్రకారం రు.18,500 ఇవ్వాలని మెప్మా రిసోర్స్ పర్సన్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎస్వీ రమ డిమాండ్ చేశారు. ఆదివారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని మోడ్రన్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఆర్పీల జిల్లా సదస్సుకు ఆమె హాజరై మాట్లాడారు. ప్రభుత్వం అనేక సర్వేలను అర్పీలకు అప్పజెప్పి వెట్టి చాకిరి చేయించుకుంటున్నదని తెలిపారు. కానీ శ్రమకు తగ్గ వేతనం ఇవ్వడం లేదని విమర్శించారు. యూనిఫారం, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఇచ్చే రూ.6000 అరకొర వేతనం కూడా 7 నుంచి 9 నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పెండింగ్ లో ఉన్న వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాపాలన అంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఆర్పీల సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జి. వెంకట్రామి రెడ్డి, జిల్లా కార్యదర్శి బలరాం, ఆర్పీల యూనియన్ జిల్లా అధ్యక్షులు సౌభాగ్య, కోస్గి నాయకులు రాధ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేట్ బస్సులో మాదకద్రవ్యాలు

- ఆంధ్రా, తెలంగాణ సరిహద్దు చెక్‌పోస్టులో స్వాధీనం
- చాక్లెట్స్‌గా మార్చిన వైనం.. విచారిస్తున్న ఎక్సైజ్ పోలీసులు



నవతెలంగాణ-కోదాడ రూరల్

ప్రయివేట్ బస్సులో డ్రగ్స్ పట్టుబడిన ఘటన సూర్యాపేట జిల్లా కోదాడ మండల పరిధిలోని నల్లబండగూడెం అంత రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద ఆదివారం కలకలం సృష్టించింది. నూతన సంవత్సరం సమీపిస్తున్న సందర్భంగా ఆబ్కారీ పోలీసులు ఆంధ్రా నుంచి మద్యం తెలంగాణలోకి రాకుండా రాష్ట్ర సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్నారు. దాంతో ప్రయివేటు బస్సులను చెక్ చేయడంతో మాదకద్రవ్యాలు పట్టుబడ్డాయి.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనేశ్వర్ నుంచి హైదరాబాద్‌కు ప్రయాణికులతో వెళ్తున్న ప్రయివేట్ బస్సు కొంత దూరం ప్రయాణించిన తర్వాత కొంతమంది పెట్రోల్ బంకు వద్ద బ్యాగ్‌లు, సంచులతో బస్సు ఎక్కారు. రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్ట్ మండలపరిధిలోని రామాపురం క్రాస్‌రోడ్ చెక్‌పోస్టు వద్దకు రాగానే అక్కడ విధులు నిర్వహిస్తున్న ఎక్సైజ్ పోలీసులు, ఇతర సిబ్బంది వాహనాన్ని తనిఖీ చేశారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన 25 ప్యాకెట్లలో వెయ్యి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. వాటిని పరిశీలించగా గంజాయి చాక్లెట్లుగా గుర్తించారు. బస్సును, బస్సులో అనుమానాస్పదంగా ఉన్న ఆరుగురు ప్రయాణికులను ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు. బస్సులో ఉన్న మాదకద్రవ్యాలకు సంబంధించిన బ్యాగు తమది కాదని ప్రయాణికులు తెలపడంతో ప్రయాణికుల్ని, బస్సు డ్రైవర్‌ను ఆబ్కారీ పోలీసులు విచారిస్తున్నారు. గంజాయి చాక్లెట్‌లను హైదరాబాద్ తరలిస్తున్నట్టుగా విచారణలో తేలింది. పట్టుబడిన చాక్లెట్ ప్యాకెట్ విలువను అంచనా వేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

11 కీలకమైన ఖనిజ బ్లాకుల వేలం రద్దు

- సరైన స్పందన లేకపోవటంతో ప్రభుత్వం చర్య

న్యూఢిల్లీ : నాలుగో రౌండ్‌లో సరైన స్పందన లేకపోవటంతో 11 కీలకమైన ఖనిజ బ్లాకుల వేలాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. ఈ మేరకు రద్దు నోటీసును జారీ చేసింది. నాలుగు బ్లాకులకు బిడ్‌లు రాకపోగా.. మిగిలిన ఏడు గనులకు మూడు కంటే తక్కువ సాంకేతిక అర్హత కలిగిన బిడ్డర్లు లభించినట్టు నోటీసులో పేర్కొన్నారు. టంగ్‌స్టన్, గ్లాకోనైట్‌లతో కూడిన నాలుగు బ్లాక్‌లు ఛత్తీస్‌గఢ్, అరుణాచల్‌ప్రదేశ్‌లలో ఉన్నాయి. అంతకముందు మూడో రౌండ్‌లో మూడు కీలకమైన మినరల్ బ్లాక్‌లు, రెండో రౌండ్‌లో 14 బ్లాక్‌లు, మొదటి విడతలో 14 కీలకమైన ఖనిజాల బ్లాకుల వేలాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. నాలుగు రౌండ్ల వేలంలో 24 కీలకమైన, వ్యూహాత్మకమైన మినరల్ బ్లాక్‌లను విక్రయించినట్టు ప్రభుత్వం గతంలో పేర్కొన్నది.

ప్రణవి చదువు కోసం కోమటిరెడ్డి ఆర్థిక సాయం



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

నిరుపేద అర్కిటెక్ట్ విద్యార్థిని ప్రణవి చొల్లేటి ఇటలీ విద్యకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి లక్ష రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ఇటలీలోని ప్రఖ్యాత విద్యాసంస్థ పాలిటెన్సికో డిటోరినో (పాలిటో)లో ఆర్కిటెక్చర్ కన్‌స్ట్రక్షన్‌లో మాస్టర్స్‌లో సీటోచ్చింది. కానీ, ఆర్థికంగా తమ కుటుంబం అంత భరించే స్థితిలో లేదంటూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ప్రణవి తెలిపారు. మంత్రికి ఆమె ధన్యావాదాలు తెలిపారు.

కోమటిరెడ్డికి సీఎం అభినందనలు

రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అభినందించారు. ఆర్ఆర్ఆర్ ఉత్తరభాగం టెండర్ ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో ఆదివారం మంత్రికి సీఎం ఫోన్ చేసి అభినందనలు తెలిపారు. మీ కృషి, మీ సహకారం, మీ సలహాతోనే ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టు పట్టాలెక్కిందని ముఖ్యమంత్రికి మంత్రి గుర్తు చేశారు. 2017లో ఆగిపోయిన ప్రాజెక్టు సీఎం అనితరసాధ్యమైన సహకారంతోనే సంవత్సరంలో సాధ్యమైందని వివరించారు. ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టు మంజూరీ చేసిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి సీఎం, మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

యమునా నదిలో మన్మోహన్ సింగ్ అస్థికల నిమజ్జనం



న్యూఢిల్లీ : మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ అస్థికలను ఆయన కుటుంబ సభ్యులు ఆదివారం యమునా నదిలో నిమజ్జనం చేశారు. మజ్ను కాతిలా గురుద్వారా సమీపంలో అస్తఘాట్‌లో సిక్కు సంప్రదాయాల ప్రకారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం ముందుగా మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు జరిగిన నిగంబోధ్ శశ్మాన వాటిక నుంచి అస్థికలను కుటుంబ సభ్యులు సేకరించారు. తరువాత అస్తఘాట్‌కు వెళ్లారు. ఈ కార్యక్రమంలో మన్మోహన్ భార్య గురుశరణ్ కౌర్, ముగ్గురు కుమార్తెలు ఉపిందర్ సింగ్, దమన్ సింగ్, అమృత్‌సింగ్, ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కాగా, సిక్కు ఆచారాల ప్రకారం మోతీలాల్ నెహ్రూ మార్గ్‌లోని మన్మోహన్ సింగ్ నివాసం వద్ద బుధవారం 'అఖండ్ పథ్'ను నిర్వహించనున్నారు. శుక్రవారం రాకబ్ గంజ్ గురుద్వారా వద్ద 'భోగ్', 'అంతిమ్ అర్దాస్' నిర్వహించనున్నారు. 26న 92 ఏండ్ల మన్మోహన్ సింగ్ అనారోగ్యంతో తుది శ్వాస విడిచిన సంగతి తెలిసిందే.

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి

15 శాతం కేటాయించాలి

టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర 6వ విద్యా వైజ్ఞానిక మహాసభలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

- నో డిటెన్షన్ పాలసీ రద్దు సరికాదు
- ప్రభుత్వ పాఠశాలలపై రాష్ట్ర ప్రభుత్వం పర్యవేక్షణ పెరగాలి : టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జంగయ్య, చావ రవి



నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతం చేసేందుకు రాష్ట్ర బడ్జెట్‌లో 15 శాతం కేటాయించాలని నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి తెలిపారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని లక్ష్మీగార్డెన్‌లో జరుగుతున్న టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర 6వ విద్యా వైజ్ఞానిక మహాసభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శి జంగయ్య, చావ రవితో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ మహాసభల్లో ప్రభుత్వ విద్య పటిష్టతపైనే ప్రధానంగా చర్చ జరుగుతుందని తెలిపారు. ప్రాథమిక విద్యకు ఇచ్చే అరకొర నిధులు సరిపోవడం లేదని, విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో 15 శాతం, కేంద్ర బడ్జెట్‌లో 5-6 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనం క్వాలిటీ పెంచాలని, మెనూ చార్జీలు పెంచాలని తీర్మానం చేసినట్టు చెప్పారు. బడికి సమాజాన్ని అనుసంధానం చేయాలని చర్చిస్తున్నట్టు తెలిపారు.

రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శి జంగయ్య, చావ రవి మాట్లాడుతూ.. పాఠశాలలపై ప్రభుత్వం పర్యవేక్షణ పెరగాలని, అన్ని రకాల ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రయివేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠ్యాంశాలనూ మరింత క్రియాశీలకంగా రూపొందించాలని తెలిపారు. విద్యా హక్కు చట్టంను పూర్తి స్థాయిలో అమలు చేసేలా నిధులు కేటాయించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నో డిటెన్షన్ పాలసీ రద్దు సరికాదని, గతంలో నో డిటెన్షన్ రద్దు అంశం తెరపైకి వస్తే మాజీ సీఎం కేసీఆర్ వ్యతిరేకించారని, ఇపుడు సీఎం రేవంత్‌రెడ్డి కూడా వ్యతిరేకించాలని కోరారు. ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని రూ.8 లక్షలకు, సేవింగ్స్ మినహాయింపును రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు.

కేంద్ర ప్రభుత్వం వస్తు సేవలపై జీఎస్టీ పెంచుతూ పోతుందని, కానీ.. ఉద్యోగుల ఆదాయపు పన్ను మినహాయింపు మాత్రం పెంచడం లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల డీఏలు, పెండింగ్ బిల్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానంపై కాంగ్రెస్ ఎన్నికల్లో హామీ ఇచ్చి ఏడాదవుతున్నా చర్యలు లేవన్నారు. తక్షణమే సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని కోరారు. విద్యారంగ సమస్యలపై, ప్రభుత్వ విధానాలపై పోరాటాలు రూపొందిస్తామని తెలిపారు. మహాసభల స్ఫూర్తితో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అలుగుబెల్లి నర్సిరెడ్డిని మరోసారి గెలిపించుకునేందుకు కృషి చేస్తామన్నారు. విద్యా అంశం రాష్ట్ర జాబితాలో ఉండాలన్నదే తమ డిమాండ్ అని స్పష్టంచేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు సీహెచ్.రాములు, రాష్ట్ర కార్యదర్శి ఎం. రాజశేఖర్‌రెడ్డి, కోశాధికారి లక్ష్మారెడ్డి, జిల్లా అధ్యక్షులు బక్క శ్రీనివాస్‌చారి, ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ళ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుళ్ల ఆత్మహత్యల కలకలం

(మొదటిపేజీ తరువాయి)

కలిపిన టీ తాగి కానిస్టేబుల్ కుటుంబం ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. కానిస్టేబుల్ మృతిచెందగా, అతని భార్య, పిల్లలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన జిల్లా కేంద్రమైన సిద్దిపేట పట్టణంలో కాళ్లకుంట కాలనీలో ఆదివారం జరిగింది. సిద్దిపేట వన్ టౌన్ సీఐ వాసుదేవరావు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట పట్టణం కాళ్ళకుంట కాలనీకి చెందిన బండారి బాలకృష్ణ (34) సిరిసిల్ల 17వ బెటాలియన్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. రోజులాగే శనివారం రాత్రి డ్యూటీ ముగించుకొని ఇంటికి వచ్చిన బాలకృష్ణ రాత్రి 11 గంటల సమయంలో తన భార్య మానసతో ప్రయివేట్ కంపెనీలో పెట్టుబడి పెట్టడం కోసం తనకు రూ.25 లక్షల అప్పు అయిందని, అది తీర్చే మార్గం లేదని భార్య వద్ద తన ఆవేదన వ్యక్తం చేశారు. అప్పుల వాళ్ల ఇంటి మీదకి వచ్చి గొడవ చేయకముందే ఆత్మహత్య చేసుకుని చనిపోవడం మంచిదని భార్యకు చెప్పాడు. అనంతరం తన భార్యకు టీ పెట్టమని చెప్పి, టీ తెచ్చాక తన వెంట తెచ్చుకున్న ఎలుకల మందు పౌడర్‌ను టీలో కలిపి భార్యతో పాటు కుమారులు యశ్వంత్, అశ్విత్‌కు ఇచ్చాడు. అది తాగి అందరూ పడుకోగా, ఆదివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో బాలకృష్ణతో పాటు అతని భార్యకు మెలకువ వచ్చింది. పిల్లలతో సహా ఎవరికీ ఏమీ కాకపోవడంతో బాలకష్ణ తన భార్య చీరను తీసుకొని పక్కనే వేరే గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. గమనించిన అతని భార్య బాలకృష్ణ తమ్ముడు సాయితో పాటు తన తమ్ముడు శ్రీశైలంకు ఉరి వేసుకున్న విషయాన్ని ఫోన్ ద్వారా తెలిపింది. దాంతో వారు హుటాహుటిన అక్కడికి చేరుకుని డోర్ పగలగొట్టి, మృతదేహాన్ని కిందకు దించి, పోలీసులకు సమాచారం అందించారు. కానిస్టేబుల్ బాలకృష్ణ, అతని కుటుంబసభ్యులను 108 సహాయంతో సిద్దిపేట ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించగా, అప్పటికే బాలకృష్ణ మరణించినట్టు డాక్టర్లు ధ్రువీకరించారు. చికిత్స పొందుతున్న మృతుని భార్య, పిల్లల పరిస్థితి నిలకడగా ఉందని డాక్టర్లు తెలిపారు.

కొల్చారం హెడ్ కానిస్టేబుల్ ఆత్మహత్య



నవతెలంగాణ-కొల్చారం

మెదక్ జిల్లా కొల్చారం పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సాయి కుమార్ శనివారం రాత్రి స్టేషన్ ముందున్న ఎస్ఐ క్వార్టర్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లాకు చెందిన సాయికుమార్‌కు సంగారెడ్డి జిల్లా జోగిపేటకు చెందిన లక్ష్మితో వివాహం జరగడంతో జిల్లాలోని నర్సాపూర్ ప్రాంతంలో సుదీర్ఘ కాలం పనిచేశారు. దాంతో నర్సాపూర్ పట్టణంలో ఇల్లు నిర్మించుకొని కొన్నేండ్లుగా నర్సాపూర్‌లో నివసిస్తున్నారు. రెండేండ్ల కిందట జరిగిన బదిలీల్లో సాయికుమార్ కొల్చారం పోలీస్ స్టేషన్‌కు హెడ్ కానిస్టేబుల్‌గా వచ్చారు. కాగా, నర్సాపూర్ పట్టణానికి చెందిన ఒక మహిళతో సాయికుమార్‌కు వివాహేతర సంబంధం ఉన్నట్టు సమాచారం. కొన్ని రోజులుగా ఆమె సాయికుమార్‌ను డబ్బుల కోసం వేధింపులకు గురిచేస్తోంది. డబ్బులు ఇవ్వకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని బెదిరింపులకు పాల్పడుతుండటంతో ఆందోళనకు గురయ్యాడు. దాంతో తన చావే అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతుందంటూ ఆత్మహత్య చేసుకుంటానని అంటున్నట్టు కుటుంబీకులు.. కొల్చారం ఎస్ఐ మహమ్మద్ గౌస్‌కి సమాచారం ఇచ్చారు. దాంతో ఎస్ఐ మహమ్మద్ గౌస్.. సాయి కుమార్‌తో రెండు రోజుల క్రితం మాట్లాడగా.. రెండు రోజుల్లో తానే సమస్యను పరిష్కరించుకుంటానని చెప్పారు. ఇదే విషయాన్ని ఎస్ఐ.. హెడ్ కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకు తెలిపారు. కాగా శనివారం రాత్రి విధులకు వచ్చిన సాయి కుమార్.. అందరూ నిద్రపోతున్న సమయంలో స్టేషన్ ముందు పాడుబడి ఉన్న ఎస్ఐ క్వార్టర్ వెనుక భాగంలో ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంఘటనా స్థలాన్ని మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ సందర్శించారు. వెంటనే కొల్చారం పోలీసులు మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఎంపీహెచ్‌ఏ (ఫిమేల్) పరీక్షకు 84.89 శాతం హాజరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం ఎంపీహెచ్‌ఏ (ఫిమేల్) పోస్టుల కోసం నిర్వహించిన పరీక్షకు 84.89 శాతం మంది హాజరయ్యారు. ఈ మేరకు మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్ మెంట్ బోర్డు సభ్య కార్యదర్శి ఒక ప్రకటన విడుదల చేశారు. కంప్యూటర్ బేస్డ్ పరీక్షను రాసేందుకు 24,268 మంది దరఖాస్తు చేసుకున్న సంగతి తెలిసిందే. కాగా 20,600 మంది పరీక్ష రాశారు.

పాఠకుల మదిని దోచిన పుస్తకాల పండుగ

(మొదటిపేజీ తరువాయి)

కంటే ఈ సారి పెద్దఎత్తున ఢిల్లీ, కోల్‌కతా, ముంబాయి, చెన్నై తదితర నగరాలకు చెందిన పబ్లిషర్లు తమ స్టాళ్లను ఏర్పాటు చేశారు. 171 తెలుగు, 135 ఇంగ్లీషు, 45 స్టాళ్లు ప్రభుత్వ, వివిధ సంస్థలకు చెందినవి కొలువుదీరాయి. కేంబ్రిడ్జి, ఆక్స్‌ఫర్డ్, సైమన్స్ సిస్టల్, పెంగ్విన్, బ్రిటిష్ కౌన్సిల్ తదితర సంస్థలు విభిన్న భాషలో ప్రచురించిన లక్షలాది పుస్తకాలు ఈ ప్రదర్శనలో అమ్ముడయ్యాయి.

70కి పైగా కొత్త పుస్తకాల ఆవిష్కరణ

తెలుగు సాహిత్యాన్ని బతికించేందుకు అలుపెరుగని అక్షర మథనం సాగిస్తున్న రచయితల కలాల నుంచి జాలువారిన 70కి పైగా పుస్తకాలను ఆవిష్క రించారు. బుక్‌ఫెయిర్‌లో ఏర్పాటు చేసిన తోపుడు బండి సాదిక్, బోయి విజయభారతి వేదికలు పుస్తక ఆవిష్కరణలకు, చర్చాగోష్ఠులకు కేరాఫ్‌గా నిలిచాయి. బుక్ డొనేషన్ బాక్స్‌లో పలువురు పాత పుస్తకాలను వితరణ చేశారు. వీటిని ప్రాధాన్యతాక్రమంలో గ్రామ గ్రంథాలయాలకు తరలిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన రాజ్యాంగం

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి పుస్తక ప్రదర్శనలో రాజ్యాంగం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గత పదేండ్లుగా దేశంలో వస్తున్న అనేక మార్పులకు ఇది సంకేతమని భావిస్తున్నారు. ఇటీవలి కాలంలో భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో రాజ్యాంగం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో 37వ హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో రాజ్యాంగాన్ని పాఠకులు బాగా ఆదరించారు. గతంలో ఒకటి అర షాపుల్లో మాత్రమే లభించే ఈ పుస్తకాన్ని ఈ సారీ సగానికిపై షాపుల్లో అందుబాటులో ఉంచారు. అమ్మకాలు సైతం పెద్దఎత్తున సాగాయని పలువురు షాపుల యజమానులు పేర్కొన్నారు.

పోలీసుల ఆత్మహత్యలు ప్రభుత్వానికి పట్టవా?

- మాజీమంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పోలీసుల ఆత్మహత్యలు ప్రభుత్వానికి పట్టింపు లేదా? అని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ములుగు జిల్లాలో ఎస్సై, సిద్దిపేటలో కానిస్టేబుల్ కుటుంబం, కామారెడ్డిలో ఎస్సై , కానిస్టేబుల్, ఆదివారం సిరిసిల్లలో కానిస్టేబుల్ కుటుంబం, మెదక్ కుల్చారంలో హెడ్ కానిస్టేబుల్... వీరంతా స్వల్ప కాలంలో పోలీసులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలిపారు. ప్రజల ప్రాణాలు కాపాడాల్సిన పోలీసులే వరుసగా ప్రాణాలు కోల్పోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తున్నదని పేర్కొన్నారు. శాంతి భద్రతలు పరిరక్షించవలసిన రక్షకుల జీవితాలకే రక్షణ కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. పని ఒత్తిళ్లు, పెండింగ్ హామీలను తీర్చడంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి పోలీసులపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నదని తెలిపారు. ఈ ఆత్మహత్యలపై నిజానిజాలు వెలుగులోకి రావడానికి శాఖాపరమైన దర్యాప్తు చేయాలని తెలంగాణ డీజీపీని కోరినట్టు తెలిపారు.

ఉపాధి పథకంలో తక్కువ వేతనాలు

- పార్లమెంటరీ కమిటీ పెదవి విరుపు
- పనిదినాలు పెంచాలని సూచన
- వేతనాలు సవరించాలని సిఫారసు

న్యూఢిల్లీ : మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కార్మికులకు తక్కువ వేతనాలు లభిస్తుండడంపై పార్లమెంటరీ కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. కార్మికుల వేతనాలు సవరించాలని, వాటిని ద్రవ్యోల్బణ రేటుకు అనుగుణంగా ధరల సూచీతో అనుసంధానం చేయాలని సూచించింది. గ్రామీణాభివృద్ధిపై ఏర్పాటు చేసిన కమిటీ ఉపాధి హామీ పథకం వేతన రేటుపై ఇటీవల లోక్‌సభకు తన నివేదికను అందజేసింది. పథకంలో కనీస పనిదినాలను 100 నుంచి 150కి పెంచాలని కూడా కాంగ్రెస్ ఎంపీ సప్తగిరి ఉలకా నేతృత్వంలోని పార్లమెంటరీ కమిటీ సిఫారసు చేసింది. 2006లో ఉపాధి హామీ పథకం ప్రారంభమైంది. అప్పటి నుంచి 2011-12 వరకూ రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించిన కనీస వేతనాల ఆధారంగానే వేతన రేటును నిర్ణయించారు. 2011-12 నుంచి వ్యవసాయ కార్మికుల వినియోగ ధరల సూచీ (సీపీఐ-ఏఎల్)ని ఉపయోగించి కేంద్ర ప్రభుత్వమే వేతన రేట్లను నిర్ణయించడం మొదలు పెట్టింది. ఈ సూచీ ఆహార వస్తువులకు అధిక ప్రాధాన్యత ఇచ్చింది. అయితే గ్రామీణ ప్రాంత వినియోగ ధరల సూచీ (సీపీఐ-రూరల్) ఆధారంగా కార్మికుల వేతనాలను నిర్ణయిస్తే సబబుగా ఉంటుందని 2015లో ఆర్థికవేత్త మహేంద్ర దేవ్ నేతృత్వంలో ఏర్పడిన కమిటీ, 2018లో గ్రామీణాభివృద్ధి శాఖ సీనియర్ అధికారి నగేష్ సింగ్ నేతృత్వంలో ఏర్పడిన మరో కమిటీ అభిప్రాయపడ్డాయి. ద్రవ్యోల్బణ ప్రభావం నుండి ఈ సూచీ వేతనాలకు రక్షణగా నిలుస్తుందని తెలిపాయి. ఆహార, ఇతర సేవలపై పెట్టే వ్యయాలకు ఈ సూచీ సమాన ప్రాధాన్యత ఇస్తుందని చెప్పాయి. ఏ పనికైనా రోజుకు కనీసం రూ.375 వేతనం ఇవ్వాలని 2018లో కార్మిక ఆర్థికవేత్త అనూప్ శతపతి నేతృత్వంలో ఏర్పడిన కమిటీ సిఫారసు చేసింది. కాగా ఉపాధి పథకం కార్మికులకు ప్రస్తుతం నామమాత్రపు వేతనాలు ఇస్తున్నారని, అవి కూడా ఆలస్యంగా అందుతున్నాయని పార్లమెంటరీ కమిటీ ఎత్తిచూపింది. కార్మికుల వలసలకు ఇది కూడా ఓ కారణమని తెలిపింది. ప్రతి కుటుంబానికీ ఏడాదికి కనీసం 150 పనిదినాలు కల్పించాలన్న పౌర సమాజ బృందాల డిమాండుకు కమిటీ గతంలోనే మద్దతు తెలిపింది. పనిదినాలు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు అనుమతి ఇచ్చామని గ్రామీణాభివృద్ధి శాఖ పార్లమెంటరీ కమిటీకి తెలియజేసింది. అయితే అదనపు పనిదినాలకు చెల్లించే వేతనాల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలే భరించాల్సి ఉంటుంది. ఈ సమాధానంపై పార్లమెంటరీ కమిటీ అసంతృప్తి వ్యక్తం చేసింది. చట్ట సవరణ ద్వారా పనిదినాలను పెంచి, ఆ నిబంధనను దేశంలోని అన్ని రాష్ట్రాలకూ వర్తింపజేయాల్సింది గ్రామీణాభివృద్ధి శాఖేనని స్పష్టం చేసింది. ఆధార్ ఆధారిత చెల్లింపుల విధానాన్ని తప్పనిసరి చేయకూడదని, దానికి బదులు ప్రత్యామ్నాయ యంత్రాంగాన్ని రూపొందించాలని కూడా కమిటీ సూచించింది.

కేసీఆర్‌ను ఎదుర్కొనే ధైర్యం లేకనే నాపై, కేటీఆర్‌పై అక్రమ కేసులు



- పేరు మర్చిపోయినా, రైతులు భూములు ఇవ్వకపోయినా కేసులు పెడుతున్న సీఎం రేవంత్
- నిప్పులాంటి నిజామాబాద్ బిడ్డను దేనికీ భయపడను
- హామీలు అమలు చేయని పాలకులను ఎక్కడికక్కడ నిలదీయండి : నిజామాబాద్ జరిగిన బహిరంగసభలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత

నవతెలంగాణ-కంఠేశ్వర్

కేసీఆర్‌ను ఎదుర్కొనే దమ్ము, ధైర్యం లేక తనపై, కేటీఆర్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అక్రమ కేసులు బనాయిస్తున్నాయని బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. పేరు మర్చిపోయినా, రైతులు భూములు ఇవ్వకపోయినా సీఎం రేవంత్ కేసులు పెడుతున్నారని, ఆ తీరు సరికాదని విమర్శించారు. తాను నిప్పులాంటి నిజామాబాద్ బిడ్డనని, దేనికీ భయపడనని తెలిపారు. మద్యం పాలసీ కేసులో అరెస్ట్, బెయిల్‌పై విడుదల, న్యాయ పోరాటం వంటి పరిణామాల నేపథ్యంలో సుదీర్ఘ కాలం తర్వాత ఆదివారం నిజామాబాద్‌కు వచ్చిన ఎమ్మెల్సీ కవితకు బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం నగరంలోని సుభాష్‌నగర్‌లో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన బహిరంగ సభలో కవిత మాట్లాడారు.

అనేక ఇబ్బందులు, కష్టాలు ఎదురైనా పిడికిలి ఎత్తి అన్ని ఎదిరించి నిజామాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చానని తెలిపారు. తమది భయపడే రక్తం కాదని, భయపెట్టే రక్తం అని అన్నారు. తాము తప్పు చేయలేదు కాబట్టి భయపడే ప్రసక్తే లేదని చెప్పారు. ఎన్ని కేసులు పెట్టినా బీఆర్ఎస్ కార్యకర్తలు నిప్పు కణికల్లా బయటికి వస్తారని అన్నారు. 'బరువు ఎత్తుకున్నోడు ఓపికతో ఉండాలి. ప్రజల ఇబ్బందులను పరిష్కరించడానికే అధికారం ఇచ్చారన్న విషయాన్ని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు మరిచిపోయాయని అన్నారు. పోరాటం చేసి రాష్ట్రాన్ని తీసుకొచ్చిన వాళ్లం గట్టిగా నిలబడుతామని, ప్రజల పక్షాన పోరాటం చేస్తామని తెలిపారు. బీరాలు పలికిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు పెన్షన్ల మొత్తాన్ని పెంచలేదని, డిగ్రీ చదువుకున్న ఆడపిల్లలకు స్కూటీల పంపిణీ ఏమైందని, మహిళలకు నెలకు రూ. 2500, కళ్యాణ లక్ష్మీ కింద తులం బంగారం ఎందుకు ఇవ్వలేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని మహిళలు నిలదీయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో హామీలు అమలు చేసే వరకు ఎక్కడికక్కడ నిలదీయాల్సిన అవసరం ప్రజలపై ఉందన్నారు. విద్యార్థులు, రైతులు, మహిళలను, ఉద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని, పీపుల్స్ ఫ్రెండ్లీ పోలీసింగ్ పోయి, రాష్ట్రంలో కాంగ్రెస్ ఫ్రెండ్లీ పోలీసింగ్ నడుస్తోందని అన్నారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన మంచి పనులను ఈ ప్రభుత్వం కొనసాగించాలని, రాబోయేది గులాబీ జెండా శకమేనని, అందులో సందేహమే లేదని తెలిపారు.

'గురుకులాలను నడపడానికి కూడా ప్రభుత్వానికి చేతకావడం లేదని విమర్శించారు. ఇప్పటికే 57 మంది పిల్లలను పొట్టనపెట్టుకున్నారని, ఇంకెంత మందిని పొట్టనపెట్టుకుంటారని ప్రశ్నించారు. ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పటి వరకు కేసీఆర్ ఇచ్చిన నోటిఫికేషన్లకే ఉద్యోగాలు ఇస్తున్నారని తెలిపారు. ఆటో కార్మికుల ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు శిష్యుడని, అందుకే ఇలా వ్యవహరిస్తున్నారని అన్నారు. తెలంగాణ తల్లి స్థానంలో కాంగ్రెస్ మాతను ఏర్పాటు చేశారని, మన పొట్టమీదనే కాదని, మన సంస్కృతిపై కూడా కాంగ్రెస్ ప్రభుత్వం దాడి చేస్తున్నదని తెలిపారు. ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని నిర్బంధాలకు పాల్పడినా భయపడే ప్రసక్తే లేదన్నారు. మళ్లొకసారి నిజామాబాద్ పవర్‌ను సీఎం రేవంత్ రెడ్డికి రుచి చూపిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి, మాజీ స్పీకర్ సురేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బిగాల గణేష్ గుప్తా, బాజిరెడ్డి గోవర్ధన్, బోధన్ ఎమ్మెల్యే సతీమణి ఆయేషా ఫాతిమా, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తగ్గిన ఎన్ఆర్ఐ ఓటర్లు

- 2.47 శాతం మాత్రమే పోలింగ్



న్యూఢిల్లీ : 2019 సార్వత్రిక ఎన్నికలతో పోలిస్తే ఈ ఏడాది జరిగిన ఎన్నికల్లో ఓవర్‌సీస్ ఓటర్ల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఓవర్సీస్ ఓటరు అంటే...భారతీయ పౌరుడై ఉండి ఉద్యోగం లేదా విద్యాభ్యాసం కోసం విదేశాల్లో ఉంటున్న వారు. వీరు ఏ ఇతర దేశ పౌరసత్వం స్వీకరించకూడదు. అలాంటి వారు ఎన్ఆర్ఐ లేదా ఓవర్‌సీస్ ఓటరుగా తమ పేరు నమోదు చేసుకొని పాస్‌పోర్టులో ఉన్న చిరునామాలో చూపిన చోట ఓటు వేయవచ్చు. ఓటు వేసే సమయంలో ఒరిజినల్ పాస్‌పోర్టును అధికారులకు చూపాల్సి ఉంటుంది. 2019 ఎన్నికల్లో 25.64 శాతం మంది ఎన్ఆర్ఐ ఓటర్లు (పేరు నమోదు చేసుకున్న వారిలో) ఓటు హక్కు వినియోగించుకోగా తాజా ఎన్నికల్లో ఆ సంఖ్య 2.47 శాతానికి పడిపోయిందని ఎన్నికల కమిషన్ ఇటీవల విడుదల చేసిన గణాంకాల విశ్లేషణ చెబుతోంది. ఈ ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల కోసం 1,19,374 మంది ఎన్ఆర్ఐ ఓటర్లు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. అయితే వీరిలో కేవలం 2,958 మంది మాత్రమే సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో ఓటేశారు. 2019లో 99,844 మంది తమ పేర్లను నమోదు చేసుకోగా వారిలో 25,606 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. దేశంలోని 17 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎన్ఆర్ఐ ఓటర్లు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. అయితే ఏడు రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల్లో మాత్రమే వారు ఓటు హక్కు వినియోగించుకున్నారు. దేశంలోని మొత్తం ఎన్ఆర్ఐ ఓటర్లలో 90 శాతం మంది దక్షిణాది రాష్ట్రాలైన కేరళ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటకలోనే ఉండడం గమనార్హం. కానీ తమిళనాడు, కర్నాటకలో ఎన్ఆర్ఐలు ఎవరూ ఓటు వేయలేదు. కేరళ (89,839), తెలంగాణ (3,470), ఆంధ్రప్రదేశ్ (7,927), తమిళనాడు (3,432), కర్నాటక (3,148) రాష్ట్రాల్లో అత్యధికంగా ఎన్ఆర్ఐలు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. వీరిలో ఆంధ్రప్రదేశ్‌లో 195 మంది, తెలంగాణలో ముగ్గురు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అరుణాచల్‌ప్రదేశ్, మణిపూర్, మిజోరం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర, జమ్మూకాశ్మీర్ రాష్ట్రాల్లో ఒక్క ఎన్ఆర్ఐ ఓటరు కూడా లేరు. అండమాన్ నికోబార్, లక్షద్వీప్, లడఖ్‌లోనూ అదే పరిస్థితి. మేఘాలయలో ఐదుగురు ఎన్ఆర్ఐలు తమ పేర్లు నమోదు చేసుకున్నప్పటికీ ఎవరూ ఓటేయలేదు. మహారాష్ట్రలో 17, పంజాబ్‌లో 13 ఎన్ఆర్ఐ ఓట్లు పడ్డాయి. ఉత్తరప్రదేశ్, హర్యానా, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఎన్ఆర్ఐలు తమ పేర్లు నమోదు చేసుకున్నప్పటికీ ఎవరూ ఓటేయలేదు.



దళిత హెడ్ మాస్టర్ రాములుపై మతోన్మాదులు దాడి

- నేడు జిల్లా, మండల కేంద్రాల్లో నిరసనలు
- సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దళిత హెడ్ మాస్టర్‌పై మతోన్మాదులు దాడి చేయటం అమానుషమనీ, నిందితులను తక్షణమే ఆరెస్టు చేసి, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర వర్కింగ్ కమిటీ సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ తీర్మానాన్ని ప్రవేశ పెట్టగా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్వీ రమ బలపర్చగా కమిటీ ఏకగ్రీవంగా ఆమోదించింది. నేడు రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా, మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కారాములు, పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం మండలం, తుక్కుగూడ గ్రామ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న రాములు (దళిత తరగతికి చెందిన)పై మతోన్మాద మూకలు భక్తి ముసుగులో దాడి చేశారని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తూ భావిభారత పౌరులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయుల విధులను ఆటంకపర్చటం నేరమని పేర్కొన్నారు.

విధి నిర్వహణలో భాగంగా పాఠశాలలో ఒక విద్యార్థిని లెక్కలు అడిగే సందర్భంగా నిలబెట్టారనీ, దీన్ని సోషల్ మీడియాలో వక్రీకరిస్తూ అయ్యప్ప మాల వేసుకున్న విద్యార్థినిని నిలబెట్టారనే నెపంతో కొంతమంది మతోన్మాద మూకలు హెచ్‌ఎం రాములుపై దాడి చేశారని తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు క్షమాపణ చెప్పినప్పటికీ వినకుండా, అయ్యప్ప మాల ధరించిన విద్యార్థితో పాటు ఇతర స్వాములు కాళ్ళను రాములుతో మొక్కించడం హేయమైన చర్య అనీ, పాఠశాలల్లో మతోన్మాదులు ఈ విధమైన అమానుష చర్యలకు పాల్పడటం మానుకోవాలని హెచ్చరించారు. గతంలో కూడా నిజామాబాద్ జిల్లా వర్నిలో ఒక పాఠశాలలో విద్యార్థులను ఒక టీచర్ శాస్త్రీయ భావాలను, దృక్పథాన్ని బోధించడాన్ని సాకుగా తీసుకొని మతోన్మాదులు అతనిపై దాడి చేసి, ఊరేగించి దేవుని గుడికి తీసుకెళ్ళి బలవంతంగా మొక్కించి, క్షమాపణ చెప్పించిన విషయాన్ని గుర్తు చేశారు. కేంద్రలోని బీజేపీ ప్రభుత్వం మతోన్మాదులకు ఊతం ఇచ్చే విధంగా వ్యవహరించడం, పార్లమెంట్‌లోనే కేంద్రమంత్రి అమిత్ షా అంబేద్కర్, రాజ్యాంగంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం లాంటి చర్యలు మతోన్మాదుల దుశ్చర్యలకు మరింత బలాన్నిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలు భవిష్యత్‌లో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాములుపై దాడికి పీడీఎస్‌ఎఫ్ ఖండన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దళిత ఉపాధ్యాయులు కంబలి రాములుపై మతోన్మాదుల దాడిని ప్రొగ్రెస్సివ్ డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ (పిడిఎస్‌ఎఫ్)తెలంగాణ రాష్ట్ర కార్యవర్గం ఖండించింది. దాడి చేసిన వారిపై యస్సీ, యస్టీ ఎట్రాసిటీ చట్టం ప్రకారం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం పీడీఎస్‌ఎఫ్ రాష్ట్ర నాయకులు మరికంటి హరీష్, కోట ఆనంద్ ఒక ప్రకటన విడుదల చేశారు. డిసెంబర్ 23న రంగారెడ్డి జిల్లాలో దళిత ఉపాధ్యాయులు కంబలి రాములుపై మతోన్మాదులు, కులోన్మాదుల కక్షపూరితంగా మూక దాడికి పాల్పడి, కాళ్ళ మొక్కించి అవమానించారని తెలిపారు. ఈ ఘటన సమాజంలో బహిరంగ కుల వివక్ష అమలుకు నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ మూక దాడి ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపించి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

విద్యాసంస్థలు కుల, మతాలకు అతీతంగా ప్రజాస్వామిక విలువలు బోధించే కేంద్రాలు అనీ, అలాంటి చోట కొంత మంది అల్లరి మూకలు సాయిబాబా మాలధారకులమని, ధర్మ రక్షకులమని చెప్పుకుంటూ గుండాలుగా ప్రవర్తిస్తూ విద్యార్థులను, ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురి చేయడం దాడులు చేస్తుంటే ప్రజలకు రక్షణ ఉందా? అని అనుమానం వ్యక్తం చేశారు. పాలకులు మారినా...సబ్బండ వర్గాలపై దాడులు ఆగలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాజంలో కులోన్మాదం, మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్న పాలక పార్టీలను, సంస్థలను ప్రజలు బహిష్కరించాలని పిలుపునిచ్చారు. విద్యాసంస్థల్లో కులవివక్ష రూపుమాపేందుకు రోహిత్ చట్టాన్ని రూపొందించాలని కోరారు. రాష్ట్రంలో బహిరంగంగా అమలవుతున్న మతోన్మాదం, కుల వివక్ష పట్ల కాంగ్రెస్ పాలకుల వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

సంక్రాంతి తర్వాత రైతు భరోసా

(మొదటిపేజీ తరువాయి)

సమాచారం తదితరాంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన మాట మేరకు రైతులకు రైతు భరోసా ఇచ్చి తీరుతామని స్పష్టం చేశారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఇచ్చిన మాట మేరకు ముందుకు వెళ్తామని చెప్పారు. రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ. 72,659 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏంటో ఈ అంకెలు తెలియజేస్తాయని చేశామని చెప్పారు.

రెండు లక్షల వరకు రైతు రుణమాఫీ కింద రెండు నెలల వ్యవధిలోనే రూ. 21 వేల కోట్ల నగదును రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చెప్పారు. రాష్ట్రంలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రైతుల సంక్షేమానికి కృషి చేసేందుకు వ్యవసాయ కమిషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో నిర్మించిన రైతు వేదికలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని నిర్ణయించామని చెప్పారు. రైతు వేదికలను ఆధునీకరించేందుకు ప్రభుత్వం రైతునేస్తం కార్యక్రమాన్ని చేపట్టిందని వివరించారు. రైతు వేదికలకు వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానం చేసి రైతు సమస్యలను పరిష్కరించేందుకు రైతు నేస్తం కార్యక్రమాన్ని చేపట్టినట్టు గుర్తు చేశారు. 110 రైతు వేదికల్లో నాలుగు కోట్లపైగా నిధులు వెచ్చించి వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

తెలంగాణ రైతులు దేశానికి ఆదర్శంగా ఉండేలా ప్రజా ప్రభుత్వం తొలి ఏడాదిలోనే యాసంగి పంటకు పెట్టుబడి సాయంగా రాష్ట్రంలోని రైతులందరికీ రైతు భరోసా నిధులు విడుదల చేసిన విషయాన్ని వివరించారు. 1,57,51000 ఎకరాలకు రూ. 7,625 కోట్ల నిధులు రైతుల ఖాతాలో జమ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఏడాది పాటు శ్రమించినా అనుకోని ప్రకృతి విపత్తులతో పండిన పంట చేతికి వస్తుందో, రాదో అని భయాలు నిత్యం రైతులను వెంటాడుతున్నాయన్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో రైతులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. పంటల బీమా పథకం కింద ప్రీమియం మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే రైతుల పక్షాన చెల్లిస్తుందని తెలిపారు. పంటలకే కాదు రైతు కుటుంబానికి భరోసాగా నిలిచేందుకు రైతు బీమా పథకం కింద రైతుల పక్షాన ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తుందన్నారు. 2024-25లో రాష్ట్రంలో ఒక లక్ష ఎకరాల ఆయిల్ ఫామ్ సాగును చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. 2023-24 ఏడాదికిగానూ ఆయిల్ సాగు పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ. 80.10 కోట్లు విడుదల చేయగా రాష్ట్ర వాటా కలుపుకొని మొత్తం రూ. 133.5 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసే సన్నధాన్యానికి ప్రతి క్వింటాకు రూ. 500ల బోనస్‌గా చెల్లిస్తుందని తెలిపారు. గత వానా కాలంలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జిల్లాల్లో ధాన్యం కొనుగోలు సాఫీగా జరిగేందుకు జిల్లాల వారీగా సీనియర్ ఐఏఎస్ అధికారులను నియమించి చర్యలు చేపట్టినట్టు తెలిపారు. సమావేశంలో వ్యవసాయ శాఖ ప్రధాన కార్యదర్శి రఘునందన్‌రావు, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ చీటర్స్



గణనీయంగా పెరుగుతున్న సైబర్ నేరాలు

- సాంకేతిక పరిజ్ఞానంతో మోసాలు
- రూ.లక్షలు కోల్పోతున్న బాధితులు
- బయటకు చెప్పుకోలేక ఆవేదన
- డిజిటల్ అరెస్టు బారిన రిటైర్డ్ ఉద్యోగులు
- ఫేస్‌బుక్, ఇన్‌స్టాల ద్వారా సమాచార సేకరణ
- వాటి ఆధారంగా ఫోన్‌కాల్స్‌తో స్కామర్ల బురిడీ

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

కొద్దిరోజుల క్రితం ఖమ్మం జిల్లాకు చెందిన ఓ మండల విద్యాశాఖాధికారి సోదరునికి ఫోన్‌కాల్ వచ్చింది. 'నీ పేరిట ఓ ప్యాక్ వచ్చింది.. దానిలో మాదక ద్రవ్యాలున్నాయని' స్కామర్ చెప్పాడు. వ్యక్తిగత వివరాలు, బ్యాంకు వివరాలు సైతం చెప్పడంతో ఆ ఎంఈవో సోదరుడు నిజమేనని నమ్మాడు. విషయం పోలీసుల దృష్టికి పోతే ఎదురయ్యే పర్యవసానాల గురించి వివరించి భయాందోళనకు గురి చేశాడు. రూ.2 లక్షలు డిమాండ్ చేశాడు. ఆందోళనకు గురైన సదరు వ్యక్తి తన బ్యాంకు వివరాలు చెప్పడంతో హ్యాకర్ ఆ డబ్బులను డ్రా చేసుకున్నాడు. ఇది జరిగి దాదాపు రెండు నెలలవుతున్నా పోలీసు కంప్లయింట్ ఇస్తే ఏమవుతుందోననే భయంతో కుటుంబసభ్యులు కుమిలిపోతున్నారు.

ఈనెల 23వ తేదీన ఖమ్మం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వరుణ్ అనే ఓ యువకునికి ఇన్‌స్టాగ్రామ్‌లో మెసేజ్ వచ్చింది. తన బంధువైన ఎన్‌ఆర్‌ఐ బంధువు ప్రొఫైల్ పిక్, పేరుతో ఉండటంతో అతనితో చాట్ చేయటం మొదలుపెట్టాడు. తొలుత రూ.5వేలు అడిగాడు. ఆ మొత్తం అతను పంపిన నంబర్‌కు ఫోన్‌పే చేయడంతో.. మరో రూ.5వేలు అడిగాడు. ఆ డబ్బు కూడా పంపడంతో మూడోసారి రూ.8వేలు అడిగాడు. దాంతో వరుణ్‌కు డౌట్ వచ్చి వెంటనే ఖమ్మం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



డిజిటల్ అరెస్టు..

ఎంఈవో సోదరునికి పోలీసు అధికారి పేరుతో వాట్సప్ కాల్ చేసినట్టే కొందరికి సీబీఐ, ఆదాయపన్ను, కస్టమ్స్ ఏజెంట్లు, బ్యాంకు అధికారుల తరహాలో వాట్సాప్, ఇన్‌స్టా, ఫేస్‌బుక్ కాల్స్ వస్తున్నాయి. మనీలాండరింగ్, పన్ను ఎగవేత, మాదక ద్రవ్యాలు, మానవ అక్రమ రవాణా వంటి తీవ్రమైన నేరారోపణలు మోపుతున్నారు. మీ ఆధార్‌కార్డు, పాన్‌కార్డు ద్వారా అక్రమ లావాదేవీలు జరిగాయని నమ్మబలుకుతున్నారు. మీరు ఈ కేసులో డిజిటల్ అరెస్టు అయ్యారంటూ పెద్దమొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. సమాజంలో తమ ప్రతిష్ఠ దెబ్బతింటుందనే భయం, కుటుంబ సభ్యులపై ప్రభావం పడుతుందనే ఆందోళనతో చాలా మంది విషయాన్ని బయటకు చెప్పకుండా స్కామర్లు అడిగిన వివరాలు ఇస్తున్నారు. అవసరమైతే మార్ఫింగ్ వీడియోలు, ఫోటోలను కూడా పంపుతూ భయాందోళనకు గురిచేస్తున్నారని బాధితులు చెబుతున్నారు.

24 గంటల్లో సమాచారమిస్తే ఫలితం

నేరం జరిగిన 24 గంటల్లో సమాచారమిస్తే ఫలితం ఉంటుంది. 14సీ ఆధ్వర్యంలో నడిచే హెల్ప్‌లైన్, పోర్టల్ రాష్ట్రాల విభాగాలతో అనుసంధానమై ఉంటుంది. దీని ద్వారా 300 ఆర్థిక సంస్థలు, బ్యాంకులు, వాలెట్లకు కూడా సమాచారం అందుతుంది. బ్యాంకులు, పేమెంట్ వాలెట్లకు 14సీ నుంచి హెచ్చరికలు వెళ్లడంతో ఆయా ఖాతాలను స్తంభింపజేస్తారు.

ఏడాదిలో రూ.34 కోట్లకు పైగా సైబర్ నేరగాళ్ల స్వాహా..

ఖమ్మం జిల్లాలోనే ఈ ఏడాదిలో రూ.34 కోట్లకు పైగా సైబర్ నేరగాళ్ల స్వాహా చేశారు. గతేడాది రూ.9 కోట్లు దోపిడీ చేయగా ఈ ఏడాది నాలుగింతలు అధికంగా కాజేశారు. పోలీసులు రికవరీ కూడా భారీగానే పెరుగుతోంది. గతేడాది రూ.16 లక్షలు రికవరీ చేయగా ఈ ఏడాది రూ.52.13 లక్షలు రికవరీ చేశారు. మరో రూ.2.42 కోట్లను సైబర్ నేరగాళ్లకు చిక్కకుండా హోల్డ్‌లో పెట్టించారు. గతేడాది జిల్లాలో 1,098 ఆన్‌లైన్ మోసాలు జరగ్గా...ఈ ఏడాది 1,742 కేసులు నమోదయ్యాయి. క్రిప్టో కరెన్సీ కేసులు గతేడాది రెండు, ఈ ఏడాది నాలుగు నమోదయ్యాయి. అయితే ఈ ఏడాది జనవరి 1 నుంచి నవంబర్ 15వ తేదీ వరకు దేశవ్యాప్తంగా 92,323 డిజిటల్ అరెస్టు కేసులు నమోదైనా... జిల్లాలో ఐదు కేసులకు పైగా ఇలాంటివి నమోదయ్యాయి. తాజాగా ఓ ప్రయివేటు కాలేజీ లెక్చరర్ లైవ్ కాల్‌ను సైబర్ క్రైం ఏసీపీ దగ్గరకు తీసుకురావడం గమనార్హం. డిజిటల్ అరెస్టు ద్వారా జిల్లాలో ఓ ఇద్దరు రూ.కోటికి పైగా పోగొట్టుకున్నారు. ఒకరు రూ.1.15 కోట్లు, మరొకరు రూ.1.05 కోట్లు కోల్పోయారు. ఇవేకాక ఇంకా అనేక సైబర్ నేరాలు సైతం పోలీసు దృష్టికి రావడం లేదు. చాలా మంది పోలీసులకు ఫిర్యాదు చేయకుండానే మిన్నకుంటున్నారు. సాంకేతిక పరిజ్ఞానం అంతగా లేని వృద్ధులు, యువకులు, మధ్యతరగతి ప్రజలే లక్ష్యంగా ఈ సైబర్ క్రైంలు ఎక్కువగా జరుగుతున్నాయి.

మోసాలు ఇలా..

సైబర్ నేరగాళ్లు వివిధ సాంకేతిక మాధ్యమాల ద్వారా వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తున్నారు. ప్రజలను మోసగించేందుకు భయం, ఆందోళన, ఒత్తిడికి గురిచేస్తున్నారు. వారు ఓ పోలీసు లేదా ఇతర అధికారో, బంధువో, మిత్రుడో అన్నట్టుగా బెదిరించటమో.. రిక్వెస్ట్ చేయడమో చేసి మోసగిస్తున్నారు. బ్యాంకు అకౌంట్ వివరాలు, ఇతర వివరాలు సేకరిస్తున్నారు. ఎక్కువగా బ్యాంకు అకౌంట్, ఆధార్‌కార్డు నంబర్లు, ఓటీపీ వంటివి అడుగుతున్నారు. ఒకవేళ ఇవ్వడానికి నిరాకరిస్తే అరెస్టు చేస్తామని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బెదిరిస్తున్నారు. ఈ మెయిల్ లేదా మేసేజింగ్ యాప్‌ల ద్వారా నకిలీ అరెస్టు వారెంట్లు, లీగల్ నోటీసులు లేదా అధికారికంగా కనిపించే నకిలీ పత్రాలను కూడా పంపుతున్నారు. భయభ్రాంతులకు గురిచేస్తున్నారు.

మానవ బలహీనతలే కారణం

మానవ బలహీనతలైన ఆశ, భయమే సైబర్ క్రైం బారిన పడటానికి ప్రధాన కారణం. అవగాహన సదస్సులు ఎన్ని నిర్వహిస్తున్నా సైబర్ క్రైం బాధితులు పెరుగుతూనే ఉన్నారు. ఆన్‌లైన్ లోన్‌ల పేరుతో లింక్‌లు రాగానే ఆశతో వాటిని క్లిక్ చేయడంతో మోసపోతున్నారు. అలాగే భయాందోళనలకు గురిచేసి కొందర్ని స్కామర్లు లోబర్చుకుంటున్నారు. ఎవరైనా ఆన్‌లైన్ మోసానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయండి.

సీహెచ్ ఫణీంద్ర,
ఏసీపీ, సైబర్ క్రైం, ఖమ్మం

జనవరి 1న కాదు..3 న నుమాయిష్

- మాజీ ప్రధాని మన్మోహన్ మృతికి సంతాప దినాలతో రెండు రోజులు ఆలస్యం
- 84వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనకు సర్వసిద్ధం : ఎగ్జిబిషన్ సొసైటీ కార్యదర్శి బి.సురేందర్ రెడ్డి



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

84వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనను జనవరి 3న ప్రారంభించనున్నట్టు ఎగ్జిబిషన్ సొసైటీ కార్యదర్శి బి సురేందర్ రెడ్డి, కోశాధికారి డాక్టర్ బి ప్రభాశంకర్ అన్నారు. ఆదివారం హైదరాబాద్ ఎగ్జిబిషన్ మైదానంలోని గాంధీ సెంటెనరి హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సొసైటీ ఉపాధ్యక్షులు కె.నిరంజన్, సంయుక్త కార్యదర్శి డి.మోహన్, పబ్లిసిటీ కన్వీనర్ డి.సురేష్ కుమార్‌లతో కలిసి వారు మాట్లాడారు. జనవరి 1న ప్రారంభం కావాల్సిన నుమాయిష్‌ను జనవరి 3వ తేదీకి మార్చినట్టు తెలిపారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ సంతాప దినాల నేపథ్యంలో నుమాయిష్ ప్రారంభోత్సవాన్ని రెండు రోజుల పాటు వాయిదా వేసినట్టు చెప్పారు. జనవరి 3న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నుమాయిష్‌ను ప్రారంభించనున్నట్టు తెలిపారు. అతిథులుగా ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షులు, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొంటారని అన్నారు. నాంపల్లిలోని ఎగ్జిబిషన్ మైదానంలోని 26 ఎకరాల సువిశాలమైన స్థలంలో నుమాయిష్ నిర్వహిస్తూ వస్తున్నామని తెలిపారు. ఎగ్జిబిషన్ సొసైటీ ద్వారా నిర్వహిస్తున్న ఈ ఎగ్జిబిషన్‌లో దేశ, విదేశాల్లో ప్రాముఖ్యత సంతరించుకుందని, ప్రతి సంవత్సరం జనవరి ఒకటవ తేదీ నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు 46 రోజుల పాటు నిర్వహించే ఈ ఎగ్జిబిషన్ ప్రజాదరణ చూరగొనడంతో పాటు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ఉత్పత్తి చేసిన ఉత్పత్తులకు విస్తృత ప్రచారం లభించడంతో వాటి విక్రయాలకు కేంద్రంగా నిలిచిందన్నారు. గతేడాది 24 లక్షల మంది సందర్శించారని, ఈ ఏడాది సుమారు 25 లక్షల మంది సందర్శిస్తారని అంచనా వేస్తున్నట్టు తెలిపారు. సుమారు 2000 స్టాళ్ల ఏర్పాటుతో కొనసాగే ఈ ఎగ్జిబిషన్ నగర ప్రజలనే కాకుండా పొరుగు జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి కూడా వస్తారని అన్నారు. పలు పారిశ్రామిక ఉత్పత్తులతో పాటు ప్రభుత్వ, ప్రయివేటు రంగ సంస్థల స్టాళ్లు, ఫుడ్ కోర్టులు, సందర్శకులను అలరించేందుకు గాను అమ్యూజ్మెంట్ పార్క్ ఇలా అనేక స్టాళ్లు ఎగ్జిబిషన్‌లో అందుబాటులో ఉంటాయని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు, ఇతర శాఖలు కూడా స్టాళ్లను ఏర్పాటు చేయడం జరుగుతుం దన్నారు. ఎగ్జిబిషన్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రెవెన్యూ లభిస్తోందని, గతేడాది జీఎస్టీ ద్వారా రూ.9.66 కోట్ల రెవెన్యూ చెల్లించినట్టు తెలిపారు. 48 రోజుల పాటు నిర్వహించే ఎగ్జిబిషన్‌తో మూడు నెలల పాటు పది వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తోందని అన్నారు. నుమాయిష్ ద్వారా వచ్చే ఆదాయంతో 20 విద్యా సంస్థల ద్వారా తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యాప్తికి చర్యలు తీసుకుంటున్నామని, ఆయా కళాశాలల ద్వారా ప్రతి సంవత్సరం 30 వేల మంది విద్యను అభ్యసిస్తుండగా, 2500 మంది టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పని చేస్తున్నారని వివరించారు. ఈ సమావేశంలో అడ్వైజర్ డాక్టర్ ఎం. సురేష్ రాజ్, వినయ్ కుమార్ ముదిరాజ్, అనిల్ స్వరూప్ మిశ్రా, ఆదిత్య మార్గం, అశ్విన్ మార్గం, రవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ కొరియాలో ఘోర విమాన ప్రమాదం



(మొదటిపేజీ తరువాయి)

నేరుగా గోడను ఢీకొట్టి మంటల్లో చిక్కుకున్నది. ఈ ప్రమాదంలో విమానం పూర్తిగా కాలిపోయింది. ఈ ఘటనలో మొత్తం 179 మంది మరణించినట్టు అధికారులు, స్థానిక వార్తా సంస్థలు తెలియజేశాయి. ఈ ప్రమాదం నుంచి కేవలం ఇద్దరు సిబ్బంది మాత్రమే ప్రాణాలతో బయటపడినట్టు సమాచారం.

బ్యాంకాక్ నుంచి జెజు ఎయిర్‌ఫ్లైట్‌కు చెందిన 7సీ2216 నంబర్ బోయింగ్ 737-800 శ్రేణి విమానం 175 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బందితో వస్తున్న క్రమంలో మువాన్ కౌంటీలోని విమానాశ్రయంలో ఈ ప్రమాదం సంభవించింది. ల్యాండింగ్ గేర్ పని చేయకపోవటం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని అధికారులు అనుమానిస్తున్నారు. కాగా, ఈ విమాన ప్రమాద లైవ్ దృశ్యాలు సోషల్ మీడియాలో షాక్‌కు గురి చేస్తున్నాయి. ఫ్లైట్ ఒక్కసారిగా పేలిపోయి, భారీగా మంటలు చెలరేగిన దృశ్యాలు కనిపించాయి. ఈ ఘటనలో విమానం మొత్తం పూర్తిగా కాలిపోయింది.

సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకొని మంటలు ఆర్పేందుకు ప్రయత్నించాయి. ఇందుకు మొత్తం 32 అగ్నిమాపక వాహనాలు, పలు హెలికాప్టర్లు రంగంలోకి దిగాయి. దక్షిణ కొరియా తాత్కాలిక అధ్యక్షుడు చోయ్ సాంగ్-మోక్ ఈ ప్రమాదంపై స్పందించారు. అంతర్గత, భద్రతా మంత్రిత్వ శాఖకు కీలక ఆదేశాలు జారీ చేశారు. సహాయక చర్యలు చేపట్టాలని చెప్పారు. విమానంలో ప్రయాణిస్తున్నవారిలో ఎక్కువ మంది కొరియన్లు, ఇద్దరు థాయ్ దేశస్థులు ఉన్నారని తెలిసింది.

జనవరి 4 వరకు జాతీయ సంతాప దినాలు

విమాన ప్రమాద ఘటన నేపథ్యంలో చోయ్ సాంగ్-మోక్ వచ్చే నెల 4 వరకు జాతీయ సంతాప దినాలను ప్రకటించారు. ఈ ప్రమాదంపై ఎక్స్‌లో ఆయన స్పందించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం సానుభూతి తెలియజేస్తున్నదని పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని ప్రత్యేక విపత్తు జోన్‌గా ప్రకటించారు. ఇటు థాయ్‌లాండ్ ప్రధాని పేటోంగ్టార్న్ షినవత్రా కూడా మృతుల కుటుంబాలకు, గాయపడినవారికి సానుభూతిని తెలియజేశారు.

క్షమాపణలు చెప్పిన జెజు సీఈఓ కిమ్ ఈ-బే

జెజు ఎయిర్‌లైన్స్‌ను దక్షిణ కొరియాలో భారీ బడ్జెట్‌తో 2005లో స్థాపించారు. అయితే, ప్రస్తుత ఘటనతో ఈ ఎయిర్‌లైన్స్ తొలిసారి ఇది అతిపెద్ద ప్రమాదాన్ని చూసింది. ఈ ప్రమాదంపై జెజు ఎయిర్ సీఈఓ కిమ్ ఈ-బే స్పందించారు. ప్రమాదం పట్ల క్షమాపణలు చెప్పారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటామనీ, అదే తమ ప్రాధాన్యత అని చెప్పారు. దర్యాప్తునకు ఎయిర్‌లైన్స్ సహకరిస్తుందని వివరించారు.

గతంలో ప్రమాదాలు

1997లో గువామ్‌లో కొరియన్ ఎయిర్‌లైన్స్ ప్రమాదంలో 200 మందికి పైగా మృతి చెందారు. ఆ తర్వాత అతిపెద్ద విమాన ప్రమాదం ఇదే కావటం గమనార్హం. ఇక ఎయిర్ చైనా నడిపే బోయింగ్ 767-200 విమానం 2002లో దక్షిణ కొరియాలో ప్రమాదానికి గురై 129 మంది మరణానికి కారణమైంది. ఈ ఘటనలో 37 మంది గాయపడ్డారు.

137 మంది నకిలీ వైద్యులపై కేసులు నమోదు : డీసీఏ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా 137 మంది నకిలీ వైద్యులపై కేసులు నమోదు చేసినట్టు డ్రగ్ కంట్రోల్ అథారిటీ (డీసీఏ) తెలిపింది. ఈ మేరకు ఆదివారం డీసీఏ డైరెక్టర్ జనరల్ వీ.బీ.కమలాసన్ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. చట్టవిరుద్ధంగా ఔషధాలను నిల్వ ఉంచడం, అమ్ముతున్నందుకు వీరిపై ఈ ఏడాదిలో కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. తాజాగా నారాయణపేట్ జిల్లా నారాయణ్‌పేట్ మండలం, జాజపూర్ గ్రామంలో నకిలీ వైద్యులు మజిగి మనోహర్‌లాల్ అక్రమంగా నిల్వ ఉంచి అమ్ముతున్న ఔషధాలను సీజ్ చేశారు. డీసీఏ దాడుల సందర్భంగా 50 రకాల ఔషధాలు (రూ.47 వేల విలువైనవి) పట్టుబడ్డాయి. ఎలాంటి డ్రగ్ లైసెన్స్ లేకుండా యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్ తదితర మందులను కలిగి ఉన్నట్టు గుర్తించారు. మహబూబాబాద్, రెడ్డి బజార్‌లోని సిద్ధార్థ ఫార్మసీపై డీసీఏ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో థియోహిల్ జెల్ ఔషధాన్ని అధిక ధరకు అమ్ముతున్నట్టు గుర్తించారు. దాని లేబుల్ పై నిర్దేశించిన ధర కంటే అధిక ధరను ముద్రించి విక్రయాలు జరుపుతున్నట్టు అధికారులు తెలిపారు. అధిక ధరలకు అమ్మిన బిల్లులను వారు స్వాధీనం చేసుకున్నారు. జ్వరాలు, అస్తమా తదితర వ్యాధుల చికిత్సకంటూ తప్పుడు ప్రకటనలు చేస్తూ అమ్ముతున్న పలు ఔషధాలను అధికారులు వివిధ జిల్లాల్లో గుర్తించారు. జ్వరాల చికిత్సకంటూ నిజామాబాద్ బోధన్‌లో ప్రిమోల్ (అల్లోపతిక్ మెడిసిన్), ఐ డిజార్డర్స్ కోసమంటూ రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం, జిల్లెలగూడలో ద్రిష్టి ఐ డ్రాప్స్, యుటేరస్ డిజార్డర్స్‌కు అంటూ అమ్మకాలు చేస్తున్న ఓవరిల్ ఫోర్టెను వికారాబాద్ జిల్లా పరిగిలో పట్టుకున్నారు.



ఆ హుందాతనం నేడేది?

(మొదటిపేజీ తరువాయి)

వర్గాలే ప్రతిపక్ష పాత్ర పోషించాయి. తనను నిరంతరం విమర్శించే రామ్ మనోహర్ లోహియాతో పాటు ఆచార్య కృపలానీ, పీలూ మోడీ వంటి నేతల విషయంలో నెహ్రూ హుందాగా వ్యవహరించే వారు. ప్రతిపక్ష నాయకులను నెహ్రూ ఎలా చూసే వారో బీజేపీ సీనియర్ నేత అటల్ బిహారీ వాజ్‌పేయి కంటే వేరెవరికీ బాగా తెలిసి ఉండదు. విదేశీ ప్రతినిధి బృందాలు భారత్‌లో పర్యటించినప్పుడు వాజ్‌పేయిని నెహ్రూ వారికి పరిచయం చేసే వారు. దేశానికి కాబోయే ప్రధానమంత్రి అంటూ చెప్పే వారు. 1961లో జాతీయ సమగ్రతా మండలి సభ్యుడిగా వాజ్‌పేయిని నియమించారు. ఒకసారి నెహ్రూపై సహచర సభ్యులు ఆరోపణలు సంధిస్తూ దారుణంగా దాడి చేస్తే వాజ్‌పేయి వారిని మందలించారు. ప్రధానమంత్రిపై దాడి చేయాల్సిన అవసరం ఉన్నదా అని నిలదీశారు. నెహ్రూ చనిపోయినప్పుడు వాజ్‌పేయి భావోద్వేగానికి గురై 'సర్...ఒక కల చెదిరిపోయింది. ఒక పాట ఆగిపోయింది. ఒక జ్వాల అనంతంలో లీనమైంది' అంటూ నివాళి అర్పించారు. నాడు అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య సంబంధాలు అలా ఉండేవి.

1990 తర్వాత మారిన సీను

1990వ దశకం నుంచి దేశంలో ప్రతిపక్షం బలపడింది. అదే కాలంలో వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రాంతీయ పార్టీలు లోక్‌సభలో సుమారు మూడో వంతు స్థానాలను పొందాయి. 1989 నుంచి దేశంలో సంకీర్ణ ప్రభుత్వాల శకం ప్రారంభమైంది. అధికార, ప్రతిపక్ష పార్టీల్లో పోటీతత్వం పెరిగింది.

సభాపతులు సైతం...

ప్రతిపక్షాలను పట్టించుకోవాల్సిన అవసరమే లేదని లోక్‌సభ, రాజ్యసభ అధ్యక్షులకు అధికార పార్టీ నుండి స్పష్టమైన ఆదేశాలు వెళ్లాయి. అంతేకాదు...ప్రభుత్వాన్ని, ప్రధానిని విమర్శిస్తే ఆ ప్రకటనలను రికార్డుల నుండి తొలగించాలని కూడా హుకుం జారీ చేశారు. ఉప రాష్ట్రపతిగా వ్యవహరిస్తున్న రాజ్యసభ ఛైర్మన్ అయితే నిష్పాక్షికంగా వ్యవహరించాలన్న విషయాన్నే మరచిపోయారు. ఆయన తరచూ చెప్పే మాటేమిటంటే 'మీరు మాట్లాడేది ఏదీ రికార్డుల్లోకి ఎక్కదు'. రెండు సభల అధిపతులు రాజ్యాంగబద్ధమైన విధులు నిర్వర్తించాల్సింది పోయి పార్టీ నాయకులుగా వ్యవహరిస్తున్నారు.

భారత పార్లమెంట్ చరిత్రలో అత్యంత దారుణమైన పరిణామం 2023 డిసెంబరులో చోటుచేసుకుంది. లోక్‌సభ నుండి 95 మందిని, రాజ్యసభ నుండి 46 మందిని...మొత్తం 141 మంది చట్టసభల సభ్యులను సస్పెండ్ చేశారు. వారిలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఒకరు. ఇప్పటికైనా ప్రధాని మోడీ ప్రతిపక్షాల విమర్శలను సానుకూలంగా అర్థం చేసుకోవాలని, ఇతరుల నుండి కాకపోయినా కనీసం తన పార్టీ నేత వాజ్‌పేయి నుండి అయినా స్ఫూర్తి పొందాలని రాజకీయ శాస్త్రవేత్త అజయ్ కె.మెహ్రా అభిప్రాయపడ్డారు.

ఐడీఏ క్రికెట్ టోర్నీ విన్నర్ కామారెడ్డి



నవతెలంగాణ-రామాయంపేట

ఇండియన్ డెంటల్ అసోసియేషన్(ఐడీఏ) తెలంగాణ క్రికెటర్ టోర్నీ విజేతగా కామారెడ్డి క్రికెట్ టీమ్ నిలిచింది. కామారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగిన ఈ టోర్నీలో కామారెడ్డి, ఆదిలాబాద్, నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల, నిర్మల్, సిద్దిపేట్, సంగారెడ్డి జిల్లాల డెంటల్ డాక్టర్స్ క్రికెట్ టీమ్స్ పాల్గొన్నాయి. శనివారం పోటాపోటీగా జరిగిన మ్యాచ్‌ల్లో కామారెడ్డి, ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్ జట్లు సెమిస్‌కు చేరుకున్నాయి. ఆదివారం జరిగిన సెమీస్ మ్యాచ్‌లో విజయం సాధించిన కామారెడ్డి, మంచిర్యాల జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. చివరి బంతి వరకు రసవత్తరంగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కామారెడ్డి టీమ్ విజయం సాధించి కప్పును కైవసం చేసుకుంది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేసిన కామారెడ్డి జట్టు 12 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 95 పరుగు సాధించింది. 96 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన మంచిర్యాల టీమ్ 12 ఓవర్లు పూర్తయ్యేసరికి 92 పరుగులు చేసి ఓటమిపాలైంది. మ్యాచ్ చివరి బంతి వరకు నువ్వా నేనా అన్నట్టుగా సాగి ప్రేక్షకులను ఆకట్టుకుంది. కామారెడ్డి టీమ్ కెప్టెన్ డాక్టర్ సతీష్ గౌడ్, టీమ్ సభ్యులు కప్పును అందుకున్నారు. 8 జిల్లాల నుంచి వచ్చిన ఆటగాళ్లకు స్థానిక డెంటల్ అసోసియేషన్ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.



బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ సింగల్ విండో చైర్మెన్ కోలన్ శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు, పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్‌ను వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. తర్వాత శాలువాతో సన్మానించి ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ నాయకులు, కార్పొరేటర్లు ఎడ్ల మల్లేష్ ముదిరాజ్, కొండ్రు గౌరి శంకర్, జిల్లెల ప్రభాకర్ రెడ్డి, కొత్త రాజేష్ రెడ్డి, రామిడి మహేందర్ రెడ్డి తదితరులు..

నవతెలంగాణ-మీర్ పేట్ / బడంగ్‌పేట్

ఇరుముడి పూజలో ఎమ్మెల్యే సబితమ్మ



నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజక వర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ గుర్రంగూడ ఆంజనేయ స్వామి సన్నిధిలో ఏర్పాటు చేసిన అయ్యప్ప స్వామి ఇరుముడి పూజా కార్యక్రమానికి ఆదివారం మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి, కో ఆప్షన్ సభ్యులు ఈఎల్‌వి సమైక్య జ్యోతి అశోక్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ
కార్మికుల సేవలు వెలకట్టలేనివి



టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్త

నవతెలంగాణ- నాగోల్

జీహెచ్ఎంసీ కార్మికుల సేవలు వెలకట్టలేనివని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. తెలంగాణ ఆర్య వైశ్య సంఘం (టీవీఎస్) ఆధ్వర్యంలో రామకృష్ణాపురం ఆంజనేయ స్వామి దేవాలయంలో ఏఆర్ గుప్త సారథ్యంలో జీహెచ్ఎంసీ కార్మికులకు ఆదివారం బ్లాంకెట్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలికాలంలో పేదలకు బ్లాంకెట్లను పంపిణీ చేయడం అభినందనీయమని నిర్వాహకులను అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు మునుముందు కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజయ్య, బొగ్గరపు దయానంద్ గుప్త, వెంకటేశ్వర్లు, ధీరజ్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, ఇమ్మడి రమేశ్, రమేశ్, సుధాకర్, ఉమ్మడి శివ, ఆర్యవైశ్య సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ జోన్ నవతెలంగాణ 2025 వార్షిక క్యాలెండర్‌ను ఆవిష్కరణ చేసిన మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 10వ డివిజన్ కంటెస్టెంట్ కార్పొరేటర్ ద్యాసాని తిరుపతి రెడ్డి, బీజేపీ యువమోర్చ నాయకులు నాణెం రవీందర్ రెడ్డి, లక్కీ కృష్ణారెడ్డి, శ్రీనివాస్ గుప్తా, సతీష్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, కేశవ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ - మీర్ పేట్

'మీల్స్ సెంటర్స్, తోపుడు బండ్లను తొలగించాలి'

నవతెలంగాణ-ఎల్బీనగర్

డాక్టర్స్ కాలనీ మెయిన్ రోడ్, వైట్ హౌజ్ సర్వీస్ రోడ్‌లో రోజు టిఫిన్ బండ్లు, మీల్స్ సెంటర్స్ ఏర్పాటు చేయడం వలన ట్రాఫిక్ ఇబ్బందులు కలుగుతున్నాయని కాలనీ వాసులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సర్వీస్ రోడ్‌లో రోజు ఆటోలు, టూ వీలర్స్ వాహనాలను పార్క్ చేయడం వలన సర్వీస్ రోడ్‌లో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ విషయంపై డాక్టర్స్ కాలనీ వాసులు జీహెచ్ఎంసీ కమిషనర్, జోనల్ కమిషనర్, ట్రాఫిక్ కమీషనర్స్‌కు ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు. కాలనీకి వచ్చే వాహనదారులకు టిఫిన్ బండ్ల వారితో గొడవలు జరుగుతున్నాయని అన్నారు. ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు పటించుకోవడం లేదని ఆరోపించారు. డాక్టర్స్ కాలనీ, జింకలాబావి కాలనీ, వికాస్‌నగర్, క్రాంతినగర్, సాయికృష్ణ నగర్, భగత్ సింగ్ నగర్, సరూర్ నగర్, అందులోను మహిళా పోలీస్ స్టేషన్ వాహనాలు అదే మార్గంలో వస్తాయని వెల్లడించారు. ఫిర్యాదు చేసిన వారిలో కాలనీ అధ్యక్షులు జిగిని రామ మూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ వన్నాడి శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ వక్కలంక శ్రీనివాస రావు, ప్రధాన కార్యదర్శి దండెం జనార్దన్ రెడ్డి, సెక్రటరీ వోటుకూరి దయాకర తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారం కోసం
కృషి చేస్తున్న ప్రభుత్వం



మేయర్ పారిజాత నర్సింహారెడ్డి

నవతెలంగాణ-బడంగ్‌పేట్

రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారం ఎంతో కృషి చేస్తున్నట్లు మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 20వ డివిజన్ శ్రీ విద్యా టౌన్ షిప్ కాలనీలో ఏర్పాటు చేసిన కాలనీ సమావేశానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహా రెడ్డి, కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డిలు హాజరయ్యారు. తర్వాత కాలనీలో పర్యటించి కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం కాలనీవాసులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగుల ప్రభాకర్ రెడ్డి, నయనా చారి, మనోహర్, గిరి ముదిరాజ్, సుధాకర్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



సంక్రాంతి నాటికి ' రైతు భరోసా'



దేప భాస్కర్ రెడ్డి

నవతెలంగాణ -ఎల్బీనగర్

సంక్రాతి నాటికీ రైతులకు రైతు భరోసాను ప్రభుత్వం అందిస్తుందని మహేశ్వరం నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి తెలిపారు. మహేశ్వం నియోజకవర్గం ఎస్సీ సెల్ ప్రెసిడెంట్‌గా క్యారగారి శ్రీధర్ నియమితులయ్యారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి ఆయన నివాసంలో ఆదివాంర క్యారగారి శ్రీధర్ మర్యాద పూర్వకంగా కలిశారు. తర్వాత దేప భాస్కర్ రెడ్డి అధ్యక్షులుగా నియమితులై శ్రీధర్‌ను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా దేప భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తుందని అన్నారు. ఆరు గ్యారెంటీలో మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్లు, యువ వికాసం, చేయూతకు, ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్‌ను అమలులోకి వస్తాయని అన్నారు. సంక్రాంతి నాటికి రైతుల ఖాతాలో రైతు భరోసా పడుతుంది అని దేప భాస్కర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, పున్న గణేష్ నేత, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూదన్ రావు, పందుల వెంకటేష్ గౌడ్, జంగయ్య పవన్, భిక్షపతి, దయాకర్, నర్సింగ్, వినాయ్, భాను, జనార్దన్, విప్లవ రెడ్డి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈడబ్ల్యూసీ కోటను ఎత్తివేయండి

- బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ మద్దెల వినయ్ కుమార్

నవతెలంగాణ- నాగోల్

తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఉద్యోగాలలో 10% ఈడబ్ల్యూసీ రిజర్వేషన్ అమలు చేయడం పట్ల మొత్తానికే మోసం వస్తుందని, దీనిని వెంటనే ఎత్తివేయాలని బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ మద్దెల వినయ్ కుమార్



ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కొత్తపేట బాబు జగజీవన్ రామ్ భవన్ దగ్గర బీసీ కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్‌కు చెందిన గంజి ఉదయ్ ముదిరాజ్‌కు బీసీ కులాల ఐక్యవేదిక స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు పెద్దవూర బ్రహ్మయ్యలకు నియామక పత్రాలను అందజేశారు. అనంతరం మద్దెల వినయ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 10% ఈడబ్ల్యూసీ రిజర్వేషన్ అమలు చేస్తుండడం పట్ల బీసీ కులాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగాలలో ఈడబ్ల్యూసీ కోటాను 10 శాతం అమలు చేయడం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు ఓపెన్ కేటగిరి అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జబల్పూర్ హైకోర్టులో కేసు నెంబర్ 9692/2021కు సంబంధించి 2024లో తీర్పునిచ్చిందని అన్నారు. అయితే ఈ కేసు మొత్తం ప్రభుత్వ ఉద్యోగాలలో 50 శాతం రిజర్వేషన్లు కింద మిగిలిన 50% ఉద్యోగాలలో పది శాతం కేటాయించాలని తీర్పించినట్లు గుర్తు చేశారు. కానీ తెలంగాణలో మొత్తం ఉద్యోగాలలో 10 శాతం ఈడబ్ల్యూసీ రిజర్వేషన్ అమలు చేస్తుండడం వల్ల మొత్తానికి మోసం వస్తుందని, అందుకే ఈడబ్ల్యూసీ కోటను ఎత్తివేయాలని కోరారు. నూతనంగా ఎంపికైన బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు పెద్దవూరే బ్రహ్మయ్య మాట్లాడుతూ ఈ డబ్ల్యూసీ కోటాతో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు తీరని అన్యాయం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వినయ్ కుమార్, అరవింద్, మధు, జగదీష్ ప్రదీప్, యాదయ్య, రాము లాల్, వెంకటేష్, లక్ష్మయ్య, సైదులు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సరూర్ నగర్‌లో సీపీఐ శతాబ్ది ఉత్సవాలు

నవతెలంగాణ -ఎల్బీనగర్

భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ శతాబ్ది ఉత్సవాలను సీపీఐ సరూర్ నగర్ మండల కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ సరూర్‌నగర్ మండల కార్యదర్శి బాతరాజు నరసింహ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య జెండా



ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ 1925లో ఆవిర్భవించిందన్నారు. నాటి నుండి నేటి వరకు తెలంగాణలో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా భూస్వాములపై పోరాటం చేసి.. పది లక్షల ఎకరాలను పేదలకు పంపిణీ చేసిన ఘనత భారత కమ్యూనిస్టు పార్టీదే అని గుర్తుచేశారు. అధికారం ఉన్నా లేకున్నా నేటికీ నిరంతరం ప్రజల హక్కుల కోసం, లాఠీలు తూటాలు, జైలును సైతం లెక్కచేయకుండా పోరాటం చేస్తుంది కమ్యూనిస్టులే అని అన్నారు. అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం ప్రకారం ప్రజలకు కూడు, గూడు, వైద్యం, విద్య, పని కల్పించాలని డిమాండ్ చేశారు. వాటిని అమలు చేయాలని నేటికి పోరాటం చేయాల్సిన పరిస్థితి నెలకొనడం బాధాకరమన్నారు. డిసెంబర్ 30 నల్లగొండలో ఎన్ జి గ్రౌండ్ లో జరిగే బహిరంగ సభకు రంగారెడ్డి జిల్లా నుండి పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి మాట్లాడుతూ సోషలిస్టు సమాజ నిర్మాణం కోసం, పీడిత వర్గాల ప్రజల హక్కుల కోసం, సమ సమాజ నిర్మాణం కోసం, పేద ప్రజల పక్షాన పోరాటాలు చేస్తున్న పార్టీ సీపీఐ అని అన్నారు. దేశంలో ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న ఎర్రజెండా పార్టీల చరిత్ర లేకుండా చేయాలని చూడడం బీజేపీకి తరం కాదన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో 4,000 మంది తమ ప్రాణాలను త్యాగం చేసి, ప్రజల విముక్తి కోసం సీపీఐ ఆధ్వర్యంలో పోరాటం చేసి అమరవీరులయ్యారని గుర్తు చేశారు. నేటికీ రాష్ట్రంలో అనేకచోట్ల భూ పోరాటాలు కొనసాగిస్తున్న ఘనత కమ్యూనిస్టు పార్టీదే అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, ఏఐటీయూసీ ఓబీసీ రాష్ట్ర కార్యదర్శి మారగొని ప్రవీణ్ కుమార్ గౌడ్, సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు సామిడి శేఖర్ రెడ్డి, మహిళా సమాఖ్య రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి షైమీద, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గ్యార క్రాంతి కుమార్, సీపీఐ రంగారెడ్డి జిల్లా సమితి సభ్యురాలు కమలమ్మ సరూర్‌నగర్ మండల సహాయ కార్యదర్శులు కందుల సుధాకర్, బోయపల్లి రాములు గౌడ్, మండల కార్యవర్గ సభ్యులు జిల్లాల కృష్ణ, పి నర్సిరెడ్డి, ఇద్దరిస్ బాయ్, ఆర్ కరుణాచారి, గంగాధరి శ్రీనివాస్, ఆర్ లింగస్వామి, శోభ, అనిత, పార్వతమ్మ, స్థానిక నాయకులు గౌస్య బి, నూర్జహాన్, యిజాయిస్, యూసుఫ్, దర్శన్, నరేష్, యాదయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ సెంట్రల్ బ్యాంక్ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-తుర్కయంజాల్

తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ ప్రధాన కార్యాలయం అబిడ్స్‌లో హైదరాబాద్ జిల్లా కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ వారి నూతన సంవత్సరం 2025 క్యాలెండర్, డైరీని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర్ రావు ఆదివారం ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ రైతులకు సకాలంలో రుణాలు అందించాలని పేర్కొన్నారు. బ్యాంక్ వ్యవస్థ, రుణాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఈ ఆవిష్కరణలో టెస్కాబ్ చైర్మెన్ మార్నేని రవీందర్ రావు, టెస్కాబ్ వైస్ చైర్మెన్, ఉమ్మడి రంగారెడ్డి డీసీసీబీ చైర్మెన్ కొత్తకుర్మ సత్తయ్య, టెస్కాబ్ ఎండి గోపి, సీజీమ్ జ్యోతి, జిల్లా డీసీసీబీ చైర్మెన్లు భోజరెడ్డి, దేవేందర్ రెడ్డి, నాగేశ్వర్ రావు, విషువర్ధన్ రెడ్డి, కుంట రెమెషరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, హెచ్‌డి సీసీబీ బ్యాంక్ డైరెక్టర్లు చంద్రశేఖర్, మిగులయ్య, ఆనంద్, బాల్ రెడ్డి, బ్యాంక్ సీఈఓ భాస్కర్ సుబ్రహ్మణ్యం, జీఎంలు ప్రభాకర్ రెడ్డి, ఫణి కుమార్, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీసాయి హాస్పిటల్ ఆధ్వర్యంలో
ఉచిత హెల్త్ క్యాంప్



నవతెలంగాణ- సిటీబ్యూరో

మన్సూరాబాద్ శ్రీ సాయినగర్ కాలనీలో శ్రీ సాయి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఫ్రీ హెల్త్ క్యాంప్ నిర్వహించినట్లు హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రవణ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ డాక్టర్ వెంకటేష్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ రమణకుమార్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. ఈ శిబిరంలో షుగర్ టెస్ట్, బీపీ టెస్టులను ఫ్రీగా చేసినట్టు పేర్కొన్నారు. ఉచిత ఫిజీషియన్ కన్సల్టేషన్‌తో సలహాలు, సూచనలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సాయి నగర్ కాలనీవాసులు, హాస్పటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



మేయర్ పారిజాత నర్సింహారెడ్డి

నవతెలంగాణ- బడంగ్‌పేట్

ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల వారు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 31వ డివిజన్ బాలాజీ నగర్ కాలనీలో చౌహన్ ఆస్పత్రి బాలాపూర్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సమాజంలో ఎంతో మంది పేద ప్రజలకు సరైన వైద్యం అందకపోవడం వలన ఎంతో మంది అనారోగ్యంతో బాధపడుతూప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ వైద్య శిబిరంలో రోగులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి..ఉచితంగా మందులను పంపిణీ చేసినట్టు తెలిపారు. డాక్టర్ ఉదయ్ చవాన్ మాట్లాడుతూ ఇప్పటికీ ఎంతో మంది క్యాన్సర్ రోగులకు పరీక్షలు నిర్వహించి.. క్యాన్సర్ నివారణకు తక్కువ ఫీజులకే ఆపరేషన్స్ నిర్వహించి, ప్రాణాలను కాపాడినట్లు తెలిపారు. క్యాన్సర్ రహిత సమాజం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, డా.ఉదయ్ చౌహన్, డా.వినయ్ చౌహన్, డా.భాగ్యలక్ష్మి, డా.గాయత్రి చౌహన్, మేనేజర్ శ్రీకాంత్, వైద్య సిబ్బంది కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



హుక్కా సెంటర్‌పై పోలీసుల దాడి

- నిందితుల అరెస్టు, రిమాండ్
- ఇన్‌స్పెక్టర్ ఎం.సుధాకర్

నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం జోన్ బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న హుక్కా సెంటర్‌పై పోలీసులు దాడి చేసి నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుధాకర్ తెలిపారు. ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. బాలాపూర్ స్టేషన్ పరిధిలో ఉన్న సుల్తాన్ పూర్ గ్రామంలో స్థానికుల సమాచారం మేరకు హుక్కా సెంటర్‌పై దాడి చేసినట్టు తెలిపారు. హుక్కా సెంటర్ నిర్వాహకులు సఫీయా బాబా, మహ్మద్ పరుఖీ, సయ్యద్ మన్సూర్, సయ్యద్ అశ్లాం, మహ్మద్ నూర్, షేక్ అలీలను అరెస్టు చేసినట్టు పేర్కొన్నారు. వారి నుండి హుక్కా పార్ట్స్ 8, హుక్కా పైప్స్ 16, బ్రిక్ కోల్ బాక్స్ 05, కోకోనట్ కోల్ బాక్స్, 2 ఆపిల్ ఫ్లవర్ బాక్స్, సెల్ ఫోన్స్, 4ప్రీమియం అల్యూమినియం ఫైల్ రోల్స్‌లను స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. తర్వాత నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తెలిపారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
సోమవారం | డిసెంబర్ 30, 2024 | www.navatelangana.com

రిషిక్‌ను అభినందించిన వజ్రేష్ యాదవ్



నవతెలంగాణ-మేడ్చల్

ఈనెల 26, 27, 28 తేదీల్లో నగరంలోనికి గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన సీఎం కప్ 2024లో భాగంగా కిక్ బాక్సింగ్ పోటీల్లో మేడ్చల్ పట్టణానికి చెందిన యూనివర్సల్ 369 కిక్ బాక్సింగ్ అకాడమీ విద్యార్థి రిషిక్ అండర్ 14 ఇయర్స్ 37కేజీల విభాగంలో మూడో స్థానం సాధించారు. ఈ సందర్భంగా వారు ఆదివారం మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్‌ను కలిసారు. ఆయన రిషిక్‌ను అభినందించారు. అదేవిధంగా యూనివర్సల్ 369 కరాటే అసోసియేషన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడిగా నియామకమైన సందర్భంగా గర్దాస్ నరేందర్ సైతం అభినందించారు. విద్యార్థి రిషిక్‌కు మరింత కఠినమైన శిక్షణ ఇచ్చి అంతర్జాతీయ స్థాయిలో తీసుకెళ్లి జిల్లాకు, తెలంగాణ రాష్ట్రానికి కిక్ బాక్సింగ్‌లో మంచి పేరు ప్రతిష్ట తీసుకురావాలని సూచించారు. కలిసిన వారిలో కోచ్ జి. సాయికుమార్ ఉన్నారు.

135వ వారం జ్ఞానమాల సమర్పణ





నవతెలంగాణ-కాప్రా

కాప్రా మండల్ జమ్మిగడ్డ ప్రాంత, బీజేఆర్ కాలనీలో జ్ఞానమాల టీం ఆధ్వర్యంలో 135వ వారం జ్ఞానమాల కార్యక్రమం నిర్వహించారు. మహాత్మ జ్యోతిరావు పూలే, డా బీ.ఆర్. అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలతో జ్ఞానమాల సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో జ్ఞానమాల టీం సభ్యులు ఆర్గనైజర్ తాడూరి గగన్, ఎస్.ఏ.రహీమ్, నర్సింహ్మా చారి, నరేందర్ రావు, దయానంద్, సూరిబాబు, నగేష్, ముఖ్యులుగా కాప్రా విశ్వకర్మ ట్రస్ట్ చైర్మెన్ కలకొండ బిక్షపతి చారి, గౌరవ చైర్మెన్ మారోజు నర్సింహ్మా చారి ప్రధాన కార్యదర్శి మహంకాళి నర్సింహ్మా చారి పాల్గొన్నారు..

రహదారులపై వాకర్స్‌కు అనుమతి లభించేలా కృషి చేస్తా





- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-చర్లపల్లి

ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థలైన ఎన్ఎఫ్‌సీ, ఈసీఐఎల్ రహదారులలో ఉదయం వాకర్స్‌కు రన్నర్స్‌కు అనుమతి లభించేలా యాజమాన్యంతో మాట్లాడి కృషి చేస్తానని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. ఆయన నివాసంలో ఈసీఐఎల్ వాకర్స్ క్లబ్ సభ్యులు కలిసి ఇటీవల ఎన్ఎఫ్‌సీ, ఈసీఐఎల్ సంస్థలు చేపట్టిన నియం త్రణ చర్యలపై విన్నవించుకున్నారు. క్లబ్ సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తాము దశాబ్దాలుగా తమ ఆరోగ్య రక్షణకై సంస్థల సహకారంతో నడకదారిని ఉపయో గించుకుంటున్న విషయాన్ని గుర్తు చేశారు. కానీ ఇటీవల ఆ దారిలో వాకర్స్‌ను భద్రతా కారణాలపై అనుమతించకపోవడంపై తమ ఆవేదనను వ్యక్తం చేశారు. తమలో చాలామందికి అనారోగ్య సమస్యలు ఉన్నాయని, మానవీయ కోణంలో కనీసం తమకు ఉదయం 6 నుంచి 9 గంటల మధ్య నడకదారిని ఉపయోగించుకునేందుకు అనుమతించేలా చూడాలని ఎమ్మె ల్యేను వేడుకున్నారు. తక్షణమే సానుకూలంగా స్పందించిన లక్ష్మారెడ్డి ఈసీఐఎల్ అధికారులతో, ప్రభుత్వ రంగ సంస్థలైన కార్మిక నాయకులతో మా ట్లాడారు. వాకర్స్ పట్ల సానుకూలంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా పూర్తిస్థాయి నిషేధాజ్ఞలు కాకుండా ఉదయం ఆరు నుంచి తొమ్మిది గంటల వరకు వెసులుబాటు కల్పించేలా చర్యలకు ఉపక్రమించాలని వారిని ఎమ్మెల్యే కోరారు. అదేవిధంగా రెండు రోజుల్లోపు అధికారులు సానుకూ లంగా స్పందించని పక్షంలో అవసరమైతే పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేం దర్‌తో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని లక్ష్మారెడ్డి ఈ సందర్భం గా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈసీఐఎల్ వాకర్స్ క్లబ్ సభ్యులు రాజుగౌడ్, ఎంపల్లి క్రాంతి రణదేవ్, కె.రవీందర్, చంద్రమౌళి, సాగర్ రెడ్డి, నవీన్ గౌడ్, అంజి, రవీందర్, మనోజ్, గణేష్ రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ స్ఫూర్తితో కార్మిక హక్కులను సాధించుకుంటాం



- ఎంఎస్‌పీ జాతీయ నాయకులు, ఎంజేఎఫ్, మాదిగ ఆర్టీసీ కార్మికుల ఇన్‌చార్జి ఇప్పారపు లక్ష్మణ్ మాదిగ

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

జీహెచ్ఎంసీ కార్మికుల సమస్యల పరిష్కరించడానికి ఎమ్మార్పీఎస్ ముందుంటుందని ఎంఎస్‌పీ జాతీయ నాయకులు మాదిగ జర్నలిస్టు ఫోరమ్, మాదిగ ఆర్టీసీ కార్మికుల జాతీయ ఇన్‌చార్జి తిప్పారపు లక్ష్మణ్ మాదిగ అన్నారు. మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని బాలా సరస్వతినగర్‌లో బేబీ ఆరాధ్య మనోహర్ పుట్టినరోజు సందర్భంగా మట్టిపల్లి యాదమ్మ అమృత ధార ట్రస్ట్, సెవెన్ రా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికులకు బట్టల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా లక్ష్మణ్ మాదిగ, వట్టిపల్లి యాదమ్మ అమృతధార ట్రస్ట్ చైర్మెన్ బట్టిపల్లి రఘురాములు, వైస్ చైర్మెన్ మనోహర్, హైకోర్టు న్యాయవాది నజీర్ హైమద్, సెవెన్ రా ఫౌండేషన్ చైర్మెన్ తిప్పారపు కీర్తి కుమార్‌లు పాల్గొని పారిశుధ్య కార్మికులకు బట్టలు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కార్మికుల సమస్యల పరిష్కరించడానికి ఎమ్మార్పీఎస్ ముందుంటుందని ఇలాంటి స్వచ్ఛంద సంస్థల ద్వారా పుట్టినరోజు సందర్భంగా వృధా ఖర్చులు చేయకుండా కార్మికులకు సహకారాన్ని అందించడం ఎంతో అభినందించదగ్గ విషయమన్నారు. జీహెచ్ఎంసీ కార్మికుల సేవలు సమాజంలో ఎంతో విలువైనయని ముఖ్యంగా మహానగరంలో మీరు చేసే సేవలు వెలకట్టలేని తెలిపారు. రాష్ట్రం నుంచే కాకుండా దేశవ్యాప్తంగా పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో త్వరలోనే వారి హక్కుల కోసం కార్యచరణ తీసుకొని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలతో ఉద్యమం చేస్తామని చెప్పారు. అంబేద్కర్ స్ఫూర్తితో కార్మికులకు న్యాయం జరిగే విధంగా ఎమ్మార్పీఎస్ దేశవ్యాప్తంగా ముందుకు వెళ్తొందని వారి హక్కులను కచ్చితంగా సాధించుకుంటామని, వర్గాల ప్రజల హక్కుల కోసం వారి సమస్యల పరిష్కారం కోసం ముందుకు వెళ్లేది ఎమ్మార్పీఎస్ అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారు రామచెర్ల నర్సింగ్, శ్రీరామ్ ఉపేందర్, సీనియర్ జర్నలిస్టులు సంగమేశ్వర్, సుధాకర్, రమేష్, జ్యోతి కుమార్, నరేష్, శివ, ప్రశాంత్, వెంకటరమణ, నందకుమార్, జీహెచ్ఎంసీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన శివ చరణ్ రెడ్డిని కలిసిన సంజీవరెడ్డి



నవతెలంగాణ-ఘట్కేసర్

తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన జక్కిడి శివ చరణ్ రెడ్డిని ఘట్కేసర్ మున్సిపల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొక్క సంజీవరెడ్డి ఆదివారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల్లో సపోర్టు చేసిన యూత్ కాంగ్రెస్ నాయకులకు శివ చరణ్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొమ్మక్ అజయ్, నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తోటకూర రాహుల్ యాదవ్, ఉపాధ్యక్షులు అంజన్ గౌడ్, మున్సిపల్ యూత్ కాంగ్రెస్ నాయకులు రఫీయుదిన్, కృష్ణ, నితీష్ రెడ్డి, దిలేప్, దామోదర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





షామీర్‌పేట్ కట్ట మైసమ్మ అమ్మ వారిని, కొమురవెల్లి మల్లన్న కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు, చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ దర్శించుకున్నారు. నవతెలంగాణ-చర్లపల్లి

ఎస్‌ఎఫ్‌ఐ 55వ ఆవిర్భావ వేడుకలు



నవతెలంగాణ-కాప్రా

ఎస్ఎఫ్ఐ కాప్రా మండల కమిటీ ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించి, ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ కాప్రా మండల అధ్యక్ష కార్యదర్శులు శ్యామ్ రావు, టి.అరుణ్ మాట్లాడుతూ.. 1970లో డిసెంబర్ నెలలో ఎస్ఎఫ్ఐ కేరళ రాష్ట్రంలోని త్రివేండ్రంలో ఏర్పడిందన్నారు. విద్యార్థుల సమస్యలే లక్ష్యంగా ఎన్నో విజయాలు సాధిస్తూ పోరాటాలను కొనసాగిస్తూ.. భారత దేశంలో అతిపెద్ద విద్యార్థి సంఘంగా అవతరించిందన్నారు. నాటి నుంచి నేటివరకు విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తూ.. భారత దేశంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నిస్తూ ముందుకు వెళుతుందన్నారు. దేశంలో ఉన్నటువంటి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యాయి అన్నారు. ప్రయివేట్, కార్పొరేటు విద్యాసంస్థలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ విద్యరంగాన్ని దెబ్బతీసే కుట్ర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్నాయన్నారు. కాప్రా మండలం విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరించడంలో విఫలమైందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర దగ్గరికి వస్తున్న కూడా ఇప్పటివరకు తెలంగాణ రాష్ట్రానికి విద్యశాఖ మంత్రి లేకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దేశంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించి విద్యారంగానికి అధిక నిధులు కేటాయించి ప్రభుత్వ విద్య సమస్యలను బాగుచేయలన్నారు. లేదంటే దేశంలో ఉన్నటువంటి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను రానున్న ఎన్నికలలో విద్యార్థులే గద్దె దింపుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మనీష్, ప్రశాంత్, పండు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు అందుకున్న డా॥ గంగి మల్లేష్





నవతెలంగాణ-కీసర

స్వయంకృషితో అంచెలంచెలుగా ఎదిగి నిరుపేద ప్రజలకు, మహిళలకు, యువతకు అండగా నిలుస్తూ కులమతలకతీతంగా చేయూతనిస్తున్న కీసర మండల, రాంపల్లి దాయరా మాజీ సర్పంచ్ డా॥ గంగి మల్లేష్‌కు స్ఫూర్తి ఎన్‌జీఓ సంస్థ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు ప్రశంశ పత్రాన్ని అందించింది. ఆర్టీసీ క్రాస్ రోడ్డు కళాభారతిలో స్ఫూర్తి బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు కార్యక్రమా సమావేశంలో అవార్డును అందజేశారు. ప్రజలలో అనుక్షణం ఉంటూ అలుపెరుగని పోరాటం చేస్తూ ప్రజాసంఘాలకు, దళిత సంఘాలకు, ప్రజలకు తనను నమ్ముకున్న కార్యకర్తలకు ప్రతిక్షణం అండదండగా ఉంటూ వారికి కావలసిన సేవలను అందిస్తూ నిరంతరం నిరాడంబంగా ప్రజల మన్ననలు అందుకుంటున్న డా॥ గంగి మల్లేష్‌కి సేవా దృక్పథం ఉండటం అభినందనీయమని డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. స్ఫూర్తి సొసైటీ ఆర్గనైజేషన్ ఎన్‌జీఓ చేస్తున్నటువంటి సేవలను కొనియాడారు. డా॥ శ్రీనివాస్ మాట్లాడుతూ.. సమాజంలో నిరుపేదల పరిస్థితులు వాటికి అనుగుణంగా ప్రజల సుఖశాంతులు ప్రజలకు కావలసినటువంటి సదుపాయాల నిమిత్తం అలుపెరుగని పోరాటం చేస్తున్న తరుణంలో స్ఫూర్తి ఆర్గనైజేషన్ వారు గుర్తించి నాకు ఈ బుక్ ఆఫ్ రికార్డు ఇవ్వడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. ఈ అవార్డుల ప్రధానం డా॥ అంబేద్కర్, జ్యోతిరావు పూలే ఆశయాలకు అనుగుణంగా దేశం నలుమూలల నుంచి ప్రముఖ సామాజిక వేత్తలను గుర్తిస్తూ సమాజం పట్ల వారు చేస్తున్నటువంటి కృషిని గుర్తించి ఈ డాక్టరేట్ ప్రధానం చేయడం చాలా సంతోషం అన్నారు. కరోన సమయంలో సొంత ఖర్చులతో వలస కూలీలకు, అన్నం పెట్టి, మాస్కులు, శానిటైజర్ అందించమన్నారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రజలకు కూరగాయలు, నిత్యవసర సరుకులు అందించమన్నారు.

అనంతరం ఆయనకు నాగారం మున్సిపాలిటీ నేతలు మీసాల భాస్కర్, రమేష్‌లు శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వల్లూరి ఫౌండేషన్ అధినేత శ్రీనివాస్ రాజు, ఏసియా వేదిక్ ఇంటర్నేషనల్ కల్చరల్ అండ్ రీసర్చ్ స్ఫూర్తి అకాడమీ ఫౌండర్ రమేష్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయం బీజేపీ పార్టీయే







- రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరడం ఖాయం
- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి సర్కిల్ నేరేడ్‌మెట్ డివిజన్ బీఆర్ఎస్ కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి, బీఆర్ఎస్ యువ నాయకులు సాయి కిరణ్ రెడ్డి, అక్రమ్ సాయి, శ్యామ్, రమేష్, రాజు, ఆల్బర్ట్, రాజ్, మోహిత్, అజయ్, జాన్, జోషియా, సురేష్, ప్రమోద్, గ్రీజ, ఉమారాణి, ఆకాంక్ష, కళ, లక్ష్మిలు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సమక్షంలో జాయిన్ అయ్యారు. ఆదివారం నేరేడ్‌మెట్ డివిజన్‌లోని సరస్వతి ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సుమారు 250 మందికి పైగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్సీ రామచందర్ రావు చేతుల మీదుగా బీజేపీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరవేస్తామని తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయం తామేనని, నరేంద్ర మోడీ నాయకత్వంలో పార్టీని బలోపేతం చేస్తామని తెలిపారు. క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచే బీజేపీ ఇతర పార్టీలకు భిన్నంగా ఉంటుందని, కాబట్టి సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేయాలని కొత్తగా చేరిన నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్‌లు శ్రవణ్, సునీత శేఖర్ యాదవ్, కంటెస్టెంట్ కార్పొరేటర్ ప్రసన్న, బీజేపీ జిల్లా అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, బీజేపీ పార్టీ సీనియర్ నాయకులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాలనీ నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి సర్కిల్ మౌలాలి డివిజన్ పరిధిలోని పిల్లి నర్సింగ్ రావు కాలనీ ఆదివారం నూతన కాలనీ వాసుల సమక్షంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ అధ్యక్షులుగా ఎం.వెంకట్ రెడ్డి, కార్యదర్శిగా ఎస్. శ్రీనివాస్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షులు వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. కాలనీవాసులు ఐక్యమత్యంగా ఉంటు కాలనీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కాలనీ సమస్యల పరిష్కారానికి నా వంతు కృషి చేస్తానన్నారు. పిల్లి నర్సింగ్ రావు కాలనీ నూతన కమిటీ ముఖ్య సలహాదారులు కృపాసాగర్, అధ్యక్షులు గా ఎం. వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్. శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ఎం. లక్ష్మణ్, టి. అశోక్, ఎస్. రాజు గౌడ్, సహాయ కార్యదర్శులు గా గణేష్, బి.వేణు గోపాల్, రాజ్యలక్ష్మి, కోశాధికారి ఎస్. కిషోర్, బి. రాజు, పృథ్వి రాజ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సలీమ్, మంగ, నాజీమా, కార్యవర్గ సభ్యులు ఆంజనేయులు, ఉప్పలయ్య, సామ్యూల్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు శేఖర్, ఎస్ అనిత, అంజమ్మ లక్ష్మమ్మ రాములు, చందు, రమేష్, యాదగిరి, శీను, వెంకటయ్య, పి నరేష్, డి బాబు, రాజు, ఈ లక్ష్మణ్, రవి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగించుకోవాలి



- నీలిమ ఆసుపత్రి సీఓఓ సూర్యదేవర నీలిమ

నవతెలంగాణ-ఘట్కేసర్

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని నీలిమ ఆసుపత్రి సీఓఓ సూర్యదేవర నీలిమ అన్నారు. ఈ సందర్భంగా ఘట్కేసర్ మున్సిపాలిటీ మరిపల్లి గూడలో ఆదివారం నీలిమ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నీలిమ సీఓఓ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆరోగ్య నియమాలను పాటిస్తూ వ్యాధులు దరిచేరకుండా చూసుకోవాలన్నారు. నీలిమ ఆస్పత్రి ఆధ్వర్యంలో మేడ్చల్ యాదాద్రి జిల్లాలోని గ్రామాల్లో 80క్యాంపులు నిర్వహించి దాదాపు 40 వేల మందికి పైగా వైద్యం అందించినట్టు తెలిపారు. క్యాంపులో పాల్గొన్న వారికి తమ ఆస్పత్రిలో 50 శాతం రాయితీ కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ నిర్వాహకుడు ఎడ్ల భరత్ రెడ్డి వైద్యులు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

న్యూట్రిషన్ అధ్యాపకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-ఘట్కేసర్

ఘట్కేసర్ మండలం అంకుశపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల, మహేంద్ర హిల్స్‌లో న్యూట్రిషన్ సబ్జెక్టు బోధించేందుకు అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులను చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.స్నేహలత తెలిపారు. ఈ సందర్భంగా న్యూట్రిషన్ సబ్జెక్టులో పీజీ పూర్తి చేసిన నెట్-సెట్ అర్హత కలిగిన అభ్యర్థులు 03.01.2025 లోపు దరఖాస్తు చేసుకోవాలని అమె సూచించారు. ఇంటర్వ్యూ 06.01.2025న ఉంటుందని తెలిపారు. దరఖాస్తు చేసుకోదలచిన వారు మరిన్ని వివరాల కోసం(prl-rdc-mhls-swrs@gmail.com) ఈమెయిల్ ద్వారా సంప్రదించవచ్చని కోరారు.

నూతన సంవత్సర క్యాలెండర్ల ఆవిష్కరణ



రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్



కృష్ణనగర్ కాలనీ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్



శ్రీ నాగ పోచమ్మ దేవాలయం



సత్యనారాయణ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్



శివసాయినగర్, ఇందిరానగర్ కాలనీ సంక్షేమ సంఘాలు





వాసవి మిత్రమండలి మేడ్చల్, మల్కాజ్గిరి



బీరప్ప గడ్డ కుమ్మరి సంఘం

నవతెలంగాణ-కాప్రా

మీర్పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని హెచ్ బీ కాలనీ ఫేజ్-2 రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించిన చేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కె.వెంకటాచారి, ఉపా ధ్యక్షులు పిఎస్. జగదీశ్వర్, పివిఆర్ కృష్ణ, ఎస్.భువనచంద్ర, ప్రధాన కార్యదర్శి, ఆర్.వి సాంబశివరావు, సంయుక్త కార్యదర్శులు యు.ఈశ్వ రరావు, పి.వెంకటేశం, ఈ.రామచంద్రారెడ్డి, ఆర్గనై జింగ్ సెక్రటరీ రమేష్ బాబు, కే.మధుబాబు, వి.ప్రమోద్ కుమార్, డి సురేష్, కోశాధికారి టి.నరేం దర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఓంకార్, అమర్, అఖిల్, రవీంద్ర కుమార్, కుమారస్వామి, వాసుదేవన్, వెంకటేశ్వర్లు, లక్ష్మి, సూర్యనారాయణ మూర్తి, సంతో ష్, రాజశ్రీ, స్థానిక నాయకులు ఉల్లెం బాలరాజు, చంద్రమోహన్, సుఖేందర్ రెడ్డి, ఆర్కే రెడ్డి, నవీన్ గౌడ్, నిసార్ అహ్మద్ గోరి, కుమార్, దండెం నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

మీర్పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ కృష్ణనగర్ కాలనీ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా విచ్చేసి క్యాలెండర్ ఆవిష్క రణ చేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి. ఈ కార్యక్రమము సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రామచంద్రమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు గొల్లూరి అంజయ్య, సుమలత, ఆసరా కమిటీ వైస్ చైర్మెన్ డాక్టర్ నాగేశ్వరరావు, కాలనీ మాజీ అధ్యక్షులు నర్రా సుఖేందర్‌రెడ్డి, కాలనీ అధ్యక్షులు మొర మల్లారెడ్డి, సెక్రటరీ దేవరాజ్, వెంకటరెడ్డి, ఎంఎస్ఎన్ మూర్తి, జె.రాజయ్య, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

మీర్పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్‌లోని హెచ్‌బీ కాలనీ ఫేజ్-2 శ్రీ నాగ పోచమ్మ దేవాలయం 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే, కార్పొరేటర్లు అమ్మ వారి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంద్ర నగర్ ఫేజ్-2నాగ పోచమ్మ ఆలయ కమిటీ అధ్యక్షులు సదానందం సెక్రటరీ వంజరి ప్రవీణ్, రాజిరెడ్డి, కమిటీ సభ్యు లు, కాలనీవాసులు స్థానిక బీఆర్ఎస్ నాయకులు గుమ్మడి జంపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రాజు, నిసార్ అహ్మద్ గోరి, దండెం నరేందర్ పాల్గొన్నారు.

నవతెలంగాణ-కీసర

నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సత్యనారాయణ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం చైర్మెన్ మాట్లాడుతూ.. కాలనీ సభ్యులు ఐక్యమత్యంగా ఉంటూ అభివృద్ధిలో బాగస్వామ్యులు కావాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మెన్ మల్లేష్ యాదవ్, కౌన్సిలర్ శ్రీనివాస్ గౌడ్, అన్నమరాజు శ్రీనివాస్ కాలనీ ప్రెసిడెంట్ మధుసూదన్ రెడ్డి, ట్రెజరర్ పుండరీకం, కాలనీ కార్యవర్గ సభ్యులు కాలనీవాసులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-చర్లపల్లి

శివసాయినగర్, ఇందిరానగర్ కాలనీ సంక్షేమ సంఘాల కార్యాలయాల్లో 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీ, బస్తీలలో రోడ్లు అండర్ గ్రౌండ్ డ్రయినేజీ తదితర సమస్యలకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్టు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి కాలనీల సమాఖ్య ప్రతినిధులు, నాయకులతోపాటు శివసాయినగర్, ఇందిరానగర్ సంక్షేమ సంఘాల అధ్యక్ష, కార్యదర్శివర్గం సభ్యులు ఎంపల్లి పద్మారెడ్డి, నేమూరి మహేష్ గౌడ్, కొండగళ్ల అశోక్, బీవీ నర్సింహారెడ్డి, రామబ్రహ్మం, బర్ల రామచంద్రారెడ్డి, కాసుల సురేష్, బాణాల రామకృష్ణారెడ్డి, షాబాద్ దామోదర్ రెడ్డి, సత్యనారాయణ, శివకుమార్, సత్యనారాయణ రెడ్డి, చంద్రారెడ్డి, ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చర్లపల్లి డివిజన్ నాగార్జుననగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 2025 నూతన సంవత్సర కాలమానిని ఆదివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి డివిజన్ సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు, కంటెస్టెంట్ కార్పొరేటర్ నేమూరి మహేష్ గౌడ్, కాలనీ అధ్యక్షుడు నామాల కృష్ణ, ప్రధాన కార్యదర్శి యావపురం రవి, కోశాధికారి బొల్లంపల్లి శ్రీకాంత్ రెడ్డి, ఉపాధ్యక్షులు కరుణాకర్ రెడ్డి, మహేందర్ గౌడ్, సంయుక్త కార్యదర్శి శ్రీశైలం, సయ్యద్ సాదిక్, కార్యనిర్వాహక కార్యదర్శి సాయి వివేక్, సలహాదారుడు రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కాప్రా

వాసవి మిత్రమండలి మేడ్చల్, మల్కాజ్గిరి జిల్లా నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వాసవి మిత్రమండలి అధ్యక్షులు పెద్ది నాగరాజు గుప్తా , రెబెల్లి శ్రీనివాస్ గుప్తా ప్రధాన కార్యదర్శి, రామిని తిరుమలేష్ గుప్తా కోశాధికారి, గంప కృష్ణ గుప్తా, కార్య నిర్వాహక కార్యదర్శి, పెద్ది శ్రీనివాస్ గుప్తా తరకేశ్వర్, గజ్జెల రమేష్, తాటి శ్రీనివాస్, ఉప్పల శ్రీనివాస్, ఉప్పల ఆంజనేయులు, మిర్యాల అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-ఉప్పల్

బీరప్ప గడ్డ కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను కార్పొరేటర్ జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్, ముఖ్య అతిథులుగా హాజరై ఆవిష్కరించారు. కార్పొరేటర్ గీత ప్రవీణ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ఎలక్షన్‌లో బీరప్ప గడ్డ కుమ్మరి సంఘం సభ్యులకు ఇచ్చిన మాట ప్రకారంగా వారికి పూర్తి మద్దతు తెలుపుతూ.. కుమ్మరి సంఘం స్థలంలో నూతన భవనం ఏర్పాటు చేయాలన్న వారి అభ్యర్థనను వీలైనంత త్వరలో వారికి భవనం ఏర్పాటు చేసి ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కౌకొండా జగన్, బింగి శ్రీనివాస్, మార్కా శీను, శ్యామ్, బీరప్ప గడ్డ కుమ్మరి సంఘం అధ్యక్షులు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి భానుచందర్, కోశాధికారి కుమార్, సంఘం సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జీడిమెట్ల పీఎస్‌కు లోక్ అదాలత్‌లో మొదటి స్థానం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

డిసెంబర్ నెలలో జరిగిన నేషనల్ లోక్ అదాలత్‌లో 161 కేసులను చేదించి.. సైబరాబాద్ కమిషనరేట్‌లోనే జీడిమెట్ల పోలీస్ స్టేషన్ మొదటి స్థానంలో నిలిచింది. ఈ మేరకు జీడిమెట్ల ఎస్ హెచ్‌ఓ గడ్డం మల్లేష్‌తో పాటు పోలీస్ సిబ్బందిని బాలనగర్ డీసీపీ కె సురేష్ కుమార్ అభినందించి రివార్డులు అందజేశారు. రివార్డులు అందుకున్న వారిలో హెడ్ కానిస్టేబుల్ రాజశేఖర్, కానిస్టేబుళ్లు నాగయ్య, రవి నాయక్, శ్రీకాంత్, హెూం గార్డ్ మోహన్ ఉన్నారు. సిబ్బంది ఉత్సాహంగా పనిచేసేలా ప్రోత్సహించిన ఎస్‌హెచ్‌ఓ గడ్డం మల్లేష్‌ను డీసీపీ అభినందించారు. ఈ కార్యక్రమంలో బాలనగర్, కూకట్‌పల్లి ఏసీపీలు హనుమంతరావు, శ్రీనివాస్ ఉన్నారు.

డ్రయినేజీ సమస్య వెంటనే పరిష్కరించాలి



నవతెలంగాణ-కూకట్‌పల్లి

డ్రయినేజీ సమస్య వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆదేశించారు. ఆదివారం ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని, పీజేఆర్ నగర్ లో, డ్రయినేజీ వాటర్, మంజీర వాటర్ పొంగి రోడ్ల మీదకు వచ్చి సమస్యగా ఉందని కాలనీ వాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా.. కార్పొరేటర్ కాలనీలో పర్యటించారు. ఇండ్లలోని మంజీరా వాటర్ పైప్ లైన్లకు ఆన్ ఆఫ్ లివర్ అమర్చి, త్రాగునీరు వృధాగా పోకుండా చూడాలని కాలనీ వాసులకు సూచించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, షౌకత్ అలీ మున్నా, అగ్రవాసు, రవీందర్, ప్రభాకర్, అజామ్ తదితరులు పాల్గొన్నారు.

'సహారా' 38వ వ్యవస్థాపక దినోత్సవం



నవతెలంగాణ-సిటీబ్యూరో

సహారా స్వచంద సంస్థ 38వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం అంబర్‌పేటలోని తిరుమలనగర్‌లో ఉన్న సహారా కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సహారా కేంద్రంలో పేద విద్యార్థినులు, పట్టణంలోని మురికి వాడలో ఒంటరిగా నివసిస్తున్న పేద అనాథ వద్దులకు నిత్యావసర వస్తువులు, దుస్తులు పంపిణీతోపాటు అన్నదానం కార్యక్రమం కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సహారా సేవా సంస్థ డైరెక్టర్ టి.ఎస్.బాలముకుంద్ అధ్యక్షత వహించారు. మూడున్నర దశాబ్దాలుగా సహారా సంస్థ పేదల అభివద్ధి కోసం చేపడుతున్న వివిధ కార్యక్రమాలను ఆయన వివరించారు. నిరాటంకంగా సహాయం అందిస్తున్న దాతలు, సంస్థలు, ట్రస్టులు, వాలంటీర్లు, కళాశాలల, ఇంటర్న్‌లు, సభ్యులందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. అవినాభావంగా, ముగ్గురు ఆడపిల్లల లబ్ధిదారులు తమ కళాశాలను ముగించుకుని స్వంతంగా జీవనోపాధిని సంపాదిస్తు న్నారని ఆయన సంతోషంతో పంచుకున్నారు. గతేడాది బాలల దినోత్సవం, వద్దుల దినోత్సవం, మహిళా దినోత్సవాలను విజయవంతంగా జరుపుకున్నామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ రాధిక రోహిణి, దివంగత ఆర్.నర్సింగ్‌రావును స్మరించుకుని, చిన్నారులు, వృద్ధులు, యువత, మహిళలు, నైపుణ్యాభివృద్ధి, పర్యావరణం, ఆరోగ్య అవగాహనపై నిర్వహించే కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. గతేడాది పిల్లలకు స్కూల్ బ్యాగులు, టిఫిన్ బ్యాగులు, పుస్తకాలు అందించామని ఆమె వివరించారు. ఈ సందర్భంగా రాధిక రోహిణి మాట్లాడుతూ పండుగ నెలల్లో లబ్ధిదారులు ఇతరుల మాదిరిగా వేడుకలు జరుపుకోవడానికి స్వీట్లు, పిండి వంటలు అందించేలా చూసుకుంటామని తెలిపారు. ఉగాది, వినాయకచవితి పండుగల కోసం బెల్లం, చింతపండు వంటి తీపి తయారీకి ముడిసరుకులను పంపిణీ చేశామనీ, దీపావళి సందర్భంగా స్వీట్స్, ఫెనిలు, పిండి వంటలు, టపాసులు కూడా ఇచ్చామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమానికి రజిత, కె.పద్మజ, కె.పాండు వద్దులు, ట్రైనీలు, ఇతరులందరికీ మధ్యాహ్న భోజనం స్పాన్సర్ చేశారు. చంద్రలేఖ, టి.రామ్మోహన్‌రావు, కరుణాసింగ్, వృద్ధులు, పిల్లల లబ్ధిదారులకు పోషకాహారం, పరిశుభ్రత కిట్‌ను అందించారు. సహారా బోర్డు సభ్యులు ప్రదీప్, డాక్టర్ ముఖేష్, భాస్కర్, యశవంత్, వెంకటాద్రి ఈ వేడుకలో పాల్గొని, కార్యక్రమాలకు మద్దతుగా తమ సేవలను అందించారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు ఆర్.స్వీకర్, టైలరింగ్ టీచర్ నవిత, సంహిత గాంధారి, రమా అడబాల, తదితరులు పాల్గొన్నారు.

సుభాష్ నగర్ డివిజన్ అభివృద్ధికి కృషి



● కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డి

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సుదీర్ఘ సమస్యలన్నిటిని పరిష్కరించి, 130 సుభాష్ నగర్ డివిజన్‌ను ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తున్నట్టు స్థానిక కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డి అన్నారు. ఆదివారం సుభాష్ నగర్ డివిజన్‌లో సుమారు రూ.11 లక్షలతో సూరారం కాలనీలోని పార్క్, వాకింగ్ ట్రాక్, బోర్ అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా... బోర్ డ్రిల్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీల అభివృద్ధితో పాటు పార్కులను అందరికి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, స్థానిక శాసనసభ్యులు ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్‌ల సహకారంతో పార్క్, వాకింగ్ ట్రాక్, బోర్ పనులకు జీహెచ్ఎంసీ నిధులు మంజూరు చేపించడం జరిగిందన్నారు. డివిజన్‌లోని అన్ని పార్కులను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పార్టీ ప్రధాన కార్యదర్శి శివాజీ, సీనియర్ నాయకులు పందిరి యాదగిరి, మహిళా అధ్యక్షురాలు మంగ, ప్రధాన కార్యదర్శి పద్మావతి, వరలక్ష్మి, స్థానిక నాయకులు వెంకటేశ్వర్లు, సాయి, కృష్ణ రెడ్డి పాల్గొన్నారు. తమ బస్తీల అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తున్న కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డికి స్థానిక మహిళలు ఘనంగా సన్మానించారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం..

నవతెలంగాణ-దుండిగల్

నేడు బహదూర్‌పల్లి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ వార్షిక నిర్వహణ పనుల కారణంగా సబ్‌స్టేషన్.పరిధిలో లక్ష్మీనగర్, బహదూర్‌పల్లి, ఐడీఏ 2, వెంకట ప్రణీత్ ఫ్లోర, కట్టమైసమ్మ, ఇందిరమ్మ కాలనీ ఫీడర్లలో ఉ 10:00 గం॥ల నుంచి మధ్యాహ్నం 1:00 గం వరకు లక్ష్మీనగర్, సూరారం గ్రామం, విశ్వకర్మ కాలనీ, సాయినాథ్ సొసైటీ, బహదూర్ పల్లి ఎక్స్ రోడ్, జ్యోతి మిల్క్ ఇండస్ట్రీ ఏరియా, సూరారం మెయిన్ రోడ్డు, గాయత్రి నగర్, అయ్యప్ప సొసైటీ, తదితర ప్రాంతాల్లో అలాగే బౌరంపేట్ ఫీడర్‌లో ఉదయం 10:00గం॥ల నుంచి మధ్యాహ్నం 1:30 గం॥ల వరకు సారెగూడం రోడ్, ల్యాండ్‌మార్క్ -3 విల్లాలు, రాజరాజేశ్వరి కాలనీ, శ్రీ వేద పాఠశాల, వజ్ర విల్లాస్, క్రీక్ స్కూల్, కింగ్స్ బార్ రోడ్ మొదలైన ప్రాంతాల్లో అలాగే మిలీనియం ఇండస్ట్రీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2:00 గం నుండి సాయంత్రం 5:00 గం వరకు మిలీనియం ఇండస్ట్రీ ఏరియా, ఎస్ 2 ఇంజనీరింగ్, వి 4ఇండస్ట్రీ, ఎస్‌విబికే ఫంక్షన్ హాల్, మొదలైన ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఈ అంతరాయానికి ప్రజల సహకరించాలని బౌరంపేట విద్యుత్ శాఖ ఏ ఈ బి.సాయికిరణ్ తెలిపారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం..

నవతెలంగాణ-దుండిగల్

నేడు సబ్‌స్టేషన్ వార్షిక నిర్వహణ పనుల కారణంగా బహదూర్‌పల్లి ఫీడర్‌లో ఉదయం 10.00 గం॥ నుంచి మధ్యాహ్నం 1:00 గం॥ వరకు అలాగే మధ్యాహ్నం 2:00 గం॥ నుంచి 5:00 గం వరకు బహదూర్‌పల్లి గ్రామం, ఇందిరమ్మ కాలనీ, టెక్ మహీంద్రా రోడ్, అలాగే డీపీపల్లి ఎంఎల్ఆర్ ఫీడర్‌లో మధ్యాహ్నం 02.00 గం॥ నుంచి సాయంత్రం 05.00 గం॥ వరకు ఎంఎల్ఆర్ కాలేజ్ రోడ్, పల్లవి ఆశ్రమం, ఎంఎల్ఆర్ కళాశాల, 60 గజాలు, సాయి పూజా కాలనీ,దుండిగల్ పోలీస్ స్టేషన్, చంద్రశేఖర్ రెడ్డి నగర్ గండిమైసమ ఎక్స్ రోడ్, అలాగే చైతన్య కాలనీ ఫీడర్ గాగిల్లాపూర్ ఫీడర్‌లో మధ్యాహ్నం 01.30గం॥ నుంచి 04.30గం॥ వరకు గాగిల్లాపూర్ ఎక్స్ రోడ్, జగన్ వెంచర్, మోడీ బిల్డర్స్‌లలో విద్యుత్ అంతరాయం ఉంటుందని.. ఈ అంతరాయానికి ప్రజలు సహకరించాలని డిపిపల్లి విద్యుత్ శాఖ ఏఈ ఎస్.సురేందర్ రెడ్డి తెలిపారు.

నిమ్స్‌లో మీడియా పాయింట్ ఏర్పాటు



నవతెలంగాణ-సిటీబ్యూరో

పంజాగుట్ట నిమ్స్ హాస్పిటల్‌లో మీడియా పాయింట్‌ను ఏర్పా టు చేశారు. హాస్పిటల్‌లో న్యూస్ కవరేజీ కోసం వచ్చే మీడియా ప్రతినిధులకు సమాచారం అందించేందుకు ఆదివారం డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ ఎస్.లక్ష్మీ భాస్కర్ ఆధ్వర్యంలో అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ నరిమేటి, అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ చరణ్ రాజ్ మేడే, సెక్యూరిటీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా హాస్పిటల్ సెక్యూరిటీ సిబ్బందికి మీడియా నిర్వహణపై పలు సూచనలు చేశారు.

నిర్వహణ సేవలు ఇలా..

- రోగులు, సందర్శకులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ ప్రతినిధులతో కమ్యూనికేట్ చేసేటప్పుడు మర్యాదగా ప్రవర్తించడం.
- ప్రింట్, ఎలక్ట్రానిక్ ప్రతినిధులు హాస్పిటల్‌ను సందర్శిస్తే, వారి గుర్తింపు (ఐడీ కార్డు)ను గౌరవంగా అడిగి నిర్ధారించు కోవడం. అనంతరం నిర్దేశించిన మీడియా పాయింట్ వద్ద వేచి ఉండమని సూచించడం.
- వచ్చిన ప్రతినిధుల వివరాలను హాస్పిటల్‌లోని మీడియా కో-ఆర్డినేటర్‌తో సంప్రదించే అవకాశం కల్పిస్తారు.

మీడియా పాయింట్ నిర్వహణ, బాధ్యతలు..

మీడియా పాయింట్‌ను హాస్పిటల్ సమాచార కేంద్రం దగ్గర ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని అసిస్టెంట్ మెడికల్ సూపరింటెం డెంట్ డాక్టర్ చరణ్ రాజ్ మేడే, హాస్పిటల్ పీఆర్వో సత్యగౌడ్ పర్య వేక్షిస్తారు. వీరు ముఖ్యంగా హాస్పిటల్‌లో జరిగే ముఖ్య కార్యక్రమాలను ఎప్పటికప్పుడు తెలియజేయడం, రోజు వారి జరిగే కార్యక్రమాల వివరాలను తెలియజేచయడం, ముఖ్యమైన శస్త్ర చికిత్సలు చేస్తే సమగ్ర నివేదికను అందిస్తారు. మీడియా సమావేశాలను నిర్వహించడం, మీడియా ప్రతినిధులకు సౌకర్యాలు కల్పిస్తారు. మీడియా పాయింట్ నిర్వాహణ బాధ్యులు ఉదయం 8 నుంచి రాత్రి 8 గం॥ వరకు సమాచారం అందించడానికి అందుబాటులో ఉంటారు.

కార్మికుల క్షేమం... సంక్షేమమే ధ్యేయం



● కార్మిక నేత ముద్దాపురం మదన్ గౌడ్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కార్మికుల సమస్యల పరిష్కారం, క్షేమం, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని శ్రమ శక్తి అవార్డు గ్రహీత, బీఆర్ఎస్‌కేవీ నాయకుడు ముద్దాపురం మదన్ గౌడ్ అన్నారు. సంగారెడ్డి జిల్లా ప్రాంతంలోని రామచంద్రపురం టీబువల ఎలక్ట్రానిక్స్ యూనిట్ - 1 లో కార్మిక శాఖ ఆధ్వర్యంలో.. జరిగిన ఎన్నికలలో ముద్దాపురం మదన్ గౌడ్ అధ్యక్షుడిగా గెలుపొందారు. 60 మంది ఓట్లు పోలుకాగా, 31 ఓట్లు మదన్ గౌడ్‌కు వచ్చాయి. తన ప్రత్యర్థి మల్లికార్జునకు 29 ఓట్లు వచ్చాయి. రెండు ఓట్ల మెజారిటీతో మదన్ గౌడ్ విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కార్మికుల భద్రత యజమాన్యాలదే.. శ్రమించి సంపాదను సృష్టించే కార్మికులకు భద్రత లేదన్నారు. పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల భద్రతకు యజమాన్యాలు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. ఈఎస్ఐని బలోపేతం చేయాలన్నారు. కార్మికుల సంక్షేమ విషయంలో పరిశ్రమల యాజమాన్యాలు నిర్దిష్ట ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. సేఫ్టీ విషయంలో పరిశ్రమలు రాజీ పడకూడదన్నారు. భద్రతా ప్రమాణాలపై థర్డ్ పార్టీ ఆడిట్ తప్పనిసరి చేయాలన్నారు. యాజమాన్యాల నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యజమాన్యాలతో పోరాడి కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తానని అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజక వర్గం, షాపు నగర్ తన నివాస కార్యాలయానికి కార్మికులు తరలివచ్చి ఘనంగా మదన్ గౌడ్‌ను సన్మానించారు.

పేదలకు బివిఆర్ చారిటబుల్ ట్రస్ట్ దుప్పట్ల పంపిణీ



● బాలానగర్ ఏసీపీ హనుమంతరావు

నవతెలంగాణ-బాలానగర్

పారిశ్రామిక వాడలో ప్రాంతాలలోని వివధ ప్రాంతాలలో రోడ్లపై నిరుపేదలు, అనాథలు చలిలో నిద్రిస్తున్న బివిఆర్ చారిటబుల్ ట్రస్ట్ దుప్పట్లను అందజేయడం అభినందనీయమని బాలానగర్ ఏసీపీ హనుమంతరావు అన్నారు. హెచ్ఎంటీ శాతవాహన నగర్ వాకింగ్ గ్రూప్ పెద్దలు అను నిత్య సామాజిక సేవా ప్రదాత, బివిఆర్ చారిటబుల్ ట్రస్ట్ (ఫౌండర్ అండ్ చైర్మెన్) బొమ్మారెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో..ఎముకలు కొరికే చలి కాలంలో హైదరాబాద్ నగరంలో ఫుట్ పాత్ మీద, విశ్రాంతి భవనాలలో, ఇతర షెల్టర్లలో చలిలో కనీసం కప్పుకోవడానికి దుప్పట్లు కూడా లేకుండా నిద్రిస్తున్నారు. నిరుపేదలకు చారిటబుల్ ట్రస్ట్ ఉదాత్త దా తృత్వ గుణంతో శనివారం రాత్రి వెంకటరెడ్డి, వారి మిత్ర బృందం అర్ధరాత్రి వేళలో నగరమంతా తిరిగి ఆ నిరుపేద లకు దుప్పట్లు కప్పి చలికి అలమటిస్తున్న వారి పట్ల చూపిన ప్రేమాభిమానాలకు నగరంలోని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాంలో అతిథులుగా బాలానగర్ ఏసీపీ హనుమంతరావు, సురేందర్ రెడ్డి, వాకింగ్ గ్రూప్ సభ్యులు రాధాకృష్ణ, వాకింగ్ గ్రూప్ ప్రెసిడెంట్ రామ్మోహన్ రావు, జగన్మోహన్ రావు, హనుమంతరావు, బి.వి.ఆర్ యూత్ ప్రెసిడెంట్ శ్యామ్, ఇతర వాకింగ్ గ్రూప్ సభ్యులు, బీవీఆర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

హెడ్ మాస్టర్ రాములుపై మతోన్మాదుల దాడి



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో.. సూరారం డివిజన్, షాపూర్ నగర్‌లో గెజిటెడ్ హెడ్ మాస్టర్ రాములు సార్ పై మతోన్మాదుల దాడిని ఖండిస్తూ నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎర్ర అశోక్, కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి ఈ.దేవదానం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం మండలం తుక్కుగుడా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ హెడ్ మాస్టర్ (GHM) కంబలపల్లి రాములు సార్ డ్యూటీలో ఉన్నప్పుడు తొమ్మిదవ తరగతి చదువుతున్న అయ్యప్ప మాలలో ఉన్న అబ్బాయికి సార్ కాలు తగిలించాడని.. హెడ్ మాస్టర్‌పై మతోన్మాదులు భౌతిక దాడి చేశారు. మాలలో ఉన్న 9వ తరగతి విద్యార్థి కాళ్ళు మొక్కించడం చూస్తే సమాజము తలదించుకునే పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయన్నారు. దైవం కంటే గురువు గొప్పవాడనే మన సంస్కృతి ఎటు పోతుందో గమనించాలన్నారు. మతం ముసుగులో ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా చూడాలన్నారు. మతోన్మాదులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షులు కీలుకాని లక్ష్మణ్, కే.శీను, డి.కరుణాకర్, నర్సింలు, కే.బీరయ్య, గోపాల్, మధు, షఫీ, ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హాయంలోనే అన్ని ప్రాంతాలు అభివృద్ధి..



● టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాయని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. ఆదివారం గాజులరామారం డివిజన్ లెనిన్ నగర్ ప్రాంతానికి చెందిన బస్తీవాసులు ఆయనను తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి తమ ప్రాంత సమస్యలను వివరించారు. పరిష్కరించే విధంగా చూడాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తారని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు అరవింద్ కమల్, రాజ్ కుమార్, లాల్ బాబు, గిరి, సుజిత్, సామి, దీపక్ గిరి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

షాపూర్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-2005 సంవత్సర పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. 20 ఏండ్ల తర్వాత కలిసిన మిత్రులు ఆప్యాయంగా పలకరించుకొని యోగక్షేమాలు తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. చదివిన బడి, పరిసరాలను చూసి భావోద్వేగానికి గురయ్యారు. నాడు గురువులు నేర్పిన క్రమశిక్షణ, చదువుతో ఈరోజు వివిధ స్థాయిలో ఉన్నామని తెలిపారు. ఈ సందర్భంగా తమకు పాటలు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా శ్రమ శక్తి అవార్డు గ్రహీత, జడ్.పి.హెచ్.ఎస్ చైర్మెన్, వ్యవస్థాపకులు ముద్దాపురం మదన్ గౌడ్, అలనాటి జడ్.పి.హెచ్.ఎస్ (రిటైర్డ్) హెడ్‌మాస్టర్ లలిత కుమారి, ఉపాధ్యాయులు లక్ష్మి, సునీత, కరుణాకర్, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్ రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షునిగా దొంతి సోమిరెడ్డి..



● కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి

నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని బాలానగర్ రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడుగా ఏకగ్రీవంగా.. మదర్ డైరీ మాజీ డైరెక్టర్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దొంతిరి సోమిరెడ్డిని సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకునారు. ఈ మేరకు ఆయన నూతన అధ్యక్షుడు సోమిరెడ్డి స్థానిక బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డికి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ బాలానగర్ డివిజన్ పరిధిలోని ఫిరోజ్‌గూడ, ఫూల్ బాగ్ కాలనీకి చెందిన దొంతిరి సోమిరెడ్డి మాజీ డైరెక్టర్ బాలానగర్ మండల రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులుగా ఎన్నిక కావడం హర్షణీయం అన్నారు. అనంతరం సోమిరెడ్డి నన్ను నమ్మి నాకు ఈ అధ్యక్ష పదవిని కట్టబెట్టినందుకు వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా రెడ్డి కులస్తులందరిని ఏకతాటిపై తీసుకువచ్చి.. వారి అభివృద్ధికి పాల్పడతానని అన్నారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొనడం జరిగింది.

విశ్వకర్మ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ..



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి శ్రీవారి ఆలయ ప్రాంగణంలో గల శ్రీశ్రీశ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన నూతన సంవత్సర (2025)క్యాలెండర్‌ను స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ ఆదివారం మగ్దుమ్ నగర్‌లోని కార్పొరేటర్ కార్యాలయ ఆవరణలో ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని విశ్వకర్మ కులస్తుల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, యువ నాయకులు కొలుకుల జైహింద్, సంఘం సభ్యులు,స్థానిక నేతలు పాల్గొన్నారు.

నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 130 - సుభాష్ నగర్ డివిజన్ సూరారం జైశ్రీరామ్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతనంగా రూపొందించిన - 2025 సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటైన జైశ్రీరామ్ నగర్ కాలనీ అభివృద్ధికై తన సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని, సంక్షేమ సంఘం సభ్యులు అందరూ ఐకమత్యంగా ఉండి కాలనీని అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి వేణు ముదిరాజ్, వైస్ ప్రెసిడెంట్ ఎల్.అనిల్ కుమార్, కోశాధికారి రాము ముదిరాజ్, కార్యనిర్వాహక కార్యదర్శి సాయి, వర్కింగ్ ప్రెసిడెంట్ యశ్వంత్ రెడ్డి, వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు రంగారావు, మాలాద్రి, బంగారయ్య, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-హస్తినాపురం

హస్తినాపురం డివిజన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నీల మధుసూదన్ గుప్తా ఆధ్వర్యంలో ఆదివారం వారి కార్యాలయంలో ఆంగ్ల సంవత్సర నూతన క్యాలెండర్‌ను సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాద లక్ష్మీ నారాయణ గుప్త, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్త, రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం పొలిటికల్ కమిటీ చైర్మెన్ చింతల రవి గుప్త, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తాడేపల్లి వెంకట రమణ గుప్త, జిల్లా ఆర్యవైశ్య సంఘం కోశాధికారి కిరణ్ గుప్త, హస్తినాపురం డివిజన్ గౌరవ అధ్యక్షులు కాసుల శ్రీనివాస్ గుప్త, వేణు గుప్త సుధాకర్, భాస్కర్, గణేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.



మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని గుర్రంగూడలో నిర్వహించిన అయ్యప్పస్వామి పడి పూజ, ఇరుముడి కార్యక్రమానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహా రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గుర్రం లక్ష్మారెడ్డి, జక్కిడి విష్ణువర్ధన్ రెడ్డి, జక్కిడి ముత్యంరెడ్డి, రాకేష్ గౌడ్, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ- బడంగ్‌పేట్

నాగేశ్వరరావుకు ఓయూ డాక్టరేట్



నవతెలంగాణ- ఓయూ

ఓయూ కామర్స్ డిపార్ట్మెంట్ నుండి ఓయూ పరిశోధక విద్యార్థి శీలం.నాగేశ్వర రావు డాక్టరేట్ పట్టా సాధించారు. 'సోషల్ సెక్యూరిటీ ఫర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ - ఏ స్టడీ ఆఫ్ సెలెక్ట్ డిస్ట్రిక్స్ ఇన్ తెలంగాణ' అనే అంశంపై ఓయూ ప్రొఫెసర్, ఆల్ ఇండియా కామర్స్ అసోసియేషన్ ఫార్మర్ ప్రెసిడెంట్, ప్రొ. కె. వి. అచలపతి పర్యవేక్షణలో (మార్గదర్శనంలో) నాగేశ్వర రావు తన పరిశోధనను విజయవంతంగా పూర్తి చేసి డాక్టరేట్ పొందారు. ఖమ్మం జిల్లా, కొణిజర్ల మండలం, రామనర్సయ్య నగర్ అనే గ్రామంలో శీలం వీరబ్రహ్మం - వెంకటమ్మ దంపతుల రెండవ కుమారుడుగా శీలం.నాగేశ్వర రావు జన్మించారు. చిన్న తనం నుండే తల్లి, తండ్రుల కష్టాలను దగ్గర నుండి చూసిన నాగేశ్వర రావు ప్రాథమిక విద్య నుండే చదువులో ముందు ఉండేవాడు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, వైరాలో చదువుతూ పదవ తరగతిలో టాప్ ర్యాంక్ సాధించారు. ఖమ్మం నగరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నయబజార్‌లో ఇంటర్ పూర్తి చేసి, కాలేజీ టాపర్‌గా, సి.ఈ.సి గ్రూపు నుండి ప్రభుత్వ కాలేజీల విభాగంలో జిల్లాస్థాయిలో సెకండ్ ర్యాంక్ సాధించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నుండి ఉత్తమ విద్యార్థి అవార్డును, నగదు బహుమతి పొందారు. డిగ్రీ చదివే కాలంలో యూనివర్సిటీ స్థాయిలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించి, జాతీయ స్థాయి మెరిట్ స్కాలర్షిప్ సాధించారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోసం స్టేట్ లెవల్ ఎంట్రెన్స్ రాసి, బెస్ట్ ర్యాంక్ పొంది, ఓయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ కాలేజీలో అడ్మిషన్ పొందారు. ఓయూ కామర్స్ డిపార్ట్మెంట్ లో పరిశోధన విద్యార్థిగా అడ్మిషన్ సాధించారు. ఈ క్రమంలో అనేక జాతీయ, అంతర్జాతీయ సెమినార్‌లకు హాజరయ్యారు. పరిశోధన పేపర్స్ రాసి ప్రజెంట్ చేశారు. ప్రఖ్యాత జర్నల్స్ లో రీసెర్చ్ పేపర్స్ పబ్లిష్ చేశారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ICSSR) నుండి జాతీయ స్థాయి ఫెలోషిప్ కూడా సాధించారు. అకాడమిక్స్‌లో నిత్యం ఆసక్తిగా ఉండేవారు. తాజాగా ప్రఖ్యాత ఓయూ నుండి డాక్టరేట్ సాధించి ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తన అకాడమిక్ ప్రయాణంలో తల్లి తండ్రుల అసమాన త్యాగం, ప్రోత్సాహం గొప్పవని అన్నారు. మరియు రీసెర్చ్ సమయంలో అద్భుతమైన మెళుకువలు, సూచనలు, సలహాలు ఇస్తూ గైడ్ చేసిన రీసెర్చ్ సూపర్వైజర్ ప్రొ. కె.వి.అచలపతి సహకారం వెలకట్టలేనిది అని అన్నారు. ఈ జర్నీలో తన జీవిత సహచరి స్వాతి సహకారం, తోడ్పాటు మరువలేనిదని అన్నారు. వీరందరీ మరియు బాల్యం నుండి విద్యా బుద్దులు నేర్పిన గురువుల కృషి, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు, ప్రొఫెసర్ల ప్రోత్సాహం వలన డాక్టరేట్ సాధించానని ఆయన తెలిపారు. ఓయూ వేదికగా తెలంగాణ రాష్ట్ర సాధనఉద్యమంలో కీలకంగా ఉన్నారు. బహిరంగ సభలు, సమావేశాలు, చర్చలు, ప్రదర్శనలు, లాంటి ఎన్నో పోరాటాలను తెలంగాణ కోసం నిర్మించారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. ఖమ్మం జిల్లా కేంద్రంగా తెలంగాణ మరియు విద్యార్థి పోరాటాలు నిర్మించారు. పి.డి.ఎస్.యూ రాష్ట్ర అధ్యక్షుడిగా ,ఆల్ ఇండియా కన్వీనర్ గా బాధ్యతలు నిర్వహించారు. తెలంగాణ ఉద్యమంలో అనేక కేసులు, నిర్బంధాలు చవి చూశారు. ఎన్ని కష్టాలు ఎదురైనా చదువు తో పాటు సామాజిక బాధ్యతతో విద్యార్థి ఉద్యమాలకు తగిన ప్రాధన్యత ఇస్తూ క్లిష్టమైన కామర్స్ సబ్జెక్టు లో పరిశోధన పూర్తి చేసి డాక్టర్.శీలం.నాగేశ్వర రావు గా ఎదిగారు. డాక్టర్ గా మారడం గౌరవంగా, ఆనందంగా ఉన్నదనీ ఆయన తెలిపారు. ఈ జర్నీలో సహకరించి, మద్దతుగా నిలిచిన అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గొప్ప గుర్తింపు ఇచ్చిన ఓయూకి జీవితకాలం రుణపడి ఉంటానని ఆయన తెలిపారు.

'ఫిబ్రవరి 3న లక్ష డప్పులు, వెయ్యి గొంతులు'



నవతెలంగాణ-ఓయూ

సికింద్రాబాద్ నియోజకవర్గం బౌద్ధ నగర్ డివిజన్ న్యూ అశోక్ నగర్ పార్సిగుట్ట కమ్యూనిటీ హాల్లో MRPS అనుబంధ సంఘాల కార్యకర్తల సమావేశం డప్పు మల్లికార్జున్ మాదిగ జిల్లా అధికార ప్రతినిధి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మార్పీఎస్, జాతీయ అధికార ప్రతినిధి, బొర్ర భిక్షపతి మాదిగ, జాతీయ ఉపాధ్యక్షులు బి. విజయ్ మాదిగలు మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఎస్సీలలోని అన్ని కులాలకు న్యాయం చేకూరాలనే ఉద్దేశంతోనే రాజ్యాంగంలో రిజర్వేషన్లను పొందుపరిచారని అన్నారు. కానీ గత డెబ్బై ఏడు ఏళ్లుగా ఎస్సీ రిజర్వేషన్లు తెలుగు నేల మీద కేవలం ఒక్క కులానికే పరిమితం అయిందని ఆరోపించారు. జనాభా శాతాన్ని మించి రిజర్వేషన్లను పొందడం వల్ల ఒక్క మాల సామాజిక వర్గమే అన్ని రంగాల్లో లబ్ది పొందుతుందన్నారు. జనాభాకు తగినట్టుగా రిజర్వేషన్లు లభించని మాదిగ మరియు ఉప కులాలకు తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. ఎస్సీ వర్గీకరణ మీద నియమితులైన ఏక సభ్య కమిషన్ జనాభా ప్రాతిపదికన ఎస్సీ వర్గీకరణను అమలు జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఫిబ్రవరి 3న లక్ష డప్పులు, వెయ్యి గొంతులు, మహాబారి ప్రదర్శనను విజయవంతం చేయడానికి న్యూ అశోక్ నగర్ పార్సి గుట్ట కమ్యూనిటీ హాల్ నుండి MRPS జాతీయ కార్యాలయం వరకు డప్పులతో ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నూతన MSP బౌద్ధ నగర్ డివిజన్ అధ్యక్షులు గణేష్ మాదిగ, ఎడ్ల రూద్రి మాదిగ, సత్యనారాయణ మాదిగ, తుమ్మల శివప్రసాద్ మాదిగ, రఘు మాదిగ, దేవేంద్ర మాదిగ, మురళీధర్ మాదిగ, కొప్పుల సాయికుమార్ మాదిగ, డప్పు మహేష్ మాదిగ, పాండు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన డిప్యూటీ మేయర్



నవతెలంగాణ-ఓయూ

హయత్‌నగర్ డివిజన్‌లో కమలానగర్ మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 2025 క్యాలెండర్‌ను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ.. 'మహిళా సంక్షేమానికి సంబంధించి కమలానగర్ మహిళా సంక్షేమ సంఘం చేస్తున్న సేవలు అభినందనీయమైనవి అన్నారు. సమాజంలో మహిళల అక్షయ అభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు చాలా అవసరం' అని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి, మోతే పిచ్చి రెడ్డి, మాజీ కార్పొరేటర్లు సోమా ప్రభాకర్ రెడ్డి, తిరుమల రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, సంఘం సభ్యులు, ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

తార్నాక డివిజన్ పరిధిలో...

తార్నాక డివిజన్ లాలాపేట్‌లో మార్కండేయ పద్మశాలి సేవ సమాజం ట్రస్ట్ ఆధ్వర్యంలో రూపొందించిన న్యూ ఇయర్ 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు శోభన్ రెడ్డితో కలిసి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సమాజ సేవలో పద్మశాలి సమాజం అందిస్తున్న సేవలు ప్రశంసనీయం అని, ఇలాంటి కార్యక్రమాలు సమాజానికి పాజిటివ్ మార్పులు తీసుకువస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ఫౌండర్ బిల్లా యాదగిరి, వెంకటేశం, వెంకట్ స్వామి, శ్రీహరి, నాగరాజు ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కల్గిస్తాయి

కార్పొరేటర్ విజయ రెడ్డి

నవతెలంగాణ - బంజారా హిల్స్

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని కార్పొరేటర్, నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఫౌండేషన్ చైర్మెన్ పి. విజయ రెడ్డి అన్నారు. కీర్తిశేషులు మాజీ ఎమ్మెల్యే పి. జనార్దన్ రెడ్డి 17వ వర్ధంతిని పురస్కరించుకొని ఖైరతాబాద్ నియోజకవర్గం లోని ఈద్గా గ్రౌండ్ ఎమ్మెస్ మక్తలో 26 నుంచి 28 వరకు పి.జె.ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పి.జే.ఆర్ మెమోరియల్ కప్ డే అండ్ నైట్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించినట్టు తెలిపారు. జంట నగరాల నుండి 65 టీములు పాల్గొనగా.. విన్నర్‌గా సయ్యద్ సి.సి.(ఆగాపుర) టీం నిలిచిందని తెలిపారు. వారికి పి.జె.ఆర్ ఫౌండేషన్ తరపున 25 వేల రూపాయల నగదుతో పాటు ట్రోఫీ అందజేసినట్టు వెల్లడించారు. రన్నర్‌గా ఎస్.సి.సి (ఎమ్మెస్ మక్త) టీం నిలవగా వారికి 10 వేల రూపాయల నగదుతో పాటు ట్రోఫీని అందజేసినట్టు పేర్కొన్నారు.



ఎమ్మెల్యేను కలిసిన ఆర్పీలు



నవతెలంగాణ కంటోన్మెంట్

కంటోన్మెంట్ నియోజకర్గంలోని రిసోర్స్ పర్సన్స్ ఆర్పీలు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లినందుకు కృతజ్ఞతలు చెప్పారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతి పత్రాన్ని అందజేశారు.

త్వరితగతిన సమస్యలను పరిష్కరిస్తాం : ఎమ్మెల్యే

కంటోన్మెంట్ నియోజకవర్గంలోని సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గం 3 వార్డ్ బాలంరాయి అంబేద్కర్ నగర్ కాలనీలో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు డ్రైనేజ్ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు. తర్వాత వినతి పత్రాన్ని అందజేశారు. బస్తీలోని సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి..వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

అవగాహన లేమితో

ఆరోగ్యాలు పాడు చేసుకుంటున్నారు

- వాస్కులర్ సొసైటీ వరల్డ్ ప్రెసిడెంట్ డాక్టర్ పీసీ గుప్తా



నవతెలంగాణ-బంజారాహిల్స్

వ్యాధుల పట్ల సరైన అవగాహన లేని చాలామంది సామాజిక మాధ్యమాల్లో వీడియోలు చూసి, తమకు లేని వ్యాధిని ఉందని నిర్ధారించుకొని అక్కరలేని వైద్యం చేయించుకొని ఆరోగ్యాలు పాడు చేసుకుంటున్నారని వాస్కులర్ సొసైటీ వరల్డ్ ప్రెసిడెంట్ డాక్టర్ పి.సి గుప్తా తెలిపారు. నగరంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో జపాన్ ఇకిగాయ్ సిద్ధాంతాలతో డయాబెటిక్ ఫుట్, వాస్కులర్ క్లినిక్‌ను ఆయన అసోసియేషన్ ఆఫ్ ప్లాస్టిక్ సర్జన్ ఆఫ్ ఇండియా జాతీయ మాజీ అధ్యక్షుడు డాక్టర్ నితిన్ మోకల్తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పిసి గుప్తా మాట్లాడుతూ సోషల్ మీడియాలో వస్తున్న అనేక వీడియోలు చూస్తూ చాలామంది మోసపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవాలు ధ్రువీకరించకుండా అక్కరలేని వైద్యానికి వెళ్తున్నారని, ఇది మంచి పరిణామం కాదని, దీనివల్ల చాలా ప్రమాదాలు, నష్టాలు ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించారు. డాక్టర్ నితిన్ మోకల్ మాట్లాడుతూ... ప్రపంచంలో భారతదేశం డయాబెటిక్ హబ్గా మారుతుండడం ఆందోళనకరంగా ఉందని, రోజురోజుకు అన్ని వయసుల్లో డయాబెటిక్ వ్యాధిగ్రస్తులు పెరుగుతున్నారని ఇది ఆందోళన కలిగించే అంశం అని అన్నారు. ఆహారపు అలవాట్లను మార్చుకోవడంతోపాటు శారీరక వ్యాయామాలు చేయడం వల్ల డయాబెటిక్ నుంచి కాపాడుకోవచ్చునని అన్నారు. ఇకిగాయ్ వైద్యులు విశ్వనాథ్ ఆత్రేయపురపు, మణి కాంత్ కారుమూరి మాట్లాడుతూ.. జపాన్‌లో ఎక్కువగా విశ్వసించే ఇకిగాయ్ సిద్ధాంతాలతో తమ వైద్య చికిత్సలు ఉంటాయని అన్నారు.

పీజీ సెంటర్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం



- యూనివర్సిటీ అభివృద్ధి కృషి చేయాలి
- వీసీ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్

నవతెలంగాణ- ఓయూ

ఉస్మానియా విశ్వ విద్యాలయం పరిధిలో గతంలో ఉన్న పీజీ సెంటర్ గోదావరిఖని పూర్వ విద్యార్థులు (1976-1995), ఫిజిక్స్ పూర్వ విద్యార్థులు (భౌతిక శాస్త్ర), ఆదివారం ఓయూ ఫిజిక్స్ విభాగంలో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా 6 సూత్రాల పథకంలో భాగంగా నాడు ఈ సెంటర్‌ను ఓయూ పరిధిలో ఉండగా, తరువాత కాకతీయ యూనివర్సిటీ, ప్రస్తుతానికి శాతవాహన యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతోందని ఆ విద్యార్థులు పేర్కొన్నారు. ఇక్కడ విద్యను అభ్యసించిన విద్యార్థులు అన్ని రంగాల్లో ఉన్నారు. వారు వివిధ రూపాల్లో సేవలు అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను నెమర వేసుకుంటూ ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. ముగింపు సందర్భంగా పాల్గొన్న శాతవాహన యూనివర్సిటీ వీసీ ప్రొ.ఉమేష్ కుమార్ మాట్లాడుతూ... గోదావరిఖని పూర్వ విద్యార్థులు ఇలా భేటీ కావడం హర్షణీయం అన్నారు. యూనివర్సిటీ అభివృద్ధికి కలసి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మా తోడ్పాటు ఉంటుందని అన్నారు ఇక ప్రతి సంవత్సరం ఇలా మీట్ నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వీసీలు ప్రొ. నరసింహారెడ్డి, ప్రొ. సాయన్న, ప్రొ. విష్ణు వర్ధన్ రెడ్డి, లింగారెడ్డి, డీన్ ప్రొ. కరుణ సాగర్, హెడ్ శ్రీనివాస్, వేణు గోపాల్ రెడ్డి, యం.ఎస్.చారి, నాగేశ్వరరావు, సురేష్ బాబు, మధుకర్, షరీఫ్, రాం దేవ్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ నాదర్గుల్ గ్రామంలో అశోక్ గురు స్వామి ఆధ్వర్యంలో జనగే శ్రీశైలం యాదవ్ నిర్వహించిన అయ్యప్ప స్వామి మహా పడిపూజకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జి అందెల శ్రీరాములు యాదవ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షులు చెరుకుపల్లి వెంకట్ రెడ్డి, రైతు సహకార సంఘం బ్యాంకు డైరెక్టర్ తోట ప్రతాప్ రెడ్డి, జిల్లా బీజేపీ యువ నాయకులు నిమ్మల రవికాంత్ గౌడ్, నాయకులు నర్సింగ్ యాదవ్, బీజేపీ బీజేవైఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ- బడంగ్ పేట్

సమాజ అభివృద్ధికి పత్రికలు పాటు పడాలి

స్టాన్లీ ఇంజనీరింగ్ కళాశాల సెక్రెటరీ, కరస్పాండెంట్ కె.కృష్ణా రావు



నవతెలంగాణ- ఓయూ

సమాజ అభివృద్ధికి పత్రికలు పాటు పడాలని స్టాన్లీ ఇంజనీరింగ్ కళాశాల సెక్రెటరీ, కరస్పాండెంట్ కె.కృష్ణా రావు అన్నారు. నవతెలంగాణ దిన పత్రిక 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టాన్లీ ఇంజనీరింగ్ కళాశాల, మెథడిస్టు మహిళా ఇంజనీరింగ్ కళాశాలాలు నగరంలో గత కొన్ని సంవత్సరాలుగా సువిశాల ప్రాంగణంలో, అందరికీ అందుబాటులో విద్యాను అందిస్తున్నట్లు చెప్పారు. ఒక కార్పొరేట్ స్పూర్తితో కాకుండా సామాజిక బాధ్యతగా క్రమశిక్షణ కలిగిన మరియు 100% ఉపాధి కల్పన కోసం విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం నవతెలంగాణ యాజమాన్యానికి, ఉద్యోగులకు, సిబ్బందికి, డెస్క్ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్టాన్లీ కాలేజ్ డైరెక్టర్ టి.రాకేష్ రెడ్డి పాల్గొన్నారు.

రాజ్యాధికారం కోసం బీసీలు ఐక్యతతో ప్రశ్నించాలి

శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి



నవ తెలంగాణ - బంజారాహిల్స్

రాజ్యాధికారం కోసం అడుక్కోవడం ఆపి.. బీసీలందరూ గ్రామీణ స్థాయిలో చైతన్యవంతంగా ఐక్యతతో ప్రశ్నించి ఎదిరించినప్పుడే అది సాధ్యమని తెలంగాణ శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనా చారి అన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో బీసీ సమాజ్, బీసీ టైమ్స్ ఆధ్వర్యంలో ప్రతినెల చివరి ఆదివారం జరిగే బీసీలకు బంధువుల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ప్రసంగించారు. ఎంబీసీ, బీసీ కులాలను కలవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రస్తుతం రాజ్యాధికారం డబ్బు అనే భయంకరమైన వ్యవస్థలో ఉందన్నారు. చట్టసభల్లో ఇప్పటికి చాలా బీసీ కులాలకు ప్రాతినిధ్యం లేదని, ఉన్న కొన్ని కులాలకు కూడా జనాభా దామాషా ప్రకారం ప్రాతినిధ్యం లేకపోవడం బాధాకరమన్నారు. పక్కనున్న తమిళనాడు రాష్ట్రంలో సీట్లు అడిగే స్థాయి నుంచి సీట్లు ఇచ్చే స్థాయికి బీసీ నాయకత్వం ఎదగడం సంతోషకరమన్నారు. తాను స్పీకర్‌గా ఉన్నప్పుడు కనీసం జిల్లా సరిహద్దులు దాటని కులాలను హైదరాబాద్ తీసుకొచ్చి అసెంబ్లీ తదితర ప్రాంతాలను చూయించి తనకున్న అభిమానాన్ని చాటుకున్నానన్నారు. ఒక లక్ష్యం పెట్టుకుని ఆ లక్ష్యం నెరవేరేవరకు టీం వర్క్ చేసి బీసీలు శక్తిగా తయారు కావాలన్నారు. తాను అందరికీ అందుబాటులో ఉంటానని, ఎప్పుడు వచ్చినా కలిసి, బీసీ భావజాల వ్యాప్తికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. సభాధ్యక్షులు, బుడబుక్కల సంఘం ప్రెసిడెంట్ విఠల్ మాట్లాడుతూ.. తమ బుడబుక్కల సంఘానికి సమాజంలో ఉన్నతంగా గుర్తింపు వచ్చే విధంగా అందరూ సహకరించాలని కోరారు. బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సంగెం సూర్యారావు మాట్లాడుతూ... అందరం కలిసికట్టుగా ఉండి భవిష్యత్తులో జరగే ఎన్నికల్లో ఒక తాటిపైకి వచ్చి మన ఓటు మనకే వేసుకుందాం అనే నినాదంతో ముందుకెళ్లి అధికారం సాధించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సమాజ్ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పి సతీష్ సాగర్, బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ సాగర్, ఆశాడపు దేవేందర్, ఉమా, చంద్రశేఖర్, బొడ్డుపల్లి చంద్రశేఖర్, మాధవ్, నరేందర్ త నల్లతీగల రాజు, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బిజినెస్ మేనేజ్మెంట్, పూర్వ విద్యార్థుల అధ్యక్షురాలుగా జ్యోస్న



నవతెలంగాణ- ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయం కామర్స్ అండ్ బిజినెస్ మెనేజ్మెంట్ లో విద్యను అభ్యసించిన బిజినెస్ మేనేజ్మెంట్ (ఎంబిఏ), పూర్వ విద్యార్థుల (ఓకాంబ), అధ్యక్షురాలుగా 2001 సంవత్సరం బ్యాచ్‌కి చెందిన జ్యోస్న కొంపల్లి గెలుపొందారు. ఆమె ప్యానల్ నుండి బరిలో దిగిన వైస్ ప్రెసిడెంట్ గా కె.వంశీ, జాయింట్ సెక్రటరీగా ఈ. మురళీ క్రిష్ణ, జాయింట్ సెక్రటరీ శేఖర్ శంకరి, ట్రెజరర్‌గా డా.మారం శ్రీనివాస్ , మరొక ప్యానల్ సుబ్బారావు ప్యానల్ నుండి ప్రధాన కార్యదర్శి ఈ. మురళీ కృష్ణ గెలుపొందారు. మొత్తం 610 మంది ఆలూమిని ఓటర్లు ఉండగా కేవలము 167 మంది మాత్రమే ఈ ఎన్నికల్లో తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. మొదటిసారి ఎన్నికలు జరగడం విశేషం. ఎంబిఏ హెడ్ ప్రొఫెసర్ జహంగీర్ ఈ ఎన్నికల చైర్మెన్‌గా వ్యహరించారు. మాజీ ప్రిన్సిపాల్, డీన్ ప్రొ. శ్రీ రాములు, రిటర్నింగ్ ఆఫీసర్‌గా మాజీ డీన్ ప్రొ. వెంకటయ్య వ్యహరించారు. ఈ కార్యక్రమంలో ప్రొ. విద్యా సాగర్,ప్రొ. స్మిత సాంబ్రాణి పాల్గొన్నారు. ఉదయం 9 -30 నుండి 3 గంటలు వరకు ఓటింగ్ నిర్వహించారు. సాయంత్రం ఓట్ల లెక్కింపు నిర్వహించిన అనంతరం ఫలితాలు ప్రకటించిన అనంతరం ఎన్నికల కమిటీ విజేతలకు గుర్తింపు పత్రములు అందజేశారు. మొదటిసారి ఓయూ నుండి ఆలూమినికి ఒక మహిళ ఎన్నిక కావడం విశేషం. వీరికి పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. రానున్న రోజుల్లో కళాశాల ,విభాగం అభివృద్ధి కోసం కృషి చేసి, లైబ్రెరీ పుస్తకాలు, సభ్యత్వం పెంపొందించి, ప్లేస్ మెంట్స్ కల్పన కృషి చేస్తానని విజేతలు పేర్కొన్నారు. నిధుల సేకరణ చేస్తూ ముందుకు పోతామన్నారు. వీరి పదవీకాలం 2 సంవత్సరాలు పాటు ఉంటుంది.

'నిమ్స్ ఆస్పత్రిలో మీడియా పాయింట్ షురూ'



నవతెలంగాణ - బంజారాహిల్స్

నిమ్స్ ఆస్పత్రిలో న్యూస్ కవరేజీ కోసం వచ్చే మీడియా ప్రతినిధులకు సమాచారం అందించేందుకు ఆదివారం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ ఎన్ లక్ష్మీ భాస్కర్ ఆధ్వర్యంలో అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్లు డాక్టర్ రాకేష్ నరిమేటి, డాక్టర్ చరణ్ రాజ్ మేడే, సెక్యూరిటీ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆస్పత్రి సెక్యూరిటీ సిబ్బందికి మీడియా నిర్వహణపై పలు సూచనలు చేశారు.

నిర్వహణ సేవలు 3 రకాలు..

1. రోగులు, సందర్శకులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ ప్రతినిధులతో కమ్యూనికేట్ చేసేటప్పుడు మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు.
2. ప్రింట్, ఎలక్ట్రానిక్ ప్రతినిధులు ఆస్పత్రిని సందర్శిస్తే, వారి గుర్తింపు (ఐడీ కార్డు) గౌరవంగా అడుగడం మరియు వాటిని నిర్ధారించుకోవడం. అనంతరం నిర్దేశించిన మీడియా పాయింట్ వద్ద వేచి ఉండమని సూచిస్తారని అన్నారు.
3. వచ్చిన ప్రతినిధుల వివరాలను ఆస్పత్రిలోని మీడియా కోఆర్డినేటర్‌తో సంప్రదించే అవకాశం కల్పిస్తారని తెలిపారు.

మీడియా పాయింట్ నిర్వహణ, బాధ్యతలు..

ఆస్పత్రిలో జరిగే ముఖ్య కార్యక్రమాలను ఎప్పటికప్పుడు తెలియజేయడంతో పాటు రోజు వారి కార్యక్రమాలను తెలియజేస్తారని అన్నారు. ముఖ్యమైన శస్త్ర చికిత్సలు చేస్తే సమగ్ర నివేదిక అందించడంతో పాటు పత్రిక మీడియా సమావేశాలను నిర్వహించడం ఉదయం 8 నుండి రాత్రి 8 గంటల వరకు జరిగే వివిధ రకాల సమాచారం మీడియా ప్రతినిధులకు తెలపడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్క మీడియా సమావేశం పీఆర్వో సత్య గౌడ్ మీడియా వరకు చేరవేస్తారని సూచించారు.

30న నల్గొండలో బహిరంగ సభ

సీపీఐ శతాబ్ది ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ- నాగోల్

భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల పోస్టర్‌ను నాగోల్‌లోని ఎస్ఏ డాంగే భవన్‌లో మోహన్ నగర్ సీపీఐ శాఖ కార్యదర్శి వి. మల్లేష్ ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ శతాబ్ది ఉత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరుపుకోవాలని కోరారు. ఈ నెల 30న నల్గొండలో జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జైపూర్ కాలనీ సెక్రెటరీ ఎండి బషీర్, ఉప్పల్ మండల్ కౌన్సిల్ సభ్యులు రాసమల్ల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

మన్నె సుబ్రమణ్యం సంతాప సభ



నవతెలంగాణ-కాప్రా

ప్రముఖ పారిశ్రామిక వేత్త, తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకుడు, జీనీయ హాస్పటల్ చైర్మెన్, సంఘ సేవకుడు మన్నె సుబ్రమణ్యం సంతాప సభ ఈసీఐఎల్ రౌండ్ బిల్డింగ్ పక్కన లైన్స్ క్లబ్ హాలులో డా.ఏఎస్‌రావు నగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు నాగభైరవ సాంబశివ రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు, తెలంగాణ తెలుగు దేశం పార్టీ మాజీ ఉపాధ్యక్షుడు టీజీకే మూర్తి, మాజీ కౌన్సిలర్ గడ్డమిది రాములు యాదవ్, మాజీ కౌన్సిలర్ ఎర్ర రమేష్ గౌడ్, ఉప్పల్ ఆడ హాక్ కమిటీ మెంబర్ మేడల రాంబాబు, ఉప్పల్ ఆడ హాక్ కమిటి మెంబర్ నీరుకొండ సతీష్ బాబు పాల్గొన్నారు.

ఢిల్లీలో రిపబ్లిక్ డే పారెడ్స్‌కు తెలంగాణ అమ్మాయి



నవతెలంగాణ-కల్చరల్

హైదరాబాద్‌లో మాతృశ్రీ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మూడవ సంవత్సరం చదువుతున్న శాల్మాలి కడెం ఎన్‌సిసిలో నేవీ వింగ్‌లో కొన్ని సంవత్సరాలుగా శిక్షణ పొందుతున్నారు. ఢిల్లీలో ఎర్ర కోట వద్ద జరుగునున్న రాబోయే రిపబ్లిక్ డే పరెడ్స్‌కు ఎన్‌సిసి నేవీ వింగ్ ఉత్తమ కేడర్‌గా ఎంపిక ఇన శాల్మిలీ తెలంగాణ నుంచి పాల్గొంటున్నారు. ఆమె కూచిపూడి నాట్యం రైఫిల్ షుటింగ్‌లోనూ ప్రావీణ్యం సంపాదించారు. క్రమ శిక్షణతో దేశ సేవలో పాలు పంచుకోవటమే తన ధ్యేయం అని చెప్పారు. తనను ప్రోత్సహిస్తున్న తల్లి తండ్రులకు, గురువులకు ధన్య వాదాలు తెలిపారు. శాల్మిలి తల్లి అరుణ డిఆర్‌డిఓలో శాస్త్రవేత్త, తండ్రి ప్రభాకర్ సుక్ష్మ సాంకేతిక శాఖలో అధికారి వీరు అదిలాబాద్ జిల్లా సిర్పూర్ కాగజ్నగర్ చెందిన వారు.

ఫాసిజంపై మొదలైన ఐదు రోజుల అంతర్జాతీయ సెమినార్..

- హాజరయిన వందలాది మంది యాక్టివిస్టులు, విద్యావేత్తలు, మేధావులు, విద్యార్థులు



నవతెలంగాణ-ముషీరాబాద్

ఫాసిజంపై అంతర్జాతీయ సెమినార్ ఆదివారం, బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'ఇరవై ఒకటవ శతాబ్దంలో ఫాసిజం కొనసాగుతున్న అంశాలు, నూతన లక్షణాలు, సమకాలీన శ్రామికవర్గ వ్యూహం' అన్న అంశంపై ఏడవ అంతర్జాతీయ అరవింద్ మెమోరియల్ సెమినార్ ప్రారంభమయింది. దేశవ్యాపితంగా వందలాది మంది యాక్టివిస్టులు, విద్యావేత్తలు, మేధావులు ఈ ఐదు రోజుల సెమినార్‌లో పాల్గొంటున్నారు. ఫాసిజానికి వ్యతిరేకంగా సమర్థవంత మైన శ్రామికవర్గ వ్యూహాన్ని రూపొందించే అంతిమ లక్ష్యంతో ఫాసిజానికి సంబంధించిన వివిధ అంశాలను అర్థం చేసుకోడానికి అరవింద్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మార్క్సిస్ట్ స్టడీస్ ఈ సెమినార్ నిర్వహిస్తోంది. దేశంలోని వివిధ రాష్ట్రాల నుండే కాక, యూఎస్, ఆస్ట్రేలియా, నేపాల్ వంటి దేశాల కార్యకర్తలు సమకాలీన ఫాసిస్టు వ్యతిరేక కమ్యూనిస్టు వ్యూహాన్ని చర్చించేందుకు ఈ సెమినార్‌లో పాల్గొంటున్నారు. ఆర్. రఘు, కేజీ రామచంద్ర రావు, శివానీ కౌల్, డా.నిఖిల్ ఏకడే, ప్రేమ్ ప్రకాష్ లతో కూడిన అధ్యక్షవర్గం మొదటిరోజు సభను నడిపించింది. కార్మిక వర్గ విముక్తి కోసం పోరాడుతూ ప్రాణాలు అర్పించిన యాక్టివిస్టులు అరవింద్ సింగ్, మీనాక్షిల చిత్రపటాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అరవింద్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షులు సత్యం వెర్మ ట్రస్ట్ ఉద్దేశ్యాలు, కార్యక్రమాల గురించి వివరించి సెమినార్ ను అధికారికంగా ప్రారంభించారు. సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం హైదరాబాద్ EFLUలో పీహెచ్ డీ చేస్తున్న శ్రీజ, ఫాసిజంపై సెమినార్ నిర్వహించడానికి గల కారణాలను వివరించారు. అనంతరం సెమినార్ లో ప్రధాన పేపర్ అయిన "21వ శతాబ్దంలో ఫాసిజం: కొనసాగుతున్న అంశాలు, నూతన (మారిన) లక్షణాలు"ను మార్క్సిస్టు సిద్ధాంతవేత్త, మజ్దూర్ బిగుల్ సంపాదకుడు, అభినవ్ సిన్హా ప్రెజెంట్ చేశారు. చారిత్రకంగా ఫాసిజం ప్రదర్శించిన ముఖ్యమైన లక్షణాలను ఈ పేపర్ చర్చించింది. ఇరవయ్యవ శతాబ్దంలో ఇటలీ, జర్మనీలలో ముందుకొచ్చిన ఫాసిజానికి, ఇరవై ఒకటవ శతాబ్దంలో కార్మికుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్న ఫాసిజానికి మధ్య ఉన్న తేడాను కూడా ఈ పేపర్ చర్చించింది. నిరంకుశ లక్షణాలున్న పాలనలన్నింటినీ ఫాసిజంగా గుర్తించే దురలవాటును, సర్వకాల సర్వావస్థలలోనూ ఫాసిజం ఒకే రకంగా ముందుకు వస్తుందని, చరిత్రలో కనబడిన లక్షణాలన్నీ ఉంటే తప్ప దానిని ఫాసిజం అనకూడదనే వాదనలను అభినవ్ విమర్శించారు. భారతదేశంలోని మోదీ-షాల పాలన నిస్సందేహంగా ఫాసిస్టు పాలనేనన్నారు. ఈ ప్రెజెంటేషన్ అనంతరం హాజరయిన వారు ఈ విషయంపై లోతైన చర్చ చేశారు. ఫాసిజం యొక్క వివిధ పార్శ్వాల గురించి చర్చ సాగింది.వచ్చే నాలుగు రోజులలో ఈ సెమినార్ లో మరో డజను పేపర్లపై చర్చ జరుగుతుంది. వాటిలో కొన్ని: భారతదేశంలో ఫాసిజం - ఆనంద్ సింగ్, ఫాసిజంపై మార్క్సిస్టు చరిత్ర రచన - శివానీ కౌల్, భారత కమ్యూనిస్టు ఉద్యమంలో ఫాసిజం గురించిన అవగాహనలు: విమర్శనాత్మక అధ్యయనం - సనీ సింగ్, నేటి ఫాసిజం: కళాసాహిత్యాల పాత్ర - కాత్యాయని, ప్రపంచ నయా ఫాసిజం, భారతదేశంలో ఆర్‌ఎస్‌ఎస్ ఫాసిజం: ఫాసిస్టు వ్యతిరేక కర్తవ్యం - పీజే జేమ్స్, పోస్ట్ కొలోనియల్ ఫాసిజం: క్రిటికల్, పోస్ట్ కొలోనియల్ సిద్ధాంత దృక్కోణం నుండి హిందూ జాతీయవాదం యొక్క విశ్లేషణ - నికోలాయ్ మెస్సర్ష్మిడ్ట్, ఆస్ట్రేలియాలో ఆల్ట్-రైట్ విజృంభణకు వ్యతిరేకంగా మా పోరాటం - జిసెల్ హనా (ఆస్ట్రేలియా, ఆసియా వర్కర్ లింక్స్, %ూూాబొ%). సుప్రీమ్ కోర్టు సీనియర్ లాయర్ కొలిన్ గోన్సాల్వెస్ కూడా రెండవ రోజు (డిసెంబర్ 30న) సెమినార్ కు హాజరయినవారిని ఉద్దేశించి, ఫాసిజం వృద్ధి: చట్టం, న్యాయవ్యవస్థ" అన్న అంశంపై ప్రసంగిస్తారు. వీరితో పాటు వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన అనేకమంది ప్రముఖ యాక్టివిస్టులు, మేధావులు, రచయితలు, ప్రొఫెసర్లు ఈ సెమినార్ లో పాల్గొంటున్నారు.సమాజంలోని మెజారిటీ ప్రజలు ఎదుర్కొంటున్న ముఖ్యమైన సవాళ్ళపై వామపక్ష మేధావి, రాజకీయ కార్యకర్త అరవింద్ సింగ్ స్మృతిలో అరవింద్ మెమోరియల్ ట్రస్ట్ సెమినార్లు నిర్వహిస్తుంది.

నూతన క్యాలెండర్‌ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం కుత్బుల్లాపూర్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే కె.పి వివేకానంద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తూ వస్తున్నామన్నారు. క్యాలెండర్‌లో తిథి, వార, నక్షత్రాలతో పాటు సామాన్యులకు నిత్యకృత్యాలైన అనేక విషయాలను క్యాలెండర్‌లో పొందుపరచడం అందరికి ఎంతగానో ఉపయోగమౌతుందని అన్నారు. బ్రాహ్మణులకు అన్ని విధాల తన సహాయ సహకారాలు ఎప్పుడూ అందిస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేని వేదపండితులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అడ్వకేట్ కమలాకర్, శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు గోగులపాటి కృష్ణమోహన్, శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ప్రధాన సలహాదారులు సీనియర్ రిపోర్టర్ సర్వేపల్లి రమేష్ కుమార్, రామదాసు పరశురామ శర్మ, గురజాడ రంగారావు, ఉపాధ్యక్షులు శ్రీరామ శర్మ చక్రధారి, గడ్డం రాంబాబు, కార్యదర్శులు పాల్గొన్నారు.

బీఎంఎస్ పెద్దలకు ధన్యవాదాలు



కె.ప్రకాశ్ బాబు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తనపై నమ్మకముంచి భారతీయ మజ్దూర్ సంఘ్ హైదరాబాద్ ఉపాధ్యక్షునిగా బాధ్యతలు అప్పగించిన బీఎంఎస్ పెద్దలకు కె.ప్రకాశ్ బాబు ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బీఎంఎస్ జిల్లా కమిటీ సమావేశంలో కె.ప్రకాశ్ బాబుకు బాధ్యతలు అప్పగించారు. ప్రకాశ్ బాబు ప్రస్తుతం ఈఎస్ఐసీ మెడికల్ కాలేజీ హాస్పిటల్ అండ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ (సనత్ నగర్) నర్సింగ్ ఆఫీసర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. ఆల్ ఇండియా బీఎంఎస్ ఉపాధ్యక్షులు ఎస్.మల్లేశం, ఎ.చెన్నకేశవ రావులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

తెలుగు యూనివర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలి

- వివిధ రాష్ట్రాల సీఎంలకు లేఖలు
- ప్రజాపక్త పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

తెలుగు యూనివర్సిటీకి అమరజీవి పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలని ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, ప్రధానమంత్రి నరేంద్రమోడీలకు విజ్ఞప్తి చేశారు. తెలుగు యూనివర్సిటీకి అమరజీవి పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డి, ప్రధాని మోడీలకు ప్రజా ఏక్తా పార్టీ అధినేత బోనాల శ్రీనివాస్ లేఖలు రాశారు. ఆదివారం గౌలిగూడలోని ప్రజా ఏక్తా పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరును తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పునరాలోచించాలని బోనాల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. తెలుగు యూనివర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరునే కొనసాగించేలా చొరవ చూపాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాసినట్లు తెలిపారు. అదే విధంగా పొట్టి శ్రీరాములు పేరునే తెలుగు యూనివర్సిటీకి కొనసాగించేలా తెలంగాణ ప్ర భుత్వానికి సూచనలు చేయాలని ఆంధ్రప్రదేశ్ సీఎం నారా చంద్రబాబు నాయుడు, భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్రుంలతో పాటు వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖలు రాసి, పొట్టి శ్రీరాములు పేరును కొసాగించేలా తెలంగాణ ప్రభుత్వానికి సూచనలు చేసి, తమకు మద్దతిచ్చి, తెలుగు యూనివర్సి టీకీ పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించేలా సహకరిం చాలని ఆయా రాష్ట్రాల సీఎంలను లిఖిత పూర్వకంగా కోరినట్లు ఆయన వెల్లడించారు. వీరితో పాటు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే, ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ, హైదరాబాద్ పార్లమెంట్ సభ్యులు అసదుద్దీన్ ఓవైసీ, ఎంఐఎం శాసనసభ్యులు అక్బరుద్దీన్ ఓవైసీలను కోరినట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ విషయంలో జోక్యం చేసుకుని తెలుగు యూనివర్సిటీకి అమరజీవి పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించేలా ఆదేశాలు జారీ చేసి, రెండు రాష్ట్రాల తెలుగు ప్రజలంతా ఒక్కటే అ చిన్న సంకేతాన్ని ప్రజల్లోకి పంపించాలని కోరారు. లేని పక్షంలో జనవరి 26న గౌలిగూడలోని ప్రజా ఏక్తా పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆమరణ దీక్షకు పూనుకుంటానని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

పెండింగ్ ఉపకార వేతనాల హార్డ్ కాపీలను సమర్పించాలి

- బీసీ సంక్షేమశాఖ అధికారి ఆశన్న



నవతెలంగాణ-సిటీబ్యూరో

వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ పరిధిలోని ప్రభుత్వ, ప్రయివేట్, యూనివర్సిటీ ఇంజనీరింగ్ నర్సింగ్, ఇతర కళాశాలలకు సంబంధించిన 2017-18 నుంచి 2024-25 సంవత్సరం వరకు పెండింగ్‌లోని ఉపకార వేతనాలకు సంబంధించిన హార్డ్ కాపీలను వచ్చే నెల 20లోగా జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కార్యాలయంలో సమర్పించాలని బీసీ వెల్ఫేర్ శాఖ ఉపసంచాలకులు జి.ఆశన్న తెలిపారు. ఫీజుకు సంబంధించి చాలా అప్లికేషన్లు నో ఫీజు అని ఈ- పాస్ వెబ్ సైట్‌లో చూపించడం జరుగుతుందని వివరించారు. కళాశాల యజమాన్యం వారు సదరు సంబంధిత డిపార్టుమెంట్ సోషల్ వెల్ఫేర్ గాని పీఎంయూ సెంటర్‌ను సంప్రదించి ఫీ స్ట్రక్చర్‌ను ఈ-పాస్‌లో అప్‌డేట్ చేయించుకోవాల్సిందిగా ఆయన తెలిపారు. ఫీజు స్ట్రక్చర్‌లో అప్‌డేట్ చేసుకోని కళాశాలలకు స్కాలర్‌షిప్, ట్యూషన్ ఫీజు రాకపోయినచో పూర్తి బాధ్యత సంబంధిత కళాశాల యాజమాన్యమే వహించాల్సి ఉంటుందని, శాఖ పరమైన చర్యలకు సంబంధిత పై అధికారుకు సిఫారసు చేయనున్నామని తెలిపారు.

అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవ పూజలు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

అయ్యప్ప స్వామి ఆలయంలో జరిగే వార్షికోత్సవ పూజలకు భక్తులందరూ పాల్గొని అయ్యప్ప స్వామి కృపా కటాక్షాలకు పాత్రులు కాగలరని వడ్డేపల్లి రాజేశ్వర్ రావు గురు స్వామి తెలిపారు. కూకట్‌పల్లి వివేకానంద నగర్‌లోని అయ్యప్ప స్వామి దేవస్థానం 33'వ వార్షికోత్సవం సందర్భంగా.. రెండవ రోజు ఆలయ ప్రాంగణంలో విశేష పూజలతో, ఆలయ వార్షికోత్సవ వేడుకలు జరగనున్నాయి. అందులో భాగంగా సోమవారం, శివపార్వతుల కళ్యాణ మహోత్సవం, సాయంత్రం 6 గంటలకు, కూకట్‌పల్లి పుర వీధుల్లో అయ్యప్ప స్వామి మహా ఊరేగింపు మహోత్సవం జరుపబడును. డిసెంబర్ 31'వ తేదీ మంగళవారం, ఉదయం 6 గం॥లకు లక్ష్మీ గణపతి హెూమం, అనంతరం ఆరాట్ ఉత్సవం తదుపరి18 కలశములతో మహా పడిపూజ పడిపూజ జరుగును. అనంతరం అన్నదాన కార్యక్రమము నిర్వహించబడుతుంది. కావున భక్తుల అందరూ, కుటుంబ సభ్యులతో కలిసి పూజా కార్యక్రమాలలో పాల్గొని, శ్రీ అయ్యప్ప స్వామి వారి తీర్థ ప్రసాదములు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు కాగలరని ఆయన కోరారు.



మంగళ వాయిద్యాలతో ప్రారంభమైన మొదటి రోజు పూజ

కూకట్ పల్లి శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానంలో 33వ వార్షికోత్సవం సందర్భంగా.. నిర్వహిస్తున్న పూజా కార్యక్రమంలో భాగంగా, శనివారం ఉదయం 8 గంటల నుండి మంగళవాయిద్య సంఘోషణ, వేదస్వస్తితో గోపూజ, భూతబలి, యాగశాల ప్రవేశం, విగ్నేశ్వర పూజ, శైవశుద్ధి మహా పుణ్యహవచనం, పంచగవ్య ఆరాధన, పంచగవ్య ప్రశాణ, రుత్విక్ వరుణ, దీక్ష కంకనాధారణ, అఖండ దీపారాధన, అస్త్రరాజార్చన, సూర్య నమస్కారాలు, రాజశ్యామల సహిత,వేదపండితుల మంత్రపుష్పములచే చండి పారాయణములు, నీరాజనాలతో వడ్డేపల్లి రాజేశ్వం రావు ఆధ్వర్యంలో, 33'వ వార్షికోత్సవ పూజా కార్యక్రమాలను మొదటి రోజు దిగ్విజయంగా నిర్వహించారు. పూజా కార్యక్రమంలో దీక్షలో ఉన్న అయ్యప్ప స్వాములు, స్వామి వారి భక్తులు తదితరులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి అయ్యప్ప స్వామి వారి కృపకు పాత్రులైనారు.



హైదరాబాద్‌లోని CGO టవర్స్‌లో శ్రీ సురభి అకాడమి ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ నిర్వహించిన 10వ అంతర్జాతీయ నృత్యం, సంగీతం ఉత్సవం 2024లో యువ కూచిపూడి కళాకారులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కల్చరల్

కార్మికుల,పేద ప్రజల పక్షపాతి పీజేఆర్



- సూపర్ మ్యాక్స్ పరిశ్రమ ఆవరణలో పిజెఆర్ 17వ వర్ధంతి వేడుకలు..

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కార్మికుల, పేద ప్రజల పక్షపాతి మాజీ మంత్రి, ఐఎన్‌టీయూసీ అగ్రనేత పి.జనార్ధన్ రెడ్డిని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోని.. అడుగుజాడల్లో నడుద్దామని కార్మికులు అన్నారు. ఈ మేరకు పీజేఆర్ 17వ వర్ధంతి పురస్కరించుకొని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, జీడిమెట్ల పారిశ్రామికవాడలో గల సూపర్ మ్యాక్స్ పరిశ్రమ ప్రాంగణంలో ఆయన చిత్రపటానికి కార్మిక నాయకులతోపాటు, కార్మికులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్మికులు మాట్లాడుతూ...సాధారణ కార్మికుడి నుంచి కార్మిక నాయకుడిగా, కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలక నాయకుడిగా, మంత్రిగా, సిఎల్పి నాయకులుగా ఎదిగి పేద ప్రజల,క ార్మికుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. కార్మిక యూనియన్ల అగ్ర నేతలు పి.జే.ఆర్, నాయిని నర్సింహా రెడ్డి లేని లోటు స్పష్టంగా కనిపిస్తుందన్నారు. వారు లేని లోటు తీర్చలేనిదని ఆవేదన వ్యక్తపరి చారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో అతి పెద్దదైన ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి ఐదుసార్లు శాసనసభ్యులుగా ఎన్నికై చరిత్ర సృష్టించారన్నారు. చివరి వరకు కార్మికులకు,పేదప్రజలకు సేవ చేయడంలో ముందు ఉండేవారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సూపర్ మాక్స్ కంపెనీ నాయకులు సురేష్, రాంచంద్రా రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, రాజు, గోపాల్ రెడ్డి, దయాకర్, సూర్య నారాయణ, కార్మిక సోదర, సోదరిమణులు పాల్గొన్నారు.

కాలనీల సమగ్ర అభివృద్ధికి కృషి



- కార్పొరేటర్ శ్రీదేవి యాదవ్

నవతెలంగాణ-చర్లపల్లి

కాలనీల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ అన్నారు. ఆదివారం చర్లపల్లి డివిజన్ పరిదిలోని నాగార్జుననగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ చేతుల మీదుగా రెడ్డి కాలనీలోని కార్పొరేటర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. నాగార్జుననగర్ కాలనీ అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాగార్జుననగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నామాలకృష్ణ, యావపురం రవి, కోశాధికారి బొల్లంపల్లి శ్రీకాంత్ రెడ్డి, ఉపాధ్యక్షులు కరుణాకర్ రెడ్డి, బి.గోపాల్ యాదవ్, మచ్చ మహేందర్ గౌడ్, సహాయ కార్యదర్శులు మేడిపల్లి శ్రీశైలం, సయ్యద్ సాదిక్, కార్యనిర్వాహక కార్యదర్శులు సాయి వివేక్, ఎండి జహంగీర్ పాష, సలహాదారులు పుప్పాల లక్ష్మీకాంతయ్య, రామిణి తిరుమలేష్ గుప్తా, తదితరులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
12
సోమవారం | డిసెంబర్ 30, 2024 | www.navatelangana.com

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



నవతెలంగాణ-అంబర్‌పేట

నగరానికి చెందిన ప్రభుత్వ హై స్కూల్, నల్లగుట్ట బాయ్స్ హై స్కూల్ రాణిగంజ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ను నర్సాపూర్ అటవీ ప్రాంతంలోని శ్రీ పలుగు మీద నల్ల పోచమ్మ దేవస్థానం స్వయంభు క్షేత్రం తల్లి మందిరాన్ని దర్శించుకుని అమ్మవారికి పూజలు నిర్వహించి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీఓ నగర అధ్యక్షులు ఎంబి కృష్ణ యాదవ్ మాట్లాడుతూ అందరూ సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. నందు ముదిరాజ్, వినోద్ కుమార్, సుధాకర్, అనిల్ చారి, కృష్ణ, అశోక్ కుమార్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వామపక్షాల నిరసన ర్యాలీ..



నవతెలంగాణ-ధూల్‌పేట్

కేంద్ర హౌం మంత్రి అమిత్ షా అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ చార్మినార్ వద్ద వామపక్షాల నిరసన ర్యాలీ నేడు నిర్వహిస్తున్నామని సీపీఐ(ఎం) జోన్ కార్యదర్శి చార్మినార్ అబ్దుల్ సత్తార్ తెలిపారు. వామపక్షాల పిలుపు మేరకు సీపీఐ(ఎం) సౌత్ కమిటీ ఆధ్వర్యంలో నేడు (సోమవారం) ఉదయం 11:30 గంటలకు శాలిబండ నుంచి చార్మినార్ వరకు ర్యాలీ ఉంటుందన్నారు. పార్లమెంట్ లో కేంద్ర హౌం మంత్రి అమిత్ షా ఓ ఉన్నతమైన స్థానంలో ఉంటూ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ను అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ ఈ ర్యాలీ నిర్వహించబోతున్నామని తెలిపారు. ఈ ర్యాలీకి సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ అబ్బాస్ హాజరవుతారన్నారు. జోన్‌లోని నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

'ఓఆర్ఆర్ టోల్ లీజు అక్రమాలపై ఎంక్వయిరీ చేయాలి'

- బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మెన్ రాచాల యుగంధర్ గౌడ్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ఫార్ములా ఈ రేస్ మాత్రమే కాదని, ఓఆర్ఆర్ టోల్ లీజుపై కూడా ఎంక్వయిరీ చేయాలని, ఐఆర్బీ ఇన్ ఫ్రా సంస్థకు 30 ఏండ్లు కట్టబెట్టింది పెద్ద స్కామే అని, ఎలక్టోరల్ బాండ్ల ద్వారా కోట్ల రూపాయల గోల్ మాల్ చేసిన బీఆర్ఎస్ నేత కేటీఆర్‌పై ఏసీబీ, ఈడీ కేసులు నమోదు చేసి దర్యాప్తు జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మెన్ రాచాల యుగంధర్ గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అనుమానాస్పద క్విడ్ ప్రోకో లావాదేవీలు, ప్రభుత్వ కార్యాలయ దుర్వినియోగం, మౌలిక సదుపాయాల ఒప్పందాలకు సంబంధించి తీవ్రమైన ఆర్థిక అక్రమాలు జరిగాయన్నారు. ఏప్రిల్ 27, 2023న, తెలంగాణ ప్రభుత్వం 30 సంవత్సరాల పాటు ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్)ను నిర్వహించడం కోసం ఐఆర్బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలపర్స్ లిమిటెడ్‌కు లీజుకు ఇచ్చిందన్నారు. గణనీయమైన బాండ్ కొనుగోళ్లను అనుసరించే అనుకూలమైన ప్రభుత్వ చర్యల దగ్గరి క్రమం క్విడ్ ప్రోకో ఏర్పాట్ల నమూనాను సూచిస్తుందని, ఇక్కడ ఆర్థిక సహకారాన్ని పొందేందుకు రాజకీయ ప్రభావం దుర్వినియోగం చేయబడిందని ఆరోపించారు. ఆర్థిక లాభాలకు బదులుగా నిర్దిష్ట కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రభుత్వ కార్యాలయాన్ని దుర్వినియోగం చేయడం జరిగిందని, మనీలాండరింగ్ నిరోధక చట్టం, 2002 (పీఎంఎల్ఏ) ప్రకారం నేరంగా పరిగణించబడే రాజకీయ విరాళాల ముసుగులో నిధుల స్వభావం, మూలాన్ని దాచే ప్రయత్నంచేశారన్నారు. ఈ లావాదేవీలు ప్రజల విశ్వాసం, పారదర్శకత నైతిక పాలన సూత్రాలను ఉల్లంఘించడం ప్రభుత్వ కార్యాలయ సమగ్రతను దెబ్బతీశాయన్నారు. ప్రజా జవాబుదారీతనం పాలనలో పారదర్శకత ఉండేలా, సమగ్ర దర్యాప్తు పూర్తయ్యే వరకు ఈ ఒప్పందాల తదుపరి అమలును నిలిపివేయాలని కోరారు. ఈ విషయంపై శనివారం సీఎం ఎ.రేవంత్ రెడ్డి, చీఫ్ సెక్రటరీ, ప్రిన్సిపల్ సెక్రటరీలకు ఫిర్యాదు చేశామన్నారు. ఫార్ములా ఈ రేస్‌పై ఫిర్యాదు చేసిన మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్ ఓఆర్ఆర్ టోల్ లీజు అక్రమాలపై ఏసీబీ, ఈడీలకు ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఫర్ సోషల్ ఆడిట్ అధ్యక్షులు గాలిగల్ల సాయిబాబా, జేఏసీ నాయకులు వెంకటేష్, మహేందర్ నాయుడు, దేవర శివ, గౌతమ్ శంకర్ గౌడ్, పూల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సమిష్టి కృషితో వారసత్వ సంపదను కాపాడుకోవాలి

డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ మూడు సాహిత్య, చారిత్రక పుస్తకాల ఆవిష్కరణ



నవతెలంగాణ-ముషీరాబాద్

డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ (డీహెచ్ఏటీ) 37వ హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో తన తాజా మూడు పుస్తకాలను విడుదల చేసింది. ఆదివారం సాయంత్రం ఎన్‌టీఆర్ స్టేడియంలో ఇందిరా పార్క్ ఎదురుగా ఉన్న 'సాదిక్ అలీ స్టేజ్' వద్ద నిర్వహించారు. డాక్టర్ మంగలి రాజేంద్ర (జిమ్బో) రచించిన కోర్టు తీర్పులో సాహిత్య మెరుపులు, డాక్టర్ ఏమని శివ నాగిరెడ్డి రచించిన తెలంగాణ శిథిలాలు.. వ్యథాభరిత కథనాలు, రామోజు హరగోపాల్ రచించిన తెలంగాణ చరిత్ర తొవ్వల్లో పుస్తకాలను వక్తలు ఆవిష్కరించారు. ఈ పుస్తకాలు తెలంగాణ సాహిత్యం, చరిత్ర, సంస్కృతిని విశదీకరిస్తూ, పాఠకుల మనసులను ఆకట్టుకునేలా రూపొందించబడ్డాయి. డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ (డీఏటీ) చైర్మెన్ వేదకుమార్ మణికొండ స్వాగతం పలికి పుస్తకాల్లోని చారిత్రక అంశాలను వివరించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రఘు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ (బీఆర్ ఏయూ) వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, ప్రముఖ ఎడిటర్ కె.రామచంద్ర మూర్తి హాజరయ్యారు. డాక్టర్ మంగరి రాజేంద్ర (జింబో), విశ్రాంత న్యాయమూర్తి, 'కోర్టు తీర్పులో సాహిత్య మెరుపులు' రచయిత పుస్తకాలను లాంఛనంగా ఆవిష్కరించి సమీక్షించారు. తెలంగాణ వారసత్వాన్ని పరిరక్షించడంలో వాటి పాత్రను నొక్కి చెబుతూ పుస్తకాల చారిత్రక, సాంస్కృతిక ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా గంట చక్రపాణి మాట్లాడుతూ మరుగున పడిన అనేక విషయాలను శివ నాగిరెడ్డి వెలుగులోకి తెస్తున్నారు. కోర్టులు ఫ్యూడల్ వ్యవస్థలో ఉన్నాయి. సాహిత్య అంశాలు జోడిస్తే ఇంకా మానవీయత ఉన్నట్టు ఉంటుందన్నారు. రాజేందర్ మాట్లాడుతూ తెలంగాణ చరిత్ర తొవ్వలో బుక్‌పై మాట్లాడారు. తెలంగాణకు న్యాయ చరిత్ర ఉంది. తెలంగాణ వచ్చినప్పటికీ చరిత్ర ఇంకా తెలుసుకోవాల్సింది. కోర్టుల్లో రాచరిక ఆనవాళ్లు ఇంకా ఉన్నాయని తెలిపారు. బీబీ భద్ర గిరీష్ మాట్లాడుతూతెలంగాణ ఏర్పడ్డ తర్వాత అనేక చారిత్రక ప్రాంతాలు సందర్శించామని ఇలాంటి వెలుగులోకి రావాలనే, వీటి ప్రాముఖ్యత తెలియజేయాలనేదే ఈ పుస్తక ఉద్దేశ్యమని తెలిపారు. యూట్యూబ్‌లో చెప్పేది చరిత్ర కాదు.. లైక్, షేర్స్ కోసం సోషల్ మీడియాలో చాలా చెప్తున్నారని అది చరిత్ర కాదని నిజమైన చరిత్ర వేరేలా ఉందన్నారు. శ్యాం సుందర్ మాటాడుతూ తెలంగాణ శిథిలాలు వ్యధ భరిత కథనాలపై మాట్లాడారు. సమిష్టి కృషితో తెలంగాణ వారసత్వ సంపదను కాపాడుకోవాలన్నారు. శివ నాగి రెడ్డి, హరగోపాల్ మాట్లాడుతూ తెలంగాణలో ఎన్నో ఊర్లు తిరిగి అధ్యయనం చేశామని ఏ ఊరు వెళ్ళినా చరిత్ర ఉందని భారత దేశంలో పట్టనంత చరిత్ర తెలంగాణలో ఉందన్నారు. మానవ వికాస చరిత్రలు అన్ని తెలంగాణలో ఉన్నాయని తెలిపారు.

317జీవోను రద్దు చేసి న్యాయం చేయండి



- 317 జీవో ది లోకేటెడ్ మెడికల్, హెల్త్ నర్సింగ్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు రాపోలు శేఖర్

నవ తెలంగాణ-ముషీరాబాద్

గత ప్రభుత్వం తీసుకు వచ్చిన చీకటి జీవో 317 ను వెంటనే రద్దు చేయాలని 317 జీవో ది లోకేటెడ్ మెడికల్, హెల్త్ నర్సింగ్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు రాపోలు శేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద 317 జీవో ది లోకేటెడ్ ఎంప్లాయిస్ టీచర్స్ జేఏసీ ఆధ్వర్యంలో సత్వర న్యాయ పోరాట దీక్ష నిర్వహించారు. ఈ దీక్షకు జేఏసీ అధ్యక్షులు రాపోలు శేఖర్ హాజరై మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకొచ్చినటువంటి చీకటి జీవో 317 వలన స్థానపురం చెందినటువంటి ఉద్యోగ ఉపాధ్యాయులను సీఎం రేవంత్‌రెడ్డి పీసీసీ ప్రెసిడెంట్‌గా ఉన్నప్పుడు 48 గంటల్లో స్థానభ్రంశం చెందినటువంటి 317 జీవో బాధ్యులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కావొస్తున్న ఇంతవరకు మాకు న్యాయం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ జీవో వలన భార్య పిల్లలు కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారని దూర ప్రయాణాలు చేసి ప్రమాదాలకు గురవుతున్నారని ఇప్పటికీ 34 మందికి పైగా ఉద్యోగులు మరణించడం జరిగిందన్నారు. సీఎం మానవ దృక్పథంతో ది లోకేటెడ్ ఎంప్లాయిస్ ఉద్యోగ ఉపాధ్యాయులను ప్రియా లోకేషన్ చేయాల్సిందిగా కోరారు. ఈ ధర్నాలో తెలంగాణ గవర్నమెంట్ నర్సస్ అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ రూడావత్ లక్ష్మణ్ మద్దతు తెలిపారు, స్టేట్ జనరల్ సెక్రెటరీ రాథోడ్ కిరణ్ కుమార్, వైట్ ప్రెసిడెంట్ ఎస్ హరి శంకర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ మండే గుజ్జుల సోమేశ్వర్, ఇందిరా కరిసే ఆలూరి మంజుల రేష్మ పూప్పుల పద్మ, తదితరులు పాల్గొన్నారు.

పాలెం గ్రామం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-ముషీరాబాద్

నాగర్ కర్నూలు జిల్లా పాలెం గ్రామం బిజినేపల్లి మండలం పాఠశాల, కళాశాల సంబంధించిన విద్యా సంస్థల పూర్వ విద్యార్థుల 36వ ఆత్మీయ సమ్మేళనం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలుగు యూనివర్సిటీ వైస్ చైర్మెన్ వెల్దండ నిత్యానందరావు, పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అధ్యక్షులు బుడ్డయ్య, కార్యదర్శి మోహన్ బాబు, ట్రెజరర్ అనుపట లక్ష్మి కాంత్, చీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ మల్లికార్జున్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజినేపల్లి మండలంలోని పాలెం గ్రామం అత్యంత వెనుకబడిన ప్రాంతమని 1964 లో అక్కడ ఎటువంటి పాఠశాలలు లేవన్నారు. అటువంటి సమయంలో సుబ్రహ్మణ్య శర్మ (సుబ్బయ్య) అనే మహా వ్యక్తి తన సొంత ఖర్చుతో గ్రామంలో అనేక పాఠశాలలు విద్యాలయాలు కళాశాలలు నిర్మించి ఎంతోమంది విద్యార్థులకు విద్యానందించారన్నారు. తన సొంత భూమిలో పండిన పంటతో విద్యార్థులకు ఉపాధ్యాయులకు పేదవారికి అన్నదానం చేసే వారిని ఆయన నిర్మించిన పాఠశాలలో చదివిన విద్యార్థులు ఎంతోమంది ఉన్నత శిఖరాలను అధిరోహించారన్నారు. వారి జ్ఞాపకార్థం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యా సంస్థలే కాకుండా ఆ గ్రామానికి టెలిఫోన్ సౌకర్యం పోస్ట్ ఆఫీస్ 32 పడకల ఆస్పత్రి నిర్మించి ఉచితంగా వైద్యం చేసే వారిని ఇండస్ట్రియల్ ఏరియా నిర్మించి ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. ఎన్నో దేవాలయాలు నిర్మించి వాటి ద్వారా వచ్చిన ఆదాయంతో ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించాలని కొనియాడారు. ఈ విద్యార్థుల ఆధ్వర్యంలో ఎంతో మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్ సౌకర్యాలు ఫీజులు ఆర్థికంగా ఆదుకుంటూ చేయూతనిందిస్తూ ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తున్నామన్నారు. ప్రొఫెసర్ రంగాచారి హనుమంత్‌రెడ్డి బ్రహ్మానందం, మదన్మోహన్ డి.ఎస్.పి దేవేందర్ డాక్టర్ ఏ శ్రీరాములు రెడ్ క్రాస్ సొసైటీ సీతఊ తదితరులు హాజరయ్యారు.

భవనంపై నుంచి పడి కార్మికుడు మృతి

- బాధిత కుటుంబానికి అండగా సీఐటీయూ
- కాంట్రాక్టర్‌తో మాట్లాడి కుటుంబానికి రూ.6.5లక్షల నష్టపరిహారం..
- రక్షణ చర్యలు తీసుకోకపోవడంతో ప్రమాదాలు..
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రావణ్‌కుమార్



సీఐటీయూ చొరవతో బాధిత కుటుంబానికి రూ.6.5లక్షల నష్టపరిహారం..

నవతెలంగాణ-ధూల్‌పేట్

పాతబస్తీ జీహెచ్ఎంసీ ఫలక్‌నుమా సర్కిల్-10 పరిధిలోని వట్టేపల్లిలో మున్సిపల్ అధికారులు రోడ్డు విస్తరణ పనులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా రోడ్డు పక్కన ఉన్న బిల్డింగులు కూల్చి వేస్తుండగా వనపర్తి ప్రాంతానికి చెందిన ఉషయ్య (40) ప్రమాదవశాత్తు భవనంపై నుంచి కింద పడి తీవ్ర గాయాలయ్యాడు. వెంటనే చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు.

వివరాల్లోకి వెళ్లితే..

వనపర్తి జిల్లా, భూత్పూర్ మండలం, ఎంగిచర్ల గ్రామానికి చెందిన ఉషయ్య, శేషమ్మలు బార్యభర్తలు. వీరికి ఒక కుమారుడు. బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి పాతబస్తీలోని రాజన్న బౌలిలో నివాసం ఉంటున్నాడు. అడ్డా కూలీలుగా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. జీహెచ్ఎంసీ రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండటంతో పనికోలోకి వెళ్లారు. పని చేస్తున్న క్రమంలో రోడ్డు పక్కన భవనం కూల్చివేస్తుండగా ప్రమాదవశాత్తూ పై నుండి కింద పడి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీఐటీయూ సౌత్ జిల్లా కార్యదర్శి శ్రావణ్ కుమార్ వెంటనే ఉస్మానియా ఆస్పత్రికి చేరుకుని కుటుంబాన్ని పరామర్శించారు. భవన నిర్మాణ కార్మికులు ప్రమాదవశాత్తు భవనంపై నుంచి కింద పడి మరణించిన కుటుంబానికి సదరు కాంట్రాక్టర్ వద్ద నుంచి సీఐటీయూ చొరవతో 6.5 లక్షల నష్టపరిహారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పని ప్రదేశంలో ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అధికారుల నిర్లక్ష్యంతో నగరంలో రోజు రోజుకూ ఇలాంటి ప్రమాదాలెన్నో జరుగుతున్నాయన్నారు. జీహెచ్ఎంసీ అధికారులు స్పందించాల్సిన పరిస్థితులున్న స్పందించకపోవడం సరికాదన్నారు. రక్షణ చర్యలు తీసుకోకపోవడంతో ఎంతోమంది అమాయకమైన భవన నిర్మాణ కార్మికులు ప్రమాదాలకు గురై బలైపోతున్నారన్నారు. ఇలా పని చేసుకుని పూట గడిచే కార్మికులు ప్రమాదాలతో ప్రాణాలు కోల్పోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వివిధ నిర్మాణాలు, రోడ్డు వెడల్పు జరుగుతున్న సందర్భాలలో భవనాలను కూల్చివేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకుని కూల్చి వేయాలన్నారు. తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఎంతోమంది అమాయకమైన కార్మికుల ప్రాణాలు రక్షించవచ్చన్నారు. ప్రభుత్వం ఆ దృష్టిగా పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం కార్మికులను ఆదుకునే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. భూత్పూర్ మండల భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఆంజనేయులు, రాములు, శంకర్ తదితరులున్నారు.

ఎంపీ అఖిలేష్ యాదవ్‌ను కలిసిన ఓబీసీ సెంట్రల్ కమిటీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

లక్నోలో ఓబీసీ సెంట్రల్ కామిటీ చైర్ పర్సన్ యము భాగ్యలక్ష్మి జాతీయా సమాజ్ వాది పార్టీ జతీయ అధ్యక్షులు, పార్లమెంట్ ఎంపీ అఖిలేష్ యాదవ్‌ను కలిసి ఓబీసీ డిమాండ్‌లుతో కూడిన మెమోరాండం అందజేశారు. ఈ సమస్యలపై ఎంపీ అఖిలేష్ యాదవ్ సానుకూలంగా స్పందించారని భాగ్యలక్ష్మి తెలియజేశారు. సందర్భంగా మాట్లాడుతూ.. ఓబీసీ మండల్ కమిషన సిఫారసుల అమలు కోసం సమాజ్ వాది పార్టీ మద్దతు తెలియజేస్తుందని తెలిపినట్లు చెప్పారు. మహిళా బిల్లు కోసం గత 15 ఏండ్లు పోరాటం చేసి సాధించామన్నారు. వచ్చే ఐదు యేండ్లలో సమాజ్ వాది పార్టీ పార్లమెంటులో ఓబీసీలకు కేటా యించిన మండల్ కమిషన్ సిఫారస్సులు అమలు చేయడంలో కీలక పాత్ర పోషిస్తే మరో పూలేగా భారత చరిత్రలో ఉంటారన్నారు. భారతదేశంలో అఖిలేష్ యాదవ్ ప్రధానమంత్రి అవుతారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. భారతదేశంలో నారిశక్తికి ప్రతిరూపంగా నిలబడే పార్టీ సమాజవాధి పార్టీ అన్నారు. అఖిలేష్ యాదవ్ భాగ్యలక్ష్మి సేవలను కొనియాడారు. గత 15 ఏండ్ల ఆమె పోరాట ఫలితమే బీసీ మహిళా బిల్లు అన్నారు. ఓబీసీ హక్కులకోసం భాగ్యలక్ష్మికి అన్ని విధాలుగా మద్దతుగా ఉంటామని తెలియ జేశారు. అఖిలేష్ యాదవ్‌కు భాగ్యలక్ష్మి ధన్యవాదాలు తెలియజేశారు. మార్చి 27న జరిగే బహిరంగా సభలో పాల్గొంటానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈకార్యక్రమంలో ఓబీసీ ప్రతినిధులు కులదీప్ సింగ్ యాదవ్, వీరేంద్ర కుశ్వ ఆశేఫ్ తదితరులు పాల్గొన్నారు.

'డా.రాంచందర్‌కు డా.ఏపీజే అబ్దుల్ కలాం హ్యుమానిటేరియస్ ఎక్సలెన్స్ అవార్డు'



నవతెలంగాణ-హిమాయత్ నగర్

తెలంగాణ సైకాలజిస్టుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మోతుకూరి రాంచందర్ ప్రతిష్టాత్మకమైన 'డా.ఏపీజే అబ్దుల్ కలాం హ్యూమానిటేరియస్ ఎక్సలెన్స్ అవార్డు-2024'ను అందుకున్నారు. 'యాక్ట్ నవ్' సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో ప్రముఖ డాక్టర్స్‌కు బెస్ట్ డాక్టర్ అవార్డు, డా.ఏపీజే అబ్దుల్ కలాం అవార్డులను ప్రధానం చేశారు. సమాజంలో మానసిక ఆరోగ్యం పెంపుదలకు గత కొన్ని ఏండ్లుగా విశేష కృషి చేస్తున్న డాక్టర్ మోతుకూరి రాంచందర్‌కు డా.ఏపీజే అబ్దుల్ కలాం అవార్డును ప్రధానం చేసి శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డా.మోతుకూరి రాంచందర్ మాట్లాడుతూ ఈ ప్రతిష్టాత్మక అవార్డు కౌన్సెలింగ్ సైకాలజిస్ట్, మనస్తత్వ శాస్త్రం, మానవతా సేవా రంగంలో చేస్తున్న విశేష కృషికి, అంకిత భావానికి, నిబద్ధతకు నిదర్శనమన్నారు. సమాజంలోని మానసిక రుగ్మతల నిర్మూలనకు అనేక అవగాహన కార్యక్రమలు నిర్వహించడం జరిగిందని, ఉచిత కౌన్సెలింగ్ అందచేయడం జరిగిందని గుర్తు చేశారు. ఈ అవార్డు తనకు మరింత బాధ్యతను పెంచిందని, నిరంతరం సైకాలజీ రంగ అభివృద్ధికి పాటుపడతానన్నారు. కొత్తగా ఎదుగుతున్న సైకాలజిస్ట్ లకు సరైన మార్గదర్శనం చేస్తానన్నారు. తన వృత్తిలో శ్రేష్ఠత కోసం నిరంతరం కృషి చేయడానికి ఈ అవార్డు అద్భుతమైన ప్రేరణ అని అన్నారు. ఈ అవార్డు అందచేసిన 'యాక్ట్ నవ్' సంస్థ అధ్యక్షులు డా.కె.యస్.మూర్తి, డా.హరిణిలకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



సరళ మైసమ్మ అమ్మవారిని దర్శించుకున్న అంబర్‌పేట నియోజకవర్గ సీనియర్ నాయకులు మోర శ్రీరాములు ముదిరాజ్, భోజరాజు, సాయి కుమార్, శ్రీనివాస్ యాదవ్, నాని, వెంకటేష్, రంగా తదితరులున్నారు.

నవతెలంగాణ-అంబర్‌పేట

'తెలంగాణ ఆటో డీలర్ అసోసియేషన్ ఏర్పాటు'

అఖిల భారత అసంఘటిత కార్మికులు, ఉద్యోగుల కాంగ్రెస్ (కేకేసీ) చైర్మెన్ కౌశల్ సమీర్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

రాష్ట్రంలో ఆటో డీలర్ల సమస్యల పరిష్కారం కోసం నూతనంగా 'తెలంగాణ ఆటో డీలర్ అసోసియేషన్' ను ఏర్పాటు చేసినట్లు అఖిల భారత అసంఘటిత కార్మికులు, ఉద్యోగుల కాంగ్రెస్ (కేకేసీ) చైర్మెన్ కౌశల్ సమీర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అసోసియేషన్ కేకేసీకి అనుబంధంగా పని చేస్తుందని చెప్పారు. రాష్ట్రంలో సీఎం ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై పలు యూనియన్ల నుండి కేకేసీలో చేరుతున్నారని ఆయన వెల్లడించారు. తెలంగాణ డీలర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా షేక్ అజీమ్, ప్రధాన కార్యదర్శిగా నారీ సత్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ గా షేక్ అజీజ్, జాయింట్ సెక్రటరీగా కమిసెట్టి యాదయ్య, ఉపాధ్యక్షుడిగా సయ్యద్ మోహిన్, సహాయ కార్యదర్శిగా మహమ్మద్ ఆయుబ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మహ్మద్ ఆసీఫ్, మహమ్మద్ రషీద్ లను ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. ఈ నియామకం ప్రతిపాదనను కేకేసీ జాతీయ చైర్మెన్ డాక్టర్ ఉదిత్ రాజ్ జీ ఆమోదించారని చెప్పారు. కాంగ్రెస్, కేకేసీ బలోపేతం కోసం అసోసియేషన్ నేతలు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేకేసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పింగిలి సంపత్ రెడ్డి, ఆటో విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కురుమ విద్యార్థులు విద్యారంగంలో రాణించాలి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్/ధూల్‌పేట్

తెలంగాణ రాష్ట్రంలో ఉన్న కురుమలు, విద్యారంగంలో అభివృద్ధి చెందాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షులు, ఎమ్మెల్సీ మల్లేశం కురుమ అన్నారు. ఆదివారం అఫ్జల్ గంజ్ లోని ముస్లిం పుల్ వంతెన వద్ద ఉన్న తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం భవనంలో రాష్ట్ర కురుమ సంఘం, కురుమ స్కిల్ ఎడ్యుకేషన్ కమిటీ, చైర్మెన్ వెంకటేశ్వర్ గీతా గోటి నేతృత్వంలో ఎస్ఎస్సి నుండి పీజీ మెడికల్ వరకు వివిధ విభాగాల్లో అత్యధిక మార్కులతో ప్రతిభ కనబరిచిన మెరిట్ విద్యార్థులకు మెరిట్ అవార్డు, నగదు పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎగ్గ మల్లేశం మాట్లాడుతూ విద్యార్థులు విద్యకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి, తాము కన్న కలలు సహకారం చేసే దిశగా ముందుకు సాగాలన్నారు. వివిధ విభాగాల్లో మెరిట్‌ను సాధించిన విద్యార్థులను ప్రోత్సహించేందుకుగాను ఈ అవార్డుల ప్రదానం చేయడం జరిగిందన్నారు. పేద కురుమ విద్యార్థులకు సీట్లను కేటాయించే విధంగా తమ వంతు కృషి చేస్తామన్నారు. అనంతరం చైర్మెన్ గీతా గోటి మాట్లాడుతూ విద్యార్థుల నుండి ఈ అవార్డుల ప్రధాన కార్యక్రమానికి విశేష స్పందన లభించిందన్నారు. కురుమ స్కిల్ ఎడ్యుకేషన్ కమిటీ, ప్రతినిధుల సహకారంతోనే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగిందన్నారు. త్వరలో జాబ్ మేళా కూడా నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రెక్కల మురళీధర్, కోశాధికారి, చిగు మల్ల, రాఘవేందర్, గౌరవ సలహాదారులు, కట్ట మల్లేశం, దేవర రాజేశ్వర్, కొలుపుల నరసింహ, నర్స విశాల్, దేవర కృపాకర్, మా ఊరి రాజేందర్, సి.కిషోర్, చిందం విక్రమ్, మందుల నవీన్, ఏ.సాయి కాంత్, కాలే, అమర్నాథ్, రాష్ట్ర యూత్ అధ్యక్షులు తూముకుంట అరుణ్ కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ముజీబ్ ఆధ్వర్యంలో మన్మోహన్‌సింగ్‌కు నివాళి



నవతెలంగాణ- సిటీబ్యూరో

తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం హైదరాబాద్ జిల్లా కార్యాలయంలో తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్. ఎస్. ఎం. హుస్సేనీ (ముజీబ్), జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కుమార్‌తో కలిసి మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ మరణంపై విచారం వ్యక్తం చేస్తూ.. ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డా.ముజీబ్ మాట్లాడుతూ నేడు భారత దేశం ప్రపంచంలోనే ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవి ంచిందంటే దానికి కారణం మన్మోహన్ సింగ్ అని, తొంభైవ దశకంలో వేసిన పునాదులని, అనుక్షణం దేశం కోసం పరితపించిన దేశభక్తుడన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షుడు కే.ఆర్.రాజ్ కుమార్, ఉపాధ్యక్షుడు కుర్రాడి శ్రీనివాస్, సభ్యులు ఖాలెద్ అహ్మద్, వైదిక్ శస్త్ర, శ్రీధర్, ముఖీమ్ ఖురేషి, కేంద్ర సంఘం సభ్యులు శంకర్, ఉస్మానియా మెడికల్ కాలేజీ సభ్యులు ఎం.ఏ. రహీం, ఎన్ అధ్యక్షులు రాజు, ఎక్సైజ్ సభ్యులు కృష్ణ, గ్రంథాలయ సంస్థ సభ్యులు అయోధ్య, వర ప్రసాద్, మహేందర్, సుఖేష్ తదితరులు, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ సభ్యులు నజీర్ పి ఆర్ ఓ జహంగీర్, ఏపీఆర్ ఓ మహమ్మద్ వహీద్, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ బలోపేతానికి స్కూటో కృషి

- స్కూటో ఆవిర్భావ సభలో వక్తలు



నవతెలంగాణ-ముషీరాబాద్

విద్యారంగం ఎదుర్కొంటున్న అధ్యాపకుల సమస్యలపై పోరాటం చేయడానికి స్కూటో ఆవిర్భవించిందని రాజయ్య లాంటివాళ్ళు చట్టసభలకు ప్రధానంగా శాసనమండలికి పంపవలసిన అవసరం ఎంతైనా ఉందని స్కూటో ఆవిర్భావ సభలో వక్తలు తెలిపారు. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో స్కూల్స్, కాలేజెస్, యూనివర్సిటీస్ టీచర్స్ ఆర్గనైజేషన్స్- జేఏసీ ప్రొఫెసర్ మురళి మనోహర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ మురళి మనోహర్, ప్రొఫెసర్ ఎస్.సింహాద్రి, ప్రొఫెసర్ గడ్డం మల్లేశం ప్రొఫెసర్ కొండా నాగేశ్వరరావు హాజరై ఈ సందర్భంగా మాట్లాడుతూ సేవ్ కాన్స్టిట్యూషన్, సేవ్‌డెమోక్రసీ, సేవ్ గవర్నమెంట్ ఎడ్యుకేషన్ నినాదాల ప్రాతిపాదికన స్కూటో జేఏసీ ఆవిర్భవించిందన్నారు. గత పది సంవత్సరాలుగా విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలపై అదేవిధంగా విద్యా వ్యవస్థలో పనిచేస్తున్న అధ్యాపకుల సమస్యలపై పోరాటం చేస్తామని తెలిపారు. భవిష్యత్తులో విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి స్కూటో కృషి చేస్తుందన్నారు. దీనిలో భాగంగానే గత నాలుగు దశాబ్దాలుగా విద్యారంగ సమస్యల పైన ఉపాధ్యాయుల సమస్యలపైన అవిరలంగా కృషి చేస్తున్న ప్రొఫెసర్ వెంకట రాజయ్యను త్వరలో జరగబోయే నల్గొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నిలబెట్టి గెలిపించుకోవాలని ఏకగ్రీవంగా తీర్మానించనైనది. స్కూటో ప్రతినిధులు బలపరచడానికి ప్రధాన కారణం ప్రొఫెసర్ వెంకట రాజయ్య నాలుగు దశాబ్దాలుగా ఉపాధ్యాయునిగా, సామాజిక, రాజకీయ ఉద్యమకారునిగా అదేవిధంగా రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమ నేపథ్యం ఉన్న వ్యక్తిగా మూడు జిల్లాల ఉపాధ్యాయులకు సుపరిచితుడైన వ్యక్తిగా పరిగణలోకి తీసుకొని స్కూటో ఏకగ్రీవంగా తీర్మానించినది. రాజయ్య లాంటివాళ్ళు చట్టసభలకు ప్రధానంగా శాసన మండలికి పంపవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాగుల వేణు యాదవ్, డాక్టర్ జీవన, ఉపాధ్యాయులు బి.మల్లయ్య, సామాజిక కార్యకర్తలు వై. సందీప్, మాజీ ఏజీపీ హైకోర్టు జక్కుల కృష్ణ యాదవ్ అడ్వకేట్ డీ ప్రవీణ్ పాల్గొన్నారు.

2024... ఎన్నో ఆనందాలను.. కొన్ని చేదు జ్ఞాపకాలను మనకు మిగిల్చి వెళ్లిపోతోంది. నూతన ఉత్సాహంతో మరో ఏడాదిలోకి అడుగుపెట్టబోతున్నాము. తమ శక్తిసామర్థ్యాలను నిరూపించున్న మహిళలు మన మధ్య ఎందరో ఉన్నారు. రాబోయే కొత్త ఏడాదికి మహిళా సాధికారతకు వారు చిహ్నంగా నిలిచారు. 2024 ఏడాదికి గాను హార్పర్స్ బజార్ ఉమెన్ ఆఫ్ ది ఇయర్ ఈవార్డు అందుకున్న వారి పరిచయాలు క్లుప్తంగా...

సాధికారత దిశగా ఆమె అడుగులు 2024





నటాషా పూనావాలా

నటాషా పూనావాలా.. సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్. అలాగే నెదర్లాండ్స్‌లోని పూనావాలా సైన్స్ పార్క్ డైరెక్టర్. ఆమె ప్రస్తుతం సీరం లైఫ్ సైన్సెస్ చైర్‌పర్సన్‌గా పనిచేస్తున్నారు. ఆమె మాగ్జిమలిస్ట్, ప్రయోగాత్మక ఫ్యాషన్ ఎంపికలతో గ్లోబల్ ఫ్యాషన్ ఐకాన్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రపంచ వేదికపై సమకాలీన గాంభీర్యంతో కోచర్‌ను విజయవంతంగా విలీనం చేశారు. అవాంట్-గార్డ్ స్టైల్‌కు ప్రసిద్ధి చెందిన ఆమె మెట్ గాలా, కెరింగ్ ఫౌండేషన్ గాలా 2024తో సహా ప్రతిష్టాత్మక రెడ్ కార్పెట్ ఈవెంట్‌లలో రెగ్యులర్‌గా పాల్గొంటున్నారు.



శకుంతల కులకర్ణి, కళాకారిణి

వినూత్న శిల్పాల ద్వారా స్త్రీ రూపాన్ని చెక్కుతూ శక్తివంతమైన అన్వేషణలకు ప్రసిద్ధి చెందిన కళాకారిణిగా శంకుతలకు మంచి గుర్తింపు ఉంది. ఈ ఏడాది పారిస్ ఫ్యాషన్ వీక్‌లో ఈమె చెరకు శిల్పాలు డియోర్ ప్రదర్శనకు నేపథ్యంగా ప్రదర్శించబడ్డాయి. అక్కడ ఈమె కళాఖండాలు అందరి దృష్టిని ఆకర్షించాయి. అంతేకాదు విస్తృతమైన ప్రశంసలు సైతం అందుకున్నాయి. వెనిస్ బినాలేలోని ఇండియన్ పెవిలియన్, ఆర్ట్ బాసెల్ వద్ద ఆర్ట్ అన్‌లిమిటెడ్, ఢాకా ఆర్ట్ సమ్మిట్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా ప్రతిష్టాత్మక ప్రదర్శనలలో ఆమె తన కళను ప్రదర్శించారు.

నీర్జా బిర్లా
ఆదిత్య బిర్లా ఎడ్యుకేషన్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు



ఆదిత్య బిర్లా ఎడ్యుకేషన్ ట్రస్ట్ ద్వారా విద్య, మానసిక ఆరోగ్య అవగాహన, మహిళా సాధికారతకు నిర్జా ఎంతో కృషి చేస్తున్నారు. ఆదిత్య బిర్లా వరల్డ్ అకాడమీ, ఆదిత్య బిర్లా ఇంటిగ్రేటెడ్ స్కూల్, నలంద అండ్ ఆదిత్య బిర్లా ఎడ్యుకేషన్ అకాడమీ వంటి సంస్థల్లో ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. ఆమె జీ20 ఎంపవర్ ఇండియా 'ఉమెన్ అచీవర్ అవార్డ్ 2023', సోషల్ లీడర్‌షిప్ కోసం 'గోల్డెన్ పీకాక్ అవార్డ్ 2023' వంటి అనేక అవార్డులు అందుకున్నారు.

గీతాంజలి శ్రీ, రచయిత



గీతాంజలి శ్రీ రాసిన 'టోంబ్ ఆఫ్ సాండ్" (హిందీ ఒరిజినల్‌లో రిట్ సమాధి) అనే నవల 2022 అంతర్జాతీయ బుకర్ ప్రైజ్ విజేతగా నిలిచింది. ఈ నవల అనువాదంలో మహిళలకు ఇచ్చే వార్విక్ బహుమతిని కూడా గెలుచుకున్నారు. హిందీ నవలా రచయిత్రి, కథా రచయిత్రి గీతాంజలి తన ఉత్తేజకరమైన కథలతో పాఠకులను కట్టిపడేస్తున్నారు. ఇప్పటి వరకు ఆమె ఆరు నవలలు, ఐదు కథల సంకలనాలు వెలువరించారు. గీతాంజలి రచనలు అనేక భారతీయ, విదేశీ భాషలలోకి అనువదించబడ్డాయి.

అనిత ష్రాఫ్ అడాజానియా, ఫ్యాషన్ స్టైలిస్ట్



అనైతా ష్రాఫ్ అడజానియా భారతదేశ ఫ్యాషన్ కమ్యూనిటీలోని ప్రముఖ స్వరాలలో ఒకరు. ప్రముఖ స్టైలిస్ట్, క్రియేటివ్ డైరెక్టర్, అడాజానియా తన ట్రెండ్‌సెట్టింగ్ విజన్, ఎడిటోరియల్ మెరుపుతో భారతీయ ఫ్యాషన్ యొక్క ప్రకృతి దృశ్యాన్ని ఆకృతి చేశారు. కరీనా కపూర్, ప్రియాంక చోప్రా, సోనమ్ కపూర్, ఇషా అంబానీ, నటాషా పూనావల్లా వంటి ప్రముఖ బాలీవుడ్ నటులను అద్భుతంగా తీర్చిదిద్దారు.

అవంతి నాగరత్, మోడల్



గ్లోబల్ ఫ్యాషన్ ప్రపంచంలో మంచి గుర్తింపు ఉన్న పేరు అవంతి. రీతు కుమార్, మనీష్ మల్హోత్రా వంటి ప్రఖ్యాత భారతీయ ఫ్యాషన్ డిజైనర్లతో మొదలు, 2022లో మిలన్ ఫ్యాషన్ వీక్‌లో వెర్సెస్ కోసం ప్రారంభించిన మొదటి భారతీయ మోడల్‌గా అవంతి ఫ్యాషన్ పరిశ్రమలో అడ్డంకులను బద్దలు కొట్టారు. చానెల్, బుర్బెర్రీ, డియోర్ వంటి అంతర్జాతీయ రన్‌వేలపై ఆమె భారతదేశానికి ప్రాతినిధ్యం వహించారు.



గౌరీ ఖాన్, ఇంటీరియర్ డిజైనర్, వ్యాపారవేత్త

శుద్ధి చేసిన, విలాసవంతమైన డిజైన్ సెన్సిబిలిటీలకు ప్రసిద్ధి చెందిన వ్యక్తి గౌరీ ఖాన్. 2010లో ఈమె డిజైన్స్ (GKD)ని ప్రారంభించారు. ఇది ఒక లగ్జరీ ఇంటీరియర్ డిజైన్ సంస్థ. ఇది భారతదేశ అత్యంత ప్రతిష్టాత్మకమైన సంస్థలలో ఒకటిగా మారింది. అనేక ప్రముఖ వ్యక్తులు, బాలీవుడ్ సెలబ్రిటీల కోసం తన ప్రత్యేకమైన కళతో, సమకాలీన శైలితో అత్యాధునిక గృహాలు, వాణిజ్య స్థలాలను డిజైన్ చేస్తున్నారు.



ఇషా అంబానీ

దూరదృష్టి గల వ్యవస్థాపకురాలు. అలాగే సుస్థిరత కోసం కృషి చేస్తున్న న్యాయవాది ఇషా అంబానీ. రిలయన్స్ రిటైల్‌కు నాయకత్వం వహిస్తున్నారు. దాని విస్తరణను కొత్త వర్గాలు, భౌగోళికాలు, ఫార్మాట్‌లలోకి నడిపించారు. రిలయన్స్ రిటైల్ కోసం డిజిటల్ ఫుట్‌ప్రింట్ విస్తరణకు ఆమె నాయకత్వం వహించారు. ఇ-కామర్స్ బిజినెస్ అజియో, ఆన్‌లైన్ బ్యూటీ ప్లాట్‌ఫారమ్ తీరా వంటి కొత్త ఫార్మాట్‌లను ప్రారంభించారు. రిలయన్స్ రిటైల్, జియో ప్లాట్‌ఫారమ్‌ల వృద్ధిలో ప్రభావవంతమైన ఇషా అంబానీ రిటైల్, టెలికాం రంగాలను మార్చారు. ఆమె నాయకత్వంలో రిలయన్స్ రిటైల్ ఆసియాలోని టాప్-10 రిటైలర్‌లలో ఒకటిగా, గ్లోబల్ టాప్ 100 రిటైలర్‌ల జాబితాలో ఉన్న ఏకైక భారతీయ రిటైలర్‌గా గుర్తింపు తెచ్చుకుంది.

హౌస్ ఆఫ్ మిసు: మితాలీ సాగర్, సుమ్మియా పత్నీ, కంటెంట్ సృష్టికర్తలు



హౌస్ ఆఫ్ మిసు, మితాలి సాగర్, సుమ్మియా పత్నీ తమ సృజనాత్మకమైన కంటెంతో అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నారు. ఫ్యాషన్ ప్రపంచంలో ప్రస్తుతం ఆధునిక అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక కంటెంట్‌ను అందిస్తున్నారు. 2017లో పారిస్ ఫ్యాషన్ వీక్‌కు హాజరైన మొదటి భారతీయ ప్రభావశీలులు వీరు. డియోర్, లూయిస్ విట్టన్, చోపార్డ్, బీఎండబ్ల్యూ వంటి కొన్ని గౌరవనీయమైన లగ్జరీ బ్రాండ్‌ల కలిసి పని చేసే అవకాశం వీరికి లభించింది.

గంటకు 450 కిలోమీటర్లు..

(మొదటిపేజీ తరువాయి)

400 కిలోమీటర్ల వేగాన్ని అందుకొంది. ఈ రైల్ డిజైన్ చాలా నాజుగ్గా, బుల్లెట్ షేప్ ముక్కుతో ఉంటుందని చైనా రైల్వే వెల్లడించింది. ఇది అత్యధికంగా గంటకు 450 కిమీ వేగాన్ని అందుకోగలదని తెలిపింది. ఇది వినియోగంలోకి వచ్చే నాటికి ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన వాణిజ్య రైలుగా నిలుస్తుందని చెప్పింది. ఈ ట్రైన్ బీజింగ్ నుంచి షాంఘైకి కేవలం 2.5 గంటల్లోనే ప్రయాణించగలదు. గతంలో ఈ ప్రయాణానికి నాలుగు గంటల సమయం పట్టేది.

చైనాలో అతిపెద్ద హైస్పీడ్ రైలు వ్యవస్థ

ప్రస్తుతం చైనాలోని హైస్పీడ్ రైలు వ్యవస్థ అతిపెద్దది. మొత్తం 45,000 కిలోమీటర్ల మేరకు విస్తరించింది. ఈ ఏడాది సెప్టెంబర్‌లోనే చైనా ప్రభుత్వరంగ రైల్వే సంస్థ సీఆర్450 ప్రొటోటైప్‌ను డిసెంబర్‌లో పరీక్షిస్తామని పేర్కొంది.

14వ పంచవర్ష ప్రణాళికలో భాగంగా ఈ ప్రాజెక్టు

చైనా 14వ పంచవర్ష ప్రణాళికలో భాగంగా ఈ ప్రాజెక్టును చేపట్టారు. దీని కింద హైస్పీడ్ రైళ్లు, వంతెనలు, ట్రాక్‌లు, సొరంగాలు నిర్మించనున్నారు.


సీఆర్ 400 మోడల్ కంటే 12 శాతం తక్కువ

ఈ రైలు బాడీ బరువు కేవలం 10 టన్నులు మాత్రమే. ప్రస్తుతం సీఆర్400 మోడల్ కంటే ఇది 12 శాతం తక్కువ. విద్యుత్తును కూడా 20 శాతం తక్కువగానే వినియోగించుకుంటుందని అధికారులు చెబుతున్నారు. ఇక గత మోడల్ కంటే అదనంగా 50 కిలోమీటర్లు అధిక వేగంతో ప్రయాణించగలదు. ఇంజిన్ పరీక్షల్లో ఇది అత్యధికంగా గంటకు 453 కిమీ వేగాన్ని అందుకుంది.

అమెరికాకు దీటుగా జె-36 యుద్ధ విమానాన్ని ఆవిష్కరణ

చైనా రెండ్రోజుల క్రితమే ఆరో తరానికి చెందినదిగా చెబుతున్న జె-36 యుద్ధ విమానాన్ని ఆవిష్కరించింది. సిచువాన్ ప్రావిన్స్‌లోని చెంగ్డూలో దీనిని అభివృద్ధి చేసినట్టు భావిస్తున్నారు. దీనికి మూడు ఇంజిన్లు అమర్చినట్లు భావిస్తున్నారు. ఇది అమెరికాకు చెందిన ఎఫ్-35, ఎఫ్-22 రాప్టర్లను సవాలు చేయగలదని చెబుతున్నారు.

కన్హా శాంతివనంలో సీఎం రేవంత్‌రెడ్డి



(మొదటిపేజీ తరువాయి)

కన్హా శాంతివనం ఆవరణలోని ట్రీ కన్జర్వేషన్ సెంటర్‌ను సందర్శించారు. వివిధ రకాల వంగడాల అభివృద్ధి, మొక్కల పెంపకానికి సంబంధించిన పద్ధతులను శాంతి వనం నిర్వాహకులు వివరించారు. ఇక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రెయిన్ ఫారెస్ట్‌ను సీఎం సందర్శించారు. ధ్యానకేంద్రం వద్ద మొక్కను నాటారు. ధ్యానకేంద్రాన్ని సందర్శించారు. అనంతరం కన్హ శాంతివనం వ్యవస్థాపకులు దాజీతో సీఎం భేటీ అయ్యారు. అక్కడ నిర్వహించే కార్యక్రమాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీఎం వెంట సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, శ్రీనివాసరాజు, ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకరయ్య, కాలే యాదయ్య తదితరులు ఉన్నారు.

సర్కారు కల సాకారమవుతోంది : సీఎం ట్వీట్

రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక రైజింగ్ తెలంగాణ కల సాకారమవుతున్నదని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) సాధనలో రాష్ట్రం గర్వించదగిన వృద్ధిని సాధించిందనీ, ప్రమాణ స్వీకారం చేసిన మొదటి నెల నుండే దావోస్, అమెరికా, దక్షిణ కొరియా వంటి దేశాల్లో పర్యటించి పెట్టుబడుల సాధన కోసం చేసిన ప్రయత్నాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని పేర్కొన్నారు. విదేశీ పెట్టుబడుల్లో 2023 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మాసం వరకు పోల్చితే, 2024 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు అద్భుత లక్ష్యాలు సాధించామన్నారు. ఈ కాలంలో రూ.12,864 కోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల సాధనతో 33 శాతం వృద్ధిని నమోదు చేశామనీ, రాష్ట్రంలో యువత ఉపాధి, ఉద్యోగ కల్పనకు ప్రజా ప్రభుత్వం బలమైన సంకల్పంతో పని చేస్తుందనడానికి ఇది నిదర్శనమన్నారు. ఈ పురోగతి సాధనలో సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

నేరాలు పెరిగాయి కానీ..

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నదనీ, శాంతియుత వాతావరణంలోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని భావిస్తున్న ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగానే పోలీసు శాఖ తగిన చర్యలు తీసుకుంటున్నదని ఆయన చెప్పారు. ముఖ్యంగా, మాదక పదార్థాల నిరోధంపై టీజీ న్యాబ్ కఠినంగా వ్యవహరిస్తూ స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపుతున్నదని తెలిపారు. గతేడాది మాదక పదార్థాల నేరానికి సంబంధించి 1360 కేసులు నమోదు కాగా ఈ ఏడాది నవంబర్ నాటికి 1960 కేసులు నమోదయ్యాయని ఆయన తెలిపారు. అయితే, గంజాయితో పాటు ఇతర మాదక పదార్థాల రవాణాదారులను అరెస్ట్ చేసి రూ.142 కోట్ల విలువైన డ్రగ్స్‌ను పట్టుకున్నామని జితేందర్ చెప్పారు. ఇందులో 42 టన్నుల గంజాయి ఉన్నదని అన్నారు. సైబర్ నేరాలకు సంబంధించి సైబర్ సెక్యూరిటీ బ్యూరో (సీఎస్‌బీ) సైతం ఈ ఏడాది గణనీయమైన ఫలితాలను సాధించిందనీ, సైబర్ నేరస్థుల నుంచి స్వాధీనపర్చుకున్న రూ.180 కోట్లను బాధితులకు పంపిణీ చేశామన్నారు. సైబర్ నేరాలకు సంబంధించి అన్ని జిల్లాల పోలీసులు, కేంద్రం, ఇతర రాష్ట్రాలతో సమన్వయమవుతూ నేరస్థులకు ముకుతాడు వేస్తున్నామని ఆయన తెలిపారు. వచ్చే జనవరిలో సైబర్ నేరాలపై ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

శాంతి భద్రతల పరంగా వికారాబాద్, జైనూర్‌లలో రెండు మత కలహాలకు సంబంధించిన ఘటనలు మినహా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ ఈ ఏడాది చోటు చేసుకోలేదని ఆయన చెప్పారు. ముఖ్యంగా, గణేశ్ నిమజ్జనోత్సవం వంటి ఉత్సవాలకు జియో ఇన్ఫర్మేషన్ సిస్టం (జీఐఎస్) తరహా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో గణేశ్ మండపాలు మొదలుకొని సామూహిక నిమజ్జనం పూర్తయ్యే వరకూ తీసుకున్న జాగ్రత్తలు మంచి ఫలితాలనిచ్చాయనీ, దీనికి గానూ అంతర్జాతీయ డిజిటల్ ఇంజినీరింగ్ అవార్డును కూడా పొందటం జరిగిందని ఆయన తెలిపారు. ఈ ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల పర్వం సైతం ప్రశాంతంగా ముగిసేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు.

హత్యలు, లైంగికదాడులు, దోపిడీ, దొంగతనాలు, కిడ్నాప్‌లు కొంత పెరిగాయని అంగీకరిస్తూనే.. వాటి ప్రభావం తక్కువేనని ఆయన అన్నారు. ముఖ్యంగా, శిక్షలు పడితేనే నేరాలు తగ్గుముఖం పడతాయనే లక్ష్యంతో పని చేస్తూ ఈ ఏడాది 36 శాతం శిక్షల రేటును సాధించామని ఆయన తెలిపారు. ఇందులో, ముఖ్యంగా మూడు కేసులలో నిందితులకు ఉరి శిక్షను, మరో 215 కేసులలో యావజ్జీవ కారాగార శిక్షలను సాధించామని ఆయన చెప్పారు. అదేవిధంగా, పోక్సో కేసులలో సైతం 87 మంది నేరస్థులకు యావజ్జీవ శిక్షలు పడేలా చేశామని వివరించారు.

కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన క్రిమినల్ చట్టాలపై అధికారులు మొదలుకొని కిందిస్థాయి సిబ్బంది వరకు అవగాహనను కల్పించే కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ఈ ఏడాది రాష్ట్రంలో జరిగిన రెండు వేర్వేరు ఎన్‌కౌంటర్‌లలో 14 మంది మావోయిస్టులు మరణించారనీ, 41 మంది మావోయిస్టులను అరెస్ట్ చేశామనీ, 87 మంది ప్రభుత్వానికి లొంగిపోయారనీ, వారి నుంచి పెద్ద ఎత్తున ఆయుధాలనూ స్వాధీనపర్చుకున్నామని ఆయన చెప్పారు. రోడ్డు ప్రమాదాలు కొంతమేర పెరిగినప్పటికీ.. రోడ్డు ప్రమాదాల్లో మరణాల సంఖ్య కొంత మేర తగ్గిందని డీజీపీ అన్నారు. అయితే, రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్న ప్రదేశాలను గుర్తించి వాటి నివారణ చర్యలు చేపట్టం ద్వారా ప్రమాదాల్లో మృతుల సంఖ్య తగ్గుతున్నదని ఆయన వివరించారు. కొందరు పోలీసులు ఆత్మహత్యలు చేసుకోవటాన్ని విలేకరులు ప్రశ్నించగా... ఇవి పూర్తిగా వారి వ్యక్తిగత, కుటుంబ సమస్యల కారణంగా చోటుచేసుకున్నవనీ, అయితే, కొంత పని ఒత్తిడి కూడా ఉండొచ్చని ఆయన అంగీకరించారు. వీటి నివారణ కోసం శాఖాపరంగా ఉన్నతాధికారులు సమావేశమై తగిన నివారణ చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. లగచర్లలో ఘటనకు పోలీసులు, రెవెన్యూ అధికారుల మధ్య సమన్వయ లోపం అనే ఆరోపణల్లో నిజం లేదని ఆయన కొట్టిపారేశారు. సంధ్య థియేటర్ ఘటనకు సంబంధించి వేసిన ప్రశ్నకు... ఈ అంశం కోర్టు పరిధిలో ఉన్నదనీ, తాను స్పందించటం భావ్యం కాదన్నారు. ట్రాఫిక్ చలాన్లను పెద్ద ఎత్తున విధిస్తున్నారనే విమర్శలపై స్పందిస్తూ.. చలాన్ విధించకపోతే వాహనదారులు దాదాపుగా ట్రాఫిక్ నిబంధనలు పాటించరనీ, గతంలో అనేక అనుభవాలున్నాయని చలాన్లను విధించటాన్ని ఆయన సమర్థించుకున్నారు. ట్రాఫిక్ నియంత్రణ విషయంలో రాచకొండ, సైబరాబాద్, హైదరాబాద్ పోలీసు అధికారులు సమన్వయంతో పని చేస్తున్నారనీ, అయితే కొన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ ఏర్పడటానికి అక్కడ రోడ్ల విస్తరణ సరిగ్గా లేకపోవటమే కారణమని డీజీపీ వ్యాఖ్యానించారు. గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం రాష్ట్రంలో 31వేలకు పైగా కేసులు ఎక్కువగా నమోదయ్యాయని ఆయన తెలిపారు. పోలీసు శాఖలో ఈ ఏడాది 13 వేల కానిస్టేబుళ్లు, 547 మంది ఎస్సైల నియామకం జరిగిందనీ, మరో 4వేల మంది టీజీఎస్పీ కానిస్టేబుళ్లు ఒకట్రెండ్రోజుల్లో విధుల్లో చేరబోతున్నారని ఆయన వివరించారు. పోలీసు శాఖలో వివిధ విభాగాలకు అవసరమైన వాహనాలనూ ఖరీదు చేశామని చెప్పారు.

రాష్ట్ర పోలీసులు సైబర్‌క్రైం, తదితర విభాగాల్లో సాధించిన ఫలితాలకు గానూ కేంద్రంతో పాటు అంతర్జాతీయ స్థాయిలలో అవార్డులను అందుకున్నామని డీజీపీ తెలిపారు. పోలీసుల సంక్షేమం విషయంలోనూ ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటున్నామనీ, ప్రభుత్వం సైతం విధి నిర్వహణలో మరణించిన పోలీసులకు ఇచ్చే నష్టపరిహారాన్ని భారీగా పెంచిందని చెప్పారు. రాష్ట్రంలో షీటీమ్‌లు, భరోసా కేంద్రాలలో మహిళలు, చిన్న పిల్లలకు సంబంధించిన కేసుల పరిష్కారంలో గుణాత్మక ఫలితాలు లభిస్తున్నాయనీ, ముఖ్యంగా అనాథ పిల్లలు, ఇండ్ల నుంచి తప్పిపోయినవారిని గుర్తించి తిరిగి వారి కుటుంబాల వద్దకు చేర్చటంలో షీటీమ్స్ నిర్వహిస్తున్న పాత్ర ప్రశంసనీయమన్నారు.

ఈ విలేకరుల సమావేశంలో ఇంటెలిజెన్స్ డీజీపీ శివధర్‌రెడ్డి, సీఐడీ డీజీపీ షికా గోయెల్, పోలీసు అకాడమీ డీజీపీ అభిలాష బిస్త్, రాచకొండ, సైబరాబాద్ కమిషనర్లు సుధీర్‌బాబు, అవినాశ్ మొహంతి, తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్‌కు సంబంధించి పిల్లలు, తల్లిదండ్రుల్లో అవగాహన పెంచే హ్యాండ్‌బుక్‌ను డీజీపీ ఆవిష్కరించారు.

నేరాల పట్టిక

	2023 (జనవరి నుంచి నవంబర్)	2024 (జనవరి నుంచి నవంబర్)
1.హత్యలు	789	856
2. ఆస్తి కోసం హత్యలు	59	83
3. దోపిడీ	42	58
4. దారిదోపిడీ	495	703
5. ఇండ్లల్లో చోరీలు	4803	5724
6. దొంగతనాలు	14393	19480
7. కిడ్నాప్, అపహరణ	1362	1525
8. లైంగికదాడు కేసులు	2284	2945
9. మోసాలు	22996	33618
10. సైబర్ క్రైమ్ మోసాలు	(16339)	(24643)
11. రోడ్డు ప్రమాదాలు	20702	23491
మరణాలు	6541	6640

'ఢిల్లీలో ఆపరేషన్ లోటస్'

(మొదటిపేజీ తరువాయి)

అర్థమైపోయింది. వారికి సీఎం అభ్యర్థి లేరు. దార్శనికత, విశ్వాసం కలిగిన వ్యక్తులు లేరు. అందుకే కాషాయ పార్టీ గెలుపు కోసం కొత్త ఎత్తుగడలు వేస్తోంది. ఎన్నికలను ప్రభావితం చేసేందుకు 'ఆపరేషన్ లోటస్' స్కామ్ ద్వారా డిసెంబరు 15 నుంచి విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. దీనిలో భాగంగా ఓటరు జాబితాను ట్యాంపరింగ్ చేసింది" అని కేజ్రీవాల్ ఆరోపించారు. "కొన్ని రోజులుగా న్యూఢిల్లీ అసెంబ్లీ నియోజకవర్గంలో బీజేపీ తన ఆపరేషన్‌ను కొనసాగిస్తోంది. ఈ 15 రోజుల్లో 5 వేల మంది ఓటర్లను తొలగించేందుకు కొత్తగా దరఖాస్తులు వచ్చాయి.

అంతేకాకుండా.. 7,500 మంది ఓటర్లను జాబితాలో చేర్చేందుకు అప్లికేషన్లు వచ్చాయి. 12 శాతం ఓట్లలో అవకతవకలు జరుగుతున్నాయి" అని కేజ్రీవాల్ ఆరోపించారు.ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ఒంటరిగానే పోటీ చేయనున్నట్టు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు 70 స్థానాలకు అభ్యర్థుల జాబితాను కూడా విడుదల చేసింది. కేజ్రీవాల్ న్యూఢిల్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేయనుండగా.. సీఎం ఆతిశీ మరోసారి కాల్కాజీ సీటు నుంచి బరిలో నిలుస్తున్నారు. ఎన్నికల సమయం సమీపిస్తున్న వేళ.. ఆయా పార్టీల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది.

పీఎస్ఎల్వీ సీ-60 ప్రయోగానికి కౌంట్‌డౌన్



సూళ్లూరుపేట: సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్)లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి నింగిలోకి దూసుకెళ్లేందుకు పీఎస్ఎల్‌వీ-సీ60 కౌంట్ డౌన్ ప్రక్రియ ప్రారంభమైంది. వాహకనౌక అనుసంధానం పూర్తయిన తర్వాత వివిధ పరీక్షలు నిర్వహించారు. వాహకనౌకలోని అన్ని దశలు పనిచేస్తున్నట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు. పీఎస్ఎల్‌వీ ప్రయోగానికి 25 గంటలపాటు కౌంట్‌డౌన్ నిర్వహించేలా శాస్త్రవేత్తలు నిర్ణయించారు. దీంతో ఆదివారం రాత్రి 8.58 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. ఇది నిరంతరాయంగా కొనసాగాక.. సోమవారం రాత్రి 9.58 గంటలకు పీఎస్ఎల్‌వీ-సీ60 కక్ష్యలోకి దూసుకెళ్లనుంది. అంతరిక్షంలోనే 2 చిన్న వ్యోమనౌకలను డాకింగ్, అన్ డాకింగ్ చేయగల సాంకేతికత అభివృద్ధే లక్ష్యంగా ఈ ప్రయోగం సాగనుంది.

పౌరసత్వాన్ని వదులుకుంటున్నారు

న్యూఢిల్లీ : గత 13 ఏండ్లలో 18 లక్షల మందికి పైగా భారతీయులు తమ పౌరసత్వాన్ని వదులుకున్నారు. 135 దేశాల జాతీయతను పొందారు. రాజ్యసభలో ప్రభుత్వ గణాంకాలు ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాయి. ఈ గణాంకాల ప్రకారం.. పౌరసత్వం కోసం భారతీయులు ఎంచుకున్న దేశాల జాబితాలో పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఫిజీ, మయన్మార్, థాయిలాండ్, నమీబియా, నేపాల్, శ్రీలంకలు కూడా ఉన్నాయి. అయితే, ఈ దేశాలు అభివృద్ధి విషయంలో భారత్ కంటే వెనకబడిన దేశాలు కావటం గమనార్హం. అయినప్పటికీ, ఈ దేశాల పౌరసత్వాన్ని భారతీయులు పొందారు. ఇవి కాకుండా భారతీయులు పౌరసత్వం కోసం ముఖ్యంగా యూఎస్, కెనడా, రష్యా, చైనా, ఈజిప్ట్, న్యూజిలాండ్, సింగపూర్, దక్షిణాఫ్రికా, స్పెయిన్, సూడాన్, స్విట్జర్లాండ్, ట్రినిడాడ్ అండ్ టొబాగో, యూకే, టర్కీ, యూఏఈ, వియత్నాం వంటి దేశాలను ఎంపిక చేసుకున్నారు. కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) సమర్పించిన సమాచారం ప్రకారం.. 2022లో రికార్డు స్థాయిలో 2,25,620 మంది భారతీయులు తమ పౌరసత్వాన్ని వదులుకున్నారు. 2023లో ఇది 2.16 లక్షలకు పైగా ఉన్నది. 2015 నుంచి 2023 వరకు 12 లక్షల మందికి పైగా భారతీయులు తమ పౌరసత్వాన్ని వదులుకొని, ఇతర దేశాల పౌరసత్వాన్ని పొందటానికి నిర్ణయించుకున్నారు. కరోనా మహమ్మారి విజృంభించిన ఏడాది అయిన 2020లో అత్యల్ప సంఖ్యలో 85,256 మంది భారతీయులు ఇతర దేశాల పౌరసత్వాన్ని ఎంచుకున్నారు.అయితే, భారతీయులు పౌరసత్వాన్ని వదులుకోవటానికి 'వ్యక్తిగతం' కారణంగా కేంద్రం వివరించింది. మెరుగైన కెరీర్ అవకాశాలు, జీవన నాణ్యత, మెరుగైన విద్యా అవకాశాలు వంటి కారణాలే భారత పౌరసత్వాన్ని వదులుకోవటానికి దారి తీస్తున్నాయని కొంత మంది నిపుణులు అంటున్నారు. కార్మికులు, ప్రొఫెషనల్స్, నిపుణులతో సహా దాదాపు 1.30 కోట్ల మంది భారతీయ పౌరులు ప్రస్తుతం విదేశాల్లో నివసిస్తున్నారని విదేశీ మంత్రిత్వశాఖ నివేదించింది.

నేడు ప్రత్యేక అసెంబ్లీ

(మొదటిపేజీ తరువాయి)

ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదివారం ఏర్పాట్లను పరిశీలించారు. అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి. నరసింహా చార్యులు పలు సూచనలు చేశారు. సభ్యులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. గతంలో లాగానే ఈ సమావేశాలకు కూడా రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు సహకారం అందించాలన్నారు. సభ్యులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుని సమావేశాలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఉన్నతాధికారులు, రాష్ట్ర డీజీపీ పోలీసు ఉన్నతాధికారులతో టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు.



చదరంగంలో కోనేరు హంపి (37) చరిత్ర సృష్టించింది. చైనా అమ్మాయి జు వెంజున్ తర్వాత అత్యధిక సార్లు ప్రపంచ ర్యాపిడ్ టైటిల్ సాధించిన ఘనత దక్కించుకుంది. ఆఖరు రౌండ్లో ఇండోనేసియా గ్రాండ్‌మాస్టర్ ఐరిన్ సుకందర్‌ను ఓడించిన కోనేరు హంపి రెండోసారి వరల్డ్ ర్యాపిడ్ విజేతగా నిలిచింది.

చెస్ క్వీన్ కోనేరు హంపి

ప్రపంచ ర్యాపిడ్ చాంపియన్‌గా తెలుగమ్మాయి

కెరీర్‌లో రెండోసారి వరల్డ్ టైటిల్ వశం

నవతెలంగాణ-న్యూయార్క్:

2024లో భారత్ చెస్‌కు మరో కిరీటం అందించింది. ఇటీవల దొమ్మరాజు గుకేశ్ ఫిడె ప్రపంచ చాంపియన్‌గా అవతరించగా.. తాజాగా తెలుగమ్మాయి కోనేరు హంపి (37) ఫిడె ప్రపంచ ర్యాపిడ్ చాంపియన్‌షిప్ విజేతగా నిలిచింది. 2019లో తొలిసారి ప్రపంచ ర్యాపిడ్ టైటిల్ సాధించిన హంపి.. 2012లో మూడో స్థానంలో, 2023లో రన్నరప్‌గా నిలిచింది. వరల్డ్ ర్యాపిడ్ చాంపియన్‌షిప్స్‌లో నాలుగుసార్లు టాప్-3లో నిలిచిన గ్రాండ్‌మాస్టర్ ఘనతను హంపి సొంతం చేసుకుంది.


> పదో సీడ్‌గా ఆడాను. కొందరు ప్రత్యర్థులది నా వయసులో సగం. తొలి రౌండ్లో ఓటమి ఎదురైనా పుంజుకున్నాను. కొన్ని గేముల్లో టై బ్రేకర్లలో ఓటమి బాధించింది. ఈ విజయం నాకు ఎంతో ప్రత్యేకం.
> **- కోనేరు హంపి**

పదో సీడ్‌గా మొదలెట్టి : కోనేరు హంపి వయసు 37. టోర్నీలో ఆమె సీడింగ్ 10. టైటిల్ రేసులో హంపిని ఎవరూ ఫేవరేట్‌గా పరిగణించలేదు. కానీ హంపి ర్యాపిడ్ రౌండ్‌లో రఫ్ఫాడించింది. ఆఖరు రౌండ్ ఆరంభానికి ముందు సంయుక్తంగా అగ్రస్థానంలో కొనసాగిన హంపి.. చివరి రౌండ్‌లో అద్భుత విజయం సాధించింది. ఇండోనేషియా గ్రాండ్‌మాస్టర్ ఐరిన్ సుకందర్‌పై నల్ల పావులతో ఎత్తులు వేసి విజయాన్ని అందుకుంది. ఇతర గేముల్లో ఎవరూ ఫలితం రాబట్టలేదు. 8.5 పాయింట్లతో హంపి అగ్రస్థానంలో నిలిచి టైటిల్‌ను సొంతం చేసుకుంది. చైనా గ్రాండ్‌మాస్టర్ జు వెంజున్ (8), లాగ్నో (8), టాన్ (8), ద్రోణవల్లి హారిక (8), అఫ్రూజ (8), అలెగ్జాండ్ర (8)లు 0.5 పాయింట్ల తేడాతో టాప్-7లో నిలిచారు. ఓపెన్ విభాగంలో రష్యా గ్రాండ్‌మాస్టర్‌లో వొలోదార్ మర్జిన్ (18) విజేతగా నిలిచాడు. అర్జున్ ఎరిగేశి ఐదో స్థానంతో సరిపెట్టుకున్నాడు. ఆఖరు రోజు నాలుగు రౌండ్లలో అర్జున్ రెండు పాయింట్లే సాధించాడు. 9 పాయింట్లతో నిలిచిన అర్జున్ క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధించేందుకు రానున్న టోర్నీల్లో సత్తా చాటాల్సి ఉంది. ప్రపంచ బ్లిట్జ్ చాంపియన్‌షిప్ డిసెంబర్ 31 నుంచి ఆరంభం కానుంది.

పడగొట్టినా.. తోక మిగిలే!

- బుమ్రా నాలుగు వికెట్ల ప్రదర్శన
- లబుషేన్, కమిన్స్ ప్రతిఘటన
- ఆసీస్ రెండో ఇన్నింగ్స్ 228/9
- భారత్ తొలి ఇన్నింగ్స్ 369/10

బాక్సింగ్ డే టెస్టు నాల్గో రోజు



నవతెలంగాణ-మెల్‌బోర్న్

జశ్‌ప్రీత్ బుమ్రా (4/56), మహ్మద్ సిరాజ్ (3/66) నిప్పులు చెరిగారు. బుమ్రా మిడిల్ ఆర్డర్‌ను కకావికలం చేయగా.. టాప్ ఆర్డర్ సంగతి సిరాజ్ చూసుకున్నాడు. కానీ, మార్నస్ లబుషేన్ (70, 139 బంతుల్లో 3 ఫోర్లు), పాట్ కమిన్స్ (41, 90 బంతుల్లో 4 ఫోర్లు), నాథన్ లయాన్ (41 నాటౌట్, 54 బంతుల్లో 5 ఫోర్లు) రాణించటంతో ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో మంచి స్కోరు దిశగా సాగుతోంది. 82 ఓవర్లలో 9 వికెట్లకు 228 పరుగులు చేసిన ఆస్ట్రేలియా.. నాల్గో రోజు ఆట ముగిసే సమయానికి 333 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. అంతకుముందు, నితీశ్ కుమార్ రెడ్డి (114, 189 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్స్), వాషింగ్టన్ సుందర్ (50) రాణించటంతో భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 369 పరుగులు చేసింది. ఆస్ట్రేలియా 105 పరుగుల భారీ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కించుకుంది. ఆసీస్ బౌలర్లు పాట్ కమిన్స్, స్కాట్ బొలాండ్, నాథన్ లయాన్‌లు మూడేసి వికెట్లు పడగొట్టారు.

బుమ్రా, సిరాజ్ అదుర్స్

ఆసీస్ పర్యటనలో సిరాజ్ నిలకడగా విఫలమయ్యాడు. మెల్‌బోర్న్‌లో కీలక సమయంలో సిరాజ్ వికెట్ల వేట సాగించటం భారత్‌కు కలిసొచ్చింది. ఆసీస్ యువ ఓపెనర్ శామ్ కాన్‌స్టాస్ (8)ను క్లీన్‌బౌల్డ్ చేసిన బుమ్రా.. భారత్‌కు అదిరే బ్రేక్ అందించాడు. మరో ఓపెనర్ ఉస్మాన్ ఖవాజా (21)ను సాగనంపి సిరాజ్ వికెట్ల వేటలో జత కలిశాడు. బుమ్రా, సిరాజ్ జోరుతో ఉదయం సెషన్లోనే ఆసీస్ ఓపెనర్లను కోల్పోయింది. లంచ్ విరామానికి 53/2తో నిలిచింది. ఓ ఎండ్‌లో మార్నస్ లబుషేన్‌తో కలిసి ఇన్నింగ్స్ నిర్మించే పనిలో పడిన స్టీవ్ స్మిత్ (13) సిరాజ్ అవుట్ చేయటంతో.. మిడిల్ ఆర్డర్ కథ బుమ్రా ముగించాడు. అక్కడ్నుంచి వరుస ఓవర్లలో వికెట్లు పడ్డాయి. బుమ్రా ఒకే ఓవర్లో ప్రమాదకర ట్రావిశ్ హెడ్ (1), మిచెల్ మార్ష్ (0)లను అవుట్ చేశాడు. ఆ తర్వాతి ఓవర్లో వికెట్ కీపర్ అలెక్స్ కేరీ (2) వికెట్లను గాల్లో ఎగరేశాడు. 80/2తో సాఫీగా సాగుతున్న ఆసీస్ ఇన్నింగ్స్.. బుమ్రా దెబ్బకు 91/6తో కష్టాల్లో కూరుకుంది.

మెరిసిన లబుషేన్

బ్యాటింగ్ లైనప్‌లో అందరూ విఫలమైనా.. మార్నస్ లబుషేన్ (70) నిలబడ్డాడు. బుమ్రా బుల్లెట్ల ఒత్తిడిని తట్టుకుని వికెట్ కాపాడుకున్నాడు. కెప్టెన్ పాట్ కమిన్స్ (41)తో కలిసి లబుషేన్ కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. 105 బంతుల్లో 2 ఫోర్లతో మరో అర్ధ సెంచరీ సాధించాడు. కమిన్స్, లబుషేన్ ఏడో వికెట్‌కు 116 బంతుల్లోనే 57 పరుగులు జోడించారు. లబుషేన్‌ను సిరాజ్ అవుట్ చేయటం, మిచెల్ స్టార్క్ (5) రనౌట్‌తో ఆసీస్ కథ ముగిసిందనే అనుకున్నారు. కానీ కమిన్స్ తరహాలో నాథన్ లయాన్ (41 నాటౌట్) దంచికొట్టాడు. స్కాట్ బొలాండ్ (10 నాటౌట్)తో కలిసి పదో వికెట్‌కు అజేయంగా 55 పరుగులు జోడించాడు. దీంతో ఆసీస్ ఆధిక్యం 333 పరుగులకు చేరుకుంది. నాల్గో రోజు ఆట ఆఖర్లో బుమ్రాకు లయాన్ చిక్కినా.. నో బాల్ తప్పిదంతో భారత్‌కు నిరాశ తప్పలేదు. స్లిప్స్‌లో రాహుల్ నాటకీయంగా క్యాచ్ అందుకున్నా.. నో బాల్‌తో లయాన్ బతికిపోయాడు.

స్కోరు వివరాలు :

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 474/10

భారత్ తొలి ఇన్నింగ్స్: 369/10

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ : శామ్ కాన్‌స్టాస్ (బి) బుమ్రా 8, ఉస్మాన్ ఖవాజా (బి) సిరాజ్ 21, మార్నస్ లబుషేన్ (ఎల్బీ) సిరాజ్ 70, స్టీవ్ స్మిత్ (సి) పంత్ (బి) సిరాజ్ 13, ట్రావిశ్ హెడ (సి) నితీశ్ (బి) బుమ్రా 1, అలెక్స్ కేరీ (బి) బుమ్రా 2, పాట్ కమిన్ (సి) రోహిత్ (బి) జడేజా 41, నాథన్ లయాన్ నాటౌట్ 41, స్కాట్ బొలాండ్ నాటౌట్ 10, ఎక్స్‌ట్రాలు : 16, **మొత్తం : (82 ఓవర్లలో 9 వికెట్లకు) 228.**

వికెట్ల పతనం : 1-20, 2-43, 3-80, 4-85, 5-85, 6-91, 7-148, 8-156, 9-173.

బౌలింగ్ : జశ్‌ప్రీత్ బుమ్రా 24-7-56-4, ఆకాశ్ దీప్ 17-4-53-0, మహ్మద్ సిరాజ్ 22-4-66-3, రవీంద్ర జడేజా 14-2-33-1, నితీశ్ కుమార్ రెడ్డి 1-0-4-0, వాషింగ్టన్ సుందర్ 4-0-7-0.

బుమ్రా @ 200

డెన్నిస్ లిల్లీ, వకార్ యూనిస్, డేల్ స్టెయిన్, ఇయాన్ బోథమ్, జోయెల్ గార్నర్, అలెన్ డొనాల్డ్ వంటి దిగ్గజ పేసర్లు బుమ్రా (44) కంటే తక్కువ మ్యాచుల్లో 200 వికెట్ల మార్క్ అందుకున్నారు. కానీ సగటులో బుమ్రా.. దిగ్గజాలను వెనక్కి నెట్టాడు. 200 టెస్టు వికెట్ల కోసం కేవలం 3912 పరుగులే ఇచ్చాడు. సగటు 19.56 మాత్రమే. జోయెల్ గార్నర్ (4067), షాన్ పొలాక్ (4077)లు వరుసగా 20,34, 20.39 సగటుతో తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఇక స్ట్రయిక్‌రేట్‌లోనూ బుమ్రా ప్రతి 42.4 బంతులకు ఓ వికెట్ ఖాతాలో వేసుకున్నాడు. బుమ్రా 200 వికెట్ల వేటలో 8484 బంతులు సంధించగా.. వకార్ యూనిస్ (7725), డెల్ స్టెయిన్ (7848), కగిసో రబాడ (8154)లు పేస్ దళపతి కంటే ముందున్నారు. ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ గడ్డపై బుమ్రా రికార్డు అమోఘం. బుమ్రా కెరీర్‌లో 202 వికెట్లు పడగొట్టగా.. అందులో 70.3 శాతం వికెట్లు (142) ఈ దేశాల్లోనే సాధించినవే. స్వదేశంలో 12 మ్యాచుల్లో 17.20 సగటు, 35.5 స్ట్రయిక్‌రేట్‌తో 47 వికెట్లు పడగొట్టగా.. విదేశీ గడ్డపై 32 టెస్టుల్లో 20.29 సగటు, 44.5 స్ట్రయిక్‌రేట్‌తో 153 వికెట్లు తీసుకున్నాడు. ఇక భారత్ సాధించిన 20 టెస్టు విజయాల్లో బుమ్రా 14.4 సగటుతో ఏకంగా 110 వికెట్లు పడగొట్టాడు.



చాంపియన్ హర్యానా స్టీలర్స్

ఫైనల్లో పట్నా పైరేట్స్‌పై ఘన విజయం

పుణె (మహారాష్ట్ర) : హర్యానా స్టీలర్స్ ప్రొ కబడ్డీ లీగ్ 11వ సీజన్ చాంపియన్‌గా నిలిచింది. ఆదివారం పుణెలో జరిగిన పీకెఎల్ 11 ఫైనల్లో మూడు సార్లు చాంపియన్ పట్నా పైరేట్స్‌పై 32-23తో హర్యానా స్టీలర్స్ ఘన విజయం సాధించింది. గత సీజన్ ఫైనల్‌కు చేరినా టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచిపోయిన హర్యానా స్టీలర్స్.. ఈసారి వదల్లేదు. ఆరంభం నుంచీ దూకుడుగా ఆడిన స్టీలర్స్ కూతలో, పట్టులో పైరేట్స్‌పై పైచేయి సాధించింది. 15-12తో ప్రథమార్థంలో ముందంజ వేసిన స్టీలర్స్.. ద్వితీయార్థంలో మరింత దూకుడు చూపించింది. పట్నాను ఓ సారి ఆలౌట్ చేసి తిరుగులేని ఆధిక్యం సాధించింది. స్టీలర్స్ తరఫున శివమ్ (9), మహ్మద్‌రెజా (7), వినయ్ (6), రాహుల్ (3), జైదీప్ (2) సమిష్టిగా మెరిశారు. పట్నా పైరేట్స్ ఆటగాళ్లలో గుర్దీప్ (6), దేవాంక్ (5), అయాన్ (3) మెరిసినా..9 పాయింట్ల తేడాతో పరాజయం తప్పలేదు. హర్యానా స్టీలర్స్‌కు ఇది తొలి టైటిల్ విజయం.

జాతీయ ఫెన్సింగ్ పోటీలకు 24 మంది ఎంపిక




హైదరాబాద్ : జాతీయ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు తెలంగాణ నుంచి 24 మంది ఫెన్సర్లు ఎంపికయ్యారు. డెక్కన్ ఫెన్సింగ్ క్లబ్‌లో జరిగిన క్యాడెట్ అండర్-17 సెలక్షన్ ట్రయల్స్‌లో 49 మంది పోటీపడగా, ప్రతిభావంతులైన జాతీయ పోటీలకు ఎంపిక చేశారు. 'ఫెన్సింగ్ క్రీడకు ఉజ్వల భవిష్యత్ ఉంది. క్రికెట్‌తో పాటు ఇతర క్రీడలు అభివృద్ధి చెందితేనే భారత్ క్రీడా దేశం ఎదుగుతుందని' హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్ అన్నారు. జాతీయ పోటీలకు ఎంపికైన ఫెన్సర్లను సెలెక్షన్ కమిటీ సభ్యుడు ఎల్.సందీప్ కుమార్ జాదవ్ అభినందించారు.



విజయాలు వివాదాలూ.. సంచలనమే

నవచిత్రం








ఈ
ఏడాది తెలుగు సినిమాలు
దిమ్మ తిరిగే కలెక్షన్లను కొల్లగొట్టాయి.
భారీ వసూళ్ళతో
దేశ సినిమా చరిత్రలోనే
సరికొత్త రికార్డులను సృష్టించాయి.
ఈ కలెక్షన్ల పరంపరతో నేషనల్, ఇంటర్నేషనల్ లెవల్‌లో
తెలుగు సినిమా శభాష్ అనిపించుకుంది.
అయితే విజయాలు ఎంతగా సంచలనం సృష్టించాయో,
అదే స్థాయి వివాదాలతో టాలీవుడ్ టాక్ ఆఫ్ ది
వరల్డ్ అయ్యింది.

పాన్ ఇండియా మార్కెట్‌లో ఈ ఏడాది మన తెలుగు సినిమాలు భారీ వసూళ్ళతో సంచలన విజయాలను నమోదు చేసుకున్నాయి.

- కేవలం 21 రోజుల్లో రూ.1705 కోట్ల రూపాయలను కలెక్ట్ చేసి 'పుష్ప 2 : ది రూల్' సినిమా సరికొత్త రికార్డ్ నెలకొల్పింది. అంతేకాదు దేశ సినిమా చరిత్రలోనే అరుదైన రికార్డ్‌ని సొంతం చేసుకుంది. వందేళ్ల బాలీవుడ్ సినిమాల కలెక్షన్లని సైతం ఈ సినిమా దాటేసి, అక్కడ కూడా తెలుగు సినిమా సత్తా ఏమిటో నిరూపించింది. సుకుమార్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా భారీ కలెక్షన్లను కొల్లగొట్టింది. సినిమా ప్రదర్శన ఇంకా కొనసాగుతుండటంతో ఇది కచ్చితంగా రూ.2 వేల అల్లుఅర్జున్, సుకుమార్ కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'పుష్ప'. ఈ సినిమా సైతం విశేష ప్రేక్షకాదరణ పొంది, మంచి కలెక్షన్లని సొంతం చేసుకుంది. ఇదే సినిమాలోని నటనకు జాతీయ ఉత్తమ నటుడిగా అల్లుఅర్జున్ ఎంపికయ్యారు. ఇది కూడా రికార్డే. ఇన్నేళ్ళ భారతీయ చలన చిత్ర పురస్కారాల చరిత్రలో ఏ తెలుగు నటుడు ఇంత వరకు జాతీయ ఉత్తమ నటుడిగా ఎంపికవ్వలేదు. ఈ అరుదైన ఫీటు సాధించిన నటుడిగా అల్లుఅర్జున్ నిలిచారు. 'పుష్ప'కి సీక్వెల్‌గా రూపొందిన 'పుష్ప 2' చిత్రం ఇప్పుడు వరల్డ్‌వైడ్‌గా అనూహ్య కలెక్షన్లతో వీరవిహారం చేస్తోంది.
- ఇక ప్రభాస్ 'కల్కి 2898 ఏడి' సినిమాతో మరోసారి వెయ్యి కోట్ల క్లబ్‌లోకి చేరారు. 'బాహుబలి 2, కల్కి' సినిమాలతో వెయ్యి కోట్ల క్లబ్‌లోకి రెండుసార్లు చేరిన తొలి దక్షిణాది కథానాయకుడిగా ప్రభాస్ నిలిచారు. అమితాబ్ బచ్చన్, దీపికాపదుకొనె వంటి హేమాహేమీలతో నాగ్‌అశ్విన్ తెరకెక్కించిన ఈ సినిమా వసూళ్ళ పరంగా పాన్ ఇండియా స్థాయిలో సత్తా చాటింది.
- ఎన్టీఆర్, కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'దేవర 1'. ఈ సినిమా దాదాపు రూ.450 కోట్ల గ్రాస్‌ని కలెక్ట్ చేసింది. దేవర, వర రెండు పాత్రలతో ఎన్టీఆర్ ప్రేక్షకుల్ని అలరించారు. ఈ సినిమాకి కొనసాగింపుగా 'దేవర పార్ట్ 2' త్వరలోనే తెరకెక్కనుంది.
- మహేష్‌బాబు, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వచ్చిన మూడవ సినిమా 'గుంటూరు కారం'. 'అతడు', 'ఖలేజ' తర్వాత వీరి కాంబోలో వస్తున్న సినిమా కావడంతో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అయితే టాక్ పరంగా ఈ సినిమా ఆ అంచనాలను అందుకోలేక పోయింది. కానీ కలెక్షన్ల పరంగా డీసెంట్‌గా నెంబర్స్‌ని కలెక్ట్ చేసింది. బాక్సాఫీస్ దగ్గర దాదాపు రూ.180 కోట్ల గ్రాస్‌ని రాబట్టింది.
- పాన్ ఇండియాలో స్థాయిలో బాగా హల్‌చల్ చేసిన తెలుగు సినిమాగా 'హను-మాన్' నిలిచింది. తేజ సజ్జా, ప్రశాంత్ వర్మ కాంబినేషన్‌లో రూపొందిన ఈ సూపర్‌హీరో సినిమా ఏకంగా రూ.350 కోట్ల గ్రాస్‌ని కలెక్ట్ చేసి, అందర్నీ సర్‌ప్రైజ్ చేసింది. స్టార్లు లేకపోయినా కథలో స్ట్రాంగ్ కంటెంట్ ఉంటే సాలీడ్ కలెక్షన్లను కొల్లగొట్టొచ్చని ఈ సినిమా ప్రూవ్ చేసింది.



- మెగాస్టార్ స్టార్ చిరంజీవి గిన్నీస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకుని అరుదైన రికార్డ్‌ని సొంతం చేసుకున్నారు. ఆయన తన 46 ఏండ్ల సినిమా కెరీర్‌లో 156 సినిమాల్లో 537 పాటల్లో 24వేలకు పైగా భిన్న డ్యాన్స్ స్టెప్పులతో ప్రేక్షకులను అలరించారు. ఇది ప్రపంచంలోని ఏ నటుడికి సాధ్యం కాని ఫీటు అంటూ మెగాస్టార్‌ని గిన్నీస్ వరల్డ్ రికార్డ్ గుర్తించింది.
- ఈ ఏడాది జరిగిన ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అన్ని స్థానాల్లో విజయ దుందుభి మోగించి, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ సంచలనం సృష్టించారు. ఏపీ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలను స్వీకరించారు. ఓ హీరో ఉప ముఖ్యమంత్రిగా మారిన వైనం దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించింది.
- నిఖిల్ హీరోగా, చందూ మొండేటి దర్శకతంలో అభిషేక్ అగర్వాల్ నిర్మించిన చిత్రం 'కార్తికేయ 2'. 70వ జాతీయ చలన చిత్ర పురస్కారాల్లో ఈ సినిమా జాతీయ ప్రాంతీయ ఉత్తమ తెలుగు చిత్రంగా పురస్కారాన్ని దక్కించుకుంది.

అనేక వివాదాలు ఈ ఏడాది టాలీవుడ్‌ని హెడ్ లైన్స్‌లో నిలిపాయి.

- యువ కథానాయకుడు రాజ్ తరుణ్ పై లావణ్య అనే యువతి చీటింగ్ కేసు పెట్టింది. పదేళ్ళు తనతో సహజీవనం చేసి, చాలాసార్లు గర్భం తీయించి, తనని అన్ని విధాలుగా దారుణంగా మోసం చేశాడని రాజ్ తరుణ్ పై లావణ్య తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేసింది. ఆమె పోలీసులను ఆశ్రయించడంతో ఈ వివాదం హాట్ టాపిక్‌గా మారి, చాలా రోజులు హల్‌చల్ చేసింది.
- లైంగిక వేధింపుల కేసులో జానీ మాస్టర్ అరెస్ట్ అయ్యారు. ఆయనపై తన సహాయకురాలు శ్రేష్టి శర్మ ఈ కేసు పెట్టింది. బెయిల్ మీద ఆయన బయటికి వచ్చినప్పటికీ తనకి వచ్చిన జాతీయ అవార్డుని కేంద్రం వెనక్కి తీసుకోవడంపై పెద్ద ఎత్తున చర్చ జరిగింది. 70వ జాతీయ చలన చిత్ర పురస్కారాల్లో ఉత్తమ కొరియోగ్రాఫర్‌గా 'మేఘం కారుకథ..' పాటకు జానీ మాస్టర్ ఎంపికయ్యారు.
- నటుడు మోహన్‌బాబు కుటుంబ కలహాలు రచ్చకెక్కాయి. కొన్నాళ్ళుగా సైలెంట్‌గా ఉన్న కుటుంబ గొడవలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. మోహన్‌బాబు తనచిన్న కొడుకు మనోజ్ వలన హాని ఉందని కేసు పెడితే, దీనికి ప్రతిగా మనోజ్ ఆయనపై కేసు పెట్టాడు. పదిపేజీల లేఖ రిలీజ్ చేశాడు. ఆస్తుల కోసం కాదు ఇది తన ఆత్మగౌరవ పోరాటం అన్నాడు. మీడియాని వెంటబెట్టుకొని మోహన్‌బాబు ఇంటికి వెళ్ళాడు. ఈ గొడవలో సహనం కోల్పోయిన మోహన్ బాబు మీడియా ప్రతినిధి పై దాడి చేశారు. ఈ దాడి నేపథ్యంలో మోహన్‌బాబుపై పలు సెక్షన్ల కింద పోలీసులు కేసులు నమోదు చేశారు. అలాగే మీడియాపై మోహన్‌బాబు దాడి చేయడంపై జర్నలిస్టులు సైతం తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. దీంతో ఈ ఇష్యూ హాట్ టాపిక్‌గా మారింది.



- ఓ సినిమా విడుదల సందర్భంగా టీడీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై వర్మ కించపరిచేలా పోస్టులు చేశారనే ఫిర్యాదు రావడంతో దర్శకుడు రామ్ గోపాల్ వర్మపై ఏపీ పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే నటి కస్తూరి తెలుగు ప్రజలపై చేసిన వాఖ్యలు వివాదస్పదమవ్వడంతో ఆమెపై కేసులు నమోదయ్యాయి.
- 'పుష్ప 2 : ది రూల్' సినిమాతో సరికొత్త రికార్డులు సృష్టించిన అల్లుఅర్జున్ అరెస్ట్ నేషనల్ లెవెల్‌లో సంచలనం అయ్యింది. 'పుష్ప2' బెనిఫిట్ షో సమయంలో జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ చనిపోయింది, ఆమె కొడుకు శ్రీతేజ్ తీవ్రంగా గాయపడి చావుబతుకుల మధ్య చికిత్స పొందుతున్నాడు. ఏది ఏమైనప్పటికీ 'పుష్ప2' ఇచ్చిన విజయం కంటే ఈ విషాదమైన వివాదమే దేశవ్యాప్తంగా సంచలనంగా మిగిలింది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.